ఆంధ్రభూమి

సంపుటి: 29 • సంచిక: 250 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శుక్రవారం 9 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
కృష్ణపక్షం; తిథి: నవమి మ.2.23;
నక్షత్రం: అనూరాధ రా.7.01;
వర్జ్యం: రా.1.08 నుండి 2.52 వరకు;
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12
వరకు, తిరిగి మ.12.24 నుండి 01.12 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు

న్యాయం కావాలి

కేంద్ర ధోరణిపై ఆంధ్రావని ముక్తకంఠం • స్వచ్ఛందంగా బంద్..ఆగిన బస్సులు

పనిచేయని విద్యాసంస్థలు • సినిమా ప్రదర్శనలూ రద్దు • టీడీపీ సంఘీభావ ర్యాలీ • గుండు గీయించుకున్న బోడె ప్రసాద్



విజయవాడలో వెలవెలబోతున్న రామవరప్పాడు రింగ్‌రోడ్డు





విజయవాడలో కదలని బస్సులు, గుండు గీయించుకుంటున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

మాకు న్యాయం చేయండంటూ ఆంధ్రావని ముక్తకంఠంతో నినదించింది. రాష్ట్రంపై కేంద్ర వివక్షను ఎలుగెత్తి చాటింది. బడ్జెట్‌లో రిక్తహస్తానికి నిరసనగా రాష్ట్రం యావత్తూ స్వచ్ఛందంగా బంద్ పాటించింది. బస్సులు నవడలేదు.విద్యా సంస్థలు పనిచేయలేదు. కేంద్రం వివక్షకు నిరసనగా పలు రాజకీయ పక్షాలు నిర్వహించిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. సినిమా హాళ్లలో ఉదయం ఆటలు రద్దయ్యాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు జరిగాయి. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, సభలు, సమావేశాలు జరిగాయి. కేంద్రం ఈ రాష్ట్రానికి 'గుండు సున్నా' ఇచ్చిందంటూ పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఉయ్యూరులో గుండు గీయించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో కిల్లి కృపారాణి, డీసీసీ అధ్యక్షుడు డొల్ల జగన్నాధంను పోలీసులు అరెస్ట్ చేశారు.



గురువారం లోక్‌సభలో మాట్లాడుతున్న అరుణ్‌జైట్లీ

త్వరలో ప్యాకేజీ

ఆంధ్రప్రదేశ్ డిమాండ్‌పై లోక్‌సభలో జైట్లీ హామీ

అధికారులతో చర్చిస్తున్నామని వెల్లడి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్‌కు ప్రకటించిన ప్యాకేజీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ప్రత్యేక హోదాకు బదులుగా ఇవ్వవలసిన నిధులు, బడ్జెట్ రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు కేంద్రం ఇవ్వవలసిన నిధులపై కూడా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరుపుతున్నామని, కొద్ది రోజుల్లో దీనిపై ఒక అంగీకారానికి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సమస్యలకు మంచి పరిష్కారం చూపించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అరుణ్‌జైట్లీ 2018-19 వార్షిక బడ్జెట్‌పై లోక్‌సభలో జరిగిన చర్చకు బదులిచ్చే సమయంలో ఏపీకి అందజేయవలసిన సహాయం గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇస్తూనే ఉంటామన్న ఆయన విభజన వలన ఏపీకి నష్టం కలిగిందని అంగీకరించారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటును తమ పార్టీ బలపరిచిందని, అయితే విభజన మూలంగా నష్టం కలిగింది కాబట్టే ఏపీకి ఒక ప్యాకేజీని - మిగతా 6వ పేజీలో

వారికీ ప్రసూతి సెలవు

• 'సరోగసీ'తో పిల్లలను పొందిన ఉద్యోగినులకు వర్తింపు

• కేంద్రప్రభుత్వ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: అద్దెగర్భం (సరోగసీ) ద్వారా పిల్లలు కలిగిన కేంద్రప్రభుత్వ ఉద్యోగినులకు కూడా సాధారణ గర్భిణుల మాదిరిగా ప్రసూతి సెలవు వర్తిస్తుందని సంబంధిత మంత్రిత్వశాఖ అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. వేతనంతో కూడిన 26 వారాల (180 రోజుల) సెలవును వారు పొందవచ్చునని ఆ ఉత్తర్వులో స్పష్టం చేశారు. 2015లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రిత్వశాఖ అన్ని కేంద్రప్రభుత్వ సంస్థలకు సమాచారం పంపింది. ఈ అంశా న్ని సవివరంగా ఉద్యోగవర్గాలకు చేరవేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలని ఆ ఉత్తర్వులలో ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రతిని కూడా ఆ ఉత్తర్వులకు జతపరిచింది. అద్దెగర్భం ద్వారా కవల పిల్లలను పొందిన తనకు ప్రసూతి సెలవు మంజూరు చేసేందుకు నిరాకరించారని, తనకు న్యాయం చేయాలని కేంద్రీ య విద్యాలయం ఉపాధ్యాయుని ఒకరు కోర్టును ఆశ్రయించగా కోర్టు స్పందించి సరోగసీ తల్లులకు కూడా ప్రసూతి సెలవు వర్తింప చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. 'అద్దెగర్భం'తో ఉన్న ఉద్యోగిని, అద్దెగర్భం ద్వారా పిల్లలను పొందిన ఉద్యోగినులలో ఎవరికి, ఎప్పుడు సెలవు ప్రసూతి సెలవు ఇవ్వాలన్న విషయంలో సరైన నిర్ణయాన్ని సంబంధిత అధికారులు తీసుకోవాలని కోర్టు సూచించింది.

విభజన హామీల అమలులో విఫలం

• కేంద్రంపై పవన్ ధ్వజం

• జయప్రకాశ్ నారాయణ్‌తో చర్చలు

• ప్రత్యేక హోదా జాక్‌పై మంతనాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు సీరియస్‌గా రంగంలోకి దిగిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్‌తో గురువారం నాడు భేటీ అయ్యారు. ఏపీ విభజన హామీల సాధన కోసం ఐక్య కార్యాచరణ సమితి అవసరమని అభిప్రాయపడిన పవన్ కళ్యాణ్ మేధావులతో దానిని ఏర్పాటు చేయనున్నట్టు ఇప్పటికే తెలిపారు. ఐకాస ఏర్పాటుతో పాటు పార్లమెంటులో ఎంపిల ఆందోళన అంశాలపై జయప్రకాశ్ నారాయణ్‌తో పవన్ - మిగతా 6వ పేజీలో

ఎన్‌డీఏలో బీజేపీకి సెగ

పెద్దన్న తీరుపై ప్రధాన పార్టీల అసంతృప్తి

వైవీ కృష్ణారెడ్డి

కర్నూలు, ఫిబ్రవరి 8: దేశంలోని 48 రాజకీయ పార్టీలతో కూడిన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)లో పెద్దన్న పాత్ర పోషిస్తున్న భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకత ఎదురవుతోంది. ఎన్‌డీఏలో కీలకంగా ఉన్న మూడు ప్రధాన పార్టీలైన శివసేన, శిరోమణి అకాళీదల్, తెలుగుదేశం పార్టీలు బీజేపీ తీరుపై అసంతృప్తితో ఉన్నాయి. తన మిత్రపక్షాలతో అవసరం లేనంతగా సొంతబలం ఉన్న బీజేపీ తమను నమ్ముకున్న పార్టీలకు సైతం న్యాయం చేయలేకపోతోందన్న విమర్శను ఎదుర్కొంటోంది. దీంతో జాతీయస్థాయిలో బీజేపీతో స్నేహం చేయడానికి ఇతరపక్షాలు ఇష్టపడవన్న ఆందోళన ఆ పార్టీ పెద్దల్లో కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. లోక్‌సభలో మొత్తం స్థానాలు 545 కాగా ప్రస్తుతం 537 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో ఎన్‌డీఏ బలం లోక్‌సభ స్పీకర్‌తో కలుపుకుని 333. ఈ సభ్యుల్లో ఎన్‌డీఏలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న బీజేపీకి లోక్‌సభ సభాపతి, ఇద్దరు నామినేటెడ్ సభ్యులతో కలిపి మొత్తం 275 మంది సభ్యుల బలం ఉంది. మిత్రపక్షాలైన శివసేన 18, టీడీపీ 16, శిరోమణి అకాళీదల్ 4, లోక్‌జనశక్తి 6, ఆర్‌ఎల్‌ఎస్‌పీ 4, అప్నాదల్ 3, జెడీయూ 2, ఎన్‌పీఎఫ్ 2, ఎన్‌పీపీ, ఎఐఎన్‌ఆర్, జేకేపీడీపీ, ఎస్‌డీఎఫ్‌లకు ఒక్కో సభ్యుడు ఉన్నారు. ఎన్‌డీఏలోని ఇతర పార్టీలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. రాజ్యసభలో మొత్తం స్థానాలు 245 కాగా ప్రస్తుతం 239 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో ఎన్‌డీఏ బలం 83 మాత్రమే. ఈ సభ్యుల్లో బీజేపీ 58, టీడీపీ 6, శివసేన 3, అకాళీదల్ 3, జేడీయూ 7, ఎస్‌డీఎఫ్ 1, జేకేపీడీపీకి చెందిన ఇద్దరు సభ్యులు ఉన్నారు. కాగా లోక్‌సభలో సొంత బలం ఉన్న బీజేపీకి రాజ్యసభలో మాత్రం కనీస బలం కూడా లేని విషయం విదితమే. దీని కారణంగా పలు బిల్లుల ఆమోదానికి రాజ్యసభలో బీజేపీ ఇబ్బందులు పడుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక లోక్‌సభలో సొంత బలం ఉన్నా ఎన్నికలకు ముందు కలిసి పనిచేసిన కారణంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు సమయంలో తమ మిత్రపక్షాలకు తగిన ప్రాధాన్యనిచ్చారు. అయితే కాలక్రమంలో ఎన్‌డీఏలో బీజేపీ తీరును వ్యతిరేకిస్తూ శివసేన ఎదురుదాడి ప్రారంభించింది. ఆ పార్టీ తీరుపై శివసేన బహిరంగ విమర్శలు చేస్తున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర విభజన సమయంలో చట్టంలో పొందుపర్చిన అంశాలు, ప్రధాని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని టీడీపీ చేస్తున్న ఆందోళనకు ఎన్‌డీఏలో మిత్రపక్షమైన శిరోమణి అకాళీదల్ మద్దతునివ్వడంతో బీజేపీకి ఇబ్బంది ఎదురైంది. మిత్రపక్షంగా ఉన్న టీడీపీ చేస్తున్న ఆందోళన న్యాయమైనదేనని మిత్రులకు కూడా అవసరమైన సహాయం చేయడంలో బీజేపీ వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమని అకాళీదల్ సభ్యులు లోక్‌సభలో పేర్కొనడం గమనించాల్సిన విషయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎన్‌డీఏ ప్రధానపక్షమైన లోక్ జనశక్తి, అప్నాదల్, జేడీయూలు తటస్థంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని వారు తెలిపారు. ఇక పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి - మిగతా 6వ పేజీలో

అయోధ్య.. భూవివాదమే

కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: అయోధ్య వివాదంపై సుప్రీం కోర్టు గురువారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. అయోధ్యలో వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీమసీదు కేసును పూర్తిగా భూ వివాదంగానే పరిగణించి విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను గురువారం చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం గంటపాటు ఇరుపక్షాల వాదనలను విన్నది. అలాగే ఈ కేసును ప్రస్తుతం రోజువారీగా విచారించాలనుకోవడం లేదని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఉభయపక్షాల న్యాయవాదుల మధ్య వాడీవేడీగా వాదనాలు సాగాయి. కాగా అలహాబాద్ హైకోర్టులో దాఖలైన కేసులోని పిటిషనర్ల వాదనలు మాత్రమే ఇప్పుడు వింటామని, ఈ కేసులో కొత్తగా



చేరాలనుకుంటున్న పిటిషనర్లు మరికొంత కాలం వేచి ఉండాలని స్పష్టం చేసింది. అయోధ్య వివాదంపై 2010లో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఇచ్చిన తీర్పుపై దాఖలైన సివిల్ అప్పీళ్లను ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన - మిగతా 6వ పేజీలో

మీకే కాదు.. నాకూ బాసే

రాహుల్ నాయకత్వాన్ని బలపర్చాలి

• కాంగ్రెస్ పూర్వవైభవం ప్రక్రియ మొదలు • భావసారూప్యత కలిగిన పార్టీలతో పనిచేస్తాం


• కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మొత్తం పార్టీ శ్రేణులకే కాకుండా తనకు కూడా బాసేనని సోనియా గాంధీ స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయని, ఇందుకోసం భావ సారూప్యత కలిగిన అన్ని పార్టీలతోనూ పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సోనియా తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా భావసారూప్యత కలిగిన పార్టీలన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కేంద్రంలోని అధికార బీజేపీపైనా, ప్రధాన మంత్రి మోదీపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన సోనియా గాంధీ 'తన సంకుచిత రాజకీయ ప్రయోజనాలను సాధించుకునేందుకు మోదీ ప్రభుత్వం మైనారిటీలకు వ్యతిరేకంగా హింసాకాండ సృష్టిస్తోంది' అని అన్నారు. మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో కూడా ఈ రకమైన రాజకీయ కుట్రపూరిత వ్యూహాన్ని అమలుచేసేందుకే బీజేపీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ అయిన సోనియా గాంధీ అన్నారు. పార్లమెంటరీ పార్టీ భేటీలో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్ పార్టీని శక్తివంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం గురించి ఉద్ఘాటించారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వెన్నుదన్నుగా నిలిస్తూ విధేయత, అంకితభావంతో



ఎంపీలు కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. 'రాహుల్ గాంధీ మీ అందరికే కాదు.. నాక్కూడా బాసే.. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహం ఉండాల్సిన అవసరం లేదు.. రాహుల్‌కు అన్ని విధాలుగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అని సోనియా అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున, తన తరపున రాహుల్ గాంధీని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని, ప్రతి ఒక్కరూ ఆయనకు విధేయంగా అంకితభావంతో పనిచేయడం - మిగతా 6వ పేజీలో





మీ లెక్కేంటో గానీ...
మాకు తిక్కొచ్చేలా ఉంది సార్!!

రాష్ట్రంలో అతిపెద్ద రైస్‌మిల్

● ఏప్రిల్‌లో పనుల ప్రారంభానికి ఫోనిక్స్ గ్రూపు సన్నద్ధం ● ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటనలో వెల్లడి



షరాఫ్ గ్రూపు బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ ★ ఫోనిక్స్ గ్రూపు ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: ప్రపంచంలోనే అతి పెద్ద రైస్ మిల్లును ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పేందుకు దుబాయ్‌కు చెందిన ఫోనిక్స్ సంస్థ సన్నద్ధమైంది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో మెగా ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని, ఇందుకు సంబంధించి పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెడతామని ఫోనిక్స్‌గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవో గౌరవ్ ధావన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అన్నారు. ఈ నెలాఖరులో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు వాణిజ్య పారిశ్రామిక ప్రముఖులను ఆహ్వానించడానికి, ఆంధ్రప్రదేశ్‌కు మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు గురువారం ఒకరోజు పాటు దుబాయ్‌లో పర్యటించిన ముఖ్యమంత్రితో గౌరవ్ ధావన్ సమావేశమయ్యారు. మెగా ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్ ప్రాజెక్టుపై ఇరువురూ చర్చించారు. ఉక్రెయిన్‌లో అమెరికాకు చెందిన కొన్ని సంస్థల సహకారంతో తాము నెలకొల్పుతున్న ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుందని, దీని తర్వాత భారత్ మార్కెట్‌పై దృష్టి సారిస్తామని ముఖ్యమంత్రికి ధావన్ తెలిపారు. ఏపీలో వ్యవసాయ రంగంలో అనుసరిస్తున్న వినూత్న విధానాల గురించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి వివరించారు. అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున వేరుశనగ సాగు చేపట్టేందుకు గల అవకాశాలు పరిశీలించాలని, వేరుశనగ నుంచి బటర్ తయారుచేసే యూనిట్ నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ భేటీలో ఫోనిక్స్ గ్రూపు ఫైనాన్స్ కంట్రోలర్ నితిన్ నవెంధెర్ కూడా ఉన్నారు. సామర్లకోటలో నెలకొల్పే రైస్ మిల్ ప్రాజెక్ట్ ఏడాదికి 3లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే ప్రపంచంలోని అతి పెద్ద రైస్‌మిల్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుంది. ఇందులో లక్ష మెట్రిక్ టన్నులను దేశీయ మార్కెట్‌లో, మిగిలిన 2లక్షల మెట్రిక్ టన్నులను విదేశాలకు ఎగుమతి చేయాలని ఫోనిక్స్ సంస్థ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 200 నుంచి 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి దేశ విదేశాల్లో ఈ సంస్థ పెద్దఎత్తున క్రయ విక్రయాలు జరుపుతోంది.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.. రండి

భారత ప్రభుత్వం ఆహార శుద్ధి రంగంలో సరైన విధానం ప్రకటిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెల్లడించారు. ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ నెలకొల్పే అంశంపై గతంలోనే ప్రతిపాదనలు ఇచ్చామని, ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. ప్రస్తుతం యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన భూసేకరణకు ఎదురుచూస్తున్నామని చెప్పారు. లాజిస్టిక్స్ వ్యవహారాల్లో భారత ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం తమకు అంత సానుకూలంగా, తమ అవసరాలకు తగ్గట్టుగా లేదని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, ఈ రంగంలో అత్యుత్తమ విధానం కోసం ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి బదులిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో పాటు ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించిన లాజిస్టిక్స్‌పైనా దృష్టి సారించినట్టు షరాఫ్ గ్రూపు ప్రతినిధులు చెప్పారు. ఆహార శుద్ధి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా రవాణా సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు భూముల కేటాయింపు తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని, దీనికోసం వెంటనే తమ ప్రభుత్వాధికారులతో సంప్రదింపులు జరపవచ్చని ముఖ్యమంత్రి వారికి సూచించారు. ఎలాంటి అనుమతులైనా సత్వరం ఇవ్వడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. అనేక అంశాల్లో ఏపీ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని షరాఫ్ గ్రూపు వైస్ చైర్మన్ షరాఫుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్ ప్రశంసించారు. త్వరలో తమ సంస్థ అత్యున్నత స్థాయి బృందాన్ని ఏపీకి పంపిస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. దుబాయ్‌లో తమ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాపారవేత్తల సదస్సుకు హాజరుకావాలని హుస్సేన్ షరాఫ్ ఆహ్వానించారు. భారత్‌లో ఇప్పటికే 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిన షరాఫ్ గ్రూపు, పుణె, లుధియానాలో వ్యాపారాన్ని కేంద్రీకరించింది. సంస్థ విస్తరణకు తమిళనాడులో ఇప్పటికే భారీగా భూమిని సేకరించింది. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, మౌలిక వసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ ఉన్నారు.

స్పష్టత వస్తేనే శాంతం

● జైట్లీ ప్రసంగంపై బాబు దిశానిర్దేశం ● దుబాయ్ నుంచే ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: రాష్ట్రానికి రావలసిన నిధులపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ ఆందోళన కొనసాగించాలని పార్టీ ఎంపీలను టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం ఆయన దుబాయ్ నుంచే పార్టీ ఎంపీలతో టెలీకాన్ఫరెన్సులో మాట్లాడారు. జైట్లీ మాట్లాడే సమయంలో ఏవిధంగా వ్యవహరించాలో దిశానిర్దేశం చేశారు. నిర్దిష్టమైన హామీ లభించకపోతే శాంతించవద్దని, అక్కడే ఆందోళన చేయాలని, ఎవరికీ మొహమాట పడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. అయితే జైట్లీ ప్రసంగించే సమయంలో ఆందోళన చేయవద్దని, ఆయన ప్రకటనలో ఎలాంటి హామీ లేకపోతే నిరసనలు కొనసాగించాలన్నారు. దానితో అరుణ్ జైట్లీ ప్రసంగంలో రాష్ట్రానికి సంబంధించి స్పష్టమైన హామీ లేకపోగా, అన్నీ ఇచ్చేశామన్న ఆయన ప్రకటనపై టీడీపీ ఎంపీలు మరింత ఆందోళన చేశారు. ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి వెళ్లారు. మోసం చేస్తే కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. 'మనల్ని ప్రజలు గమనిస్తున్నారన్నది గ్రహించండి. టీడీపీ రాష్ట్ర హక్కుల కోసం మిత్రపక్షమైనా కేంద్రంతో పోరాడుతుందన్న భావన ప్రజల్లో పెరుగుతోంది. మనం ఎన్నిసార్లు కేంద్రం వద్దకు వెళ్లాం. ప్రధానిని ఏమేం అడిగామన్న వివరాలు మీడియాలో ప్రముఖంగా వస్తుండటంతో ప్రజలు వాస్తవాలేమిటో గ్రహిస్తున్నారు. వైసీపీ ఎంపీలు కేవలం మొహమాటంతో ఆందోళన చేస్తున్నారని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. విజయసాయిరెడ్డి తీరు, వైసీపీ ద్వంద్వ విధానాలపై ఇంకా విరుచుకుపడండి. ఈ పోరాటాన్ని చివరివరకూ తీసుకువెళ్లండి' అని సూచించారు. ఈ సందర్భంగా ఎంపి గల్లా జయదేవ్ నిన్నటి ప్రసంగాన్ని మెచ్చుకున్నారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయాలు బాగా వ్యక్తం చేశారన్నారు. సోషల్ మీడియాలో ఆయన ప్రసంగానికి వచ్చిన సానుకూలత బాగుందన్నారు. ఎంపీలంతా సమస్యలపై అధ్యయనం చేస్తే అందరూ అద్భుతంగా మాట్లాడవచ్చన్నారు.

ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలి

● అధికారులతో చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో జరుగుతున్న బంద్‌పై దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్షించారు. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌తో ఎంవోయూ చేసుకునేందుకు, విశాఖ సమ్మిట్‌కు విదేశీ సంస్థలను ఆహ్వానించేందుకు దుబాయ్ వెళ్లిన ముఖ్యమంత్రి ఒకవైపు ఆయా పనుల్లో బిజీగా ఉంటూనే, మరోవైపు రాష్ట్రంలోని పరిస్థితులను అక్కడ నుంచే ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. జిల్లాల కలెక్టర్లు, ఐఎఎస్, ఐపీఎస్ అధికారుతో గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంద్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. జన జీవనానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. శాంతియుతంగా బంద్ పాటించేవారికి పోలీసులు సహకరించాలని, ఎటువంటి అణచివేత చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను గౌరవించాలంటూ, రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడడం మనందరి బాధ్యతగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఏపీకి జరిగిన అన్యాయంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. విభజన జరిగి నాలుగేళ్లయినా ఇంకా ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. ప్రజలను ఇబ్బందులపాలు చేయకండి. ఎక్కడా ఉద్రిక్తత తలెత్తకుండా చూడాలి. ప్రశాంతంగా బంద్ జరిగేలా చూడాలి' అన్నారు. 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎంపీలు పార్లమెంటులో పోరాటం చేస్తున్నారు. వారికి సంఘీభావంగా ప్రజలు బంద్ పాటిస్తున్నారు. అధికారులు వారికి సహకరించాలి. పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. హింసాత్మక శక్తులు బంద్‌లో ప్రవేశించకుండా చూడాలి. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా అన్ని ప్రాంతాలపై నిఘా ముమ్మరం చేయాలి. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించండి. బంద్ ప్రశాంతంగా జరిగేలా సహకరించండి' అని రాష్ట్రంలోని అధికారులు అందరికీ సూచించారు.

భవిష్యత్తుపై గిరిజనులకు భరోసా ఇవ్వండి

● ఐటీడీఏ పీవోలకు సీఎస్ ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: విధి నిర్వహణలో ఆత్మ సంతృప్తి కలిగేలా పనిచేస్తూ, గిరిజనులకు భవిష్యత్‌పై భరోసా కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో గిరిజన సంక్షేమంపై రాష్ట్రంలో ఐటీడీఏ పీవోలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజనులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయన్నారు. మన్యంలో విద్య, ఆరోగ్యంపైనా, మౌలిక సదుపాయాల కల్పనపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తప్పించడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. పలువురు డ్రాపౌట్ల నిరోధానికి గిరిజన విద్యార్థులకు ఇన్సెంటివ్‌లు ఇచ్చే ఆలోచన ఉందన్న సీతంపేట ఐటీడీఏ పీవో వ్యాఖ్యలను సీఎస్ తప్పుబట్టారు. ఎంతమందికి ఇన్సెంటివ్‌లు ఇస్తూ, పాఠశాలలకు రప్పించగలమని ప్రశ్నించారు.

పక్కాగా జనన, మరణాల రిజిస్టర్లు

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో జనన, మరణ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో మెటర్నిటీ బెనిఫిట్ స్కీం, జనన, మరణ సర్టిఫికెట్ల జారీ, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మాతాశిశు మరణాలకు సంబంధించిన సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత ఆథారిటీకి ఆ వివరాలను తెలియజేయాలని, వాటిపై సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో జనన, మరణ సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేయడంతోపాటు అందుకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

గ్రామాల్లో సిటిజన్ సర్వీస్ సెంటర్లు

రాష్ట్రంలో నేషనల్ రూర్బన్ మిషన్ కింద ఐదేళ్ల (2016-2020) కాలానికి ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం వెలగపూడి సచివాలయంలో ఈ పథకంపై ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఎంపవర్డ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిటిజన్ సెంట్రిక్ సేవలన్నీ ఇ-గ్రామ కనక్టివిటీ కింద పొందేందుకు వీలుగా అవసరమైన సిటిజన్ సర్వీసు సెంటర్లు (సీఎస్సీ) ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

5 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 5 నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 8న అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఉగాది, రెండో శనివారం, ఆదివారాలు అసెంబ్లీ సమావేశాలు ఉండవు. 16 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. మార్చి 28న ద్రవ్య వినిమయ బిల్లుతో బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి.

ఆర్టీసీకి రూ 7 కోట్లకుపైగా నష్టం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: మూలిగే నక్కపై తాడిపండు పడ్డ చందంగా సాలీనా రూ.600 కోట్లుపైగా నష్టాలతో సతమతమవుతున్న ఏపీఎస్ఆర్టీసీకి గురువారం నాటి బంద్ కారణంగా ఏడుకోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 128 డిపోల్లోనూ ఎక్కడి బస్సులు అక్కడే నిలిచాయి. బంద్ సందర్భంగా బస్సులను నడపరాదని గత రాత్రే యాజమాన్యం నిర్ణయించుకుంది. ఈ విషయం తెలియక వివిధ సంస్థల నేతలు తమ తమ పార్టీ జెండాలు చేతబూని బస్‌స్టేషన్ల ఎదుట బైఠాయించారు. ఏ ఒక్క బస్సు కూడా వెలుపలకు రాకపోవటంతో ఆ తర్వాత వెనుదిరుగాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా రోజూ 10వేల 480 ఆర్టీసీ సర్వీస్‌లు తిరుగాల్సి ఉండగా వీటిలో 60 శాతం సర్వీస్‌లు నిలిచిపోయాయి. కేవలం 4వేల 200 సర్వీస్‌లు సాయంత్రం నుంచి రోడ్డెక్కాయి. దీనివల్ల ఏడు కోట్ల రూపాయల మేర ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. అత్యధికంగా కృష్ణాజిల్లాలోనే రూ.70లక్షలు మేర ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. సంస్థ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ ఎం.మాలకొండయ్య బంద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వచ్చారు.

ఏపీకి వస్తున్న డీపీ వరల్డ్!

● సంయుక్త కార్యబృందం ఏర్పాటు
● వచ్చే వారం రాష్ట్రానికి ప్రతినిధులు
● బాబు భేటీతో ఖరారు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: ఆరు ఖండాలు, 40 దేశాల్లోని నౌకాశ్రయాల్లో మెరైన్, ఇన్‌లాండ్ టెర్మినళ్లను కలిగి, సప్లయ్ చైన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్యానికి మార్గం సుగమం చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న డీపీ వరల్డ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో కార్యబృందం ఏర్పాటయింది. సంయుక్త కార్యబృందంలో ఏపీ ప్రభుత్వ మౌలిక సదుపాయాల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, డీపీ వరల్డ్ సీఈవో యువరాజ్ వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, వివిధ అంశాలలో కలిసి పనిచేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత దుబాయ్ పర్యటనలోనే డీపీ వరల్డ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఏపీలో తమ సంస్థ కార్యకలాపాల విస్తృతికి వెంటనే ఒక బృందాన్ని పంపిస్తామని ముఖ్యమంత్రి తాజా పర్యటనలో డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ బిన్ సులేయామ్ వెల్లడించారు. సోమవారం భారత్ వస్తున్న డీపీ వరల్డ్ ప్రతినిధి, ఏపీ అధికారుల బృందాన్ని కలుసుకుని చర్చించనున్నట్టు సులేయామ్ తెలిపారు. ఏపీలో కనీసం మూడు చోట్ల లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేయాలని, ఒక పారిశ్రామిక సెజ్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సులేయామ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. మూడు నెలల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని సులేయామ్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

విశాఖ కన్వెన్షన్ సెంటర్ ఆకృతులు సిద్ధం

విశాఖ మహానగరంలో లులూ గ్రూపు ఏర్పాటు చేస్తున్న కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన నిర్మాణ ఆకృతులు సిద్ధమయ్యాయి. వీటిని దుబాయ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ఆ సంస్థ ప్రతినిధులు చూపించారు. మరోవైపు విశాఖలో ఈ నెల 26న లులూ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది.

'గల్లా' గల లాడించిన 'దేశం'

● లోక్‌సభ వేదికగా పార్టీ వైఖరి వెల్లడి ● పార్టీ నిరసనను చాటిన జయదేవ్ ప్రసంగం
● సోషల్ మీడియాలో హీరోగా మారిన ఎంపీ
● 'మిస్టర్' అని ప్రధానిని తొలిసారి సంబోధించిన వైనం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో నిరసనలు కొనసాగిస్తున్న టీడీపీ తాజాగా తన మిత్రపక్ష వైఖరిని తూర్పారపట్టడం చర్చనీయాంశమయింది. లోక్‌సభను వేదికగా చేసుకున్న టీడీపీ, తన ఆక్రోశం, బీజేపీ రాజకీయ వ్యూహాన్ని దుయ్యబట్టింది. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, బీజేపీ రాజకీయ విధానంపై టీడీపీ తొలిసారిగా పార్లమెంటులో నిర్భయంగా మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తమకు జరుగుతున్న అన్యాయంతోపాటు, వైసీపీతో రహస్య బంధం కొనసాగిస్తోన్న బీజేపీ రాజకీయ విధానంపై గుంటూరు యువ ఎంపీ గల్లా జయదేవ్ దునుమాడిన తీరు ప్రశంసలు పొందుతోంది. ఆయన ప్రసంగాన్ని కోట్ చేస్తూ నెటిజన్లు హీరోగా కీర్తిస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో లక్షల సంఖ్యలో ఆయన ప్రసంగాలు చెలామణి అవుతున్నాయి. అదే సమయంలో టీడీపీ పక్షాన తొలిసారి ప్రధానిని మిస్టర్ ప్రైమ్మినిస్టర్, మిస్టర్ ఫైనాన్స్ మినిస్టర్ అంటూ సంబోధించడం సంచలనం సృష్టించింది. ఏపీకి రావలసిన నిధులు, విభజన హామీల అమలు తదితర అంశాలపై ఎంపీ జయదేవ్ ప్రసంగం.. టీడీపీ విధానాన్ని స్పష్టం చేసింది. ఇదే వైఖరి కొనసాగిస్తే పొత్తును ఎందుకు కొనసాగించాలన్న దానిపై పునరాలోచించుకోక తప్పదని నిర్మొహమాటంగా చెప్పడమే కాకుండా, సీఎం ప్రధానికి ఇచ్చిన 19 అంశాల్లో ఒక్కటీ అమలు కాలేదన్న విషయాన్ని బహిర్గతం చేసి, బీజేపీ అనుసరిస్తోన్న ద్వంద్వ రాజకీయ విధానాలను తూర్పారపట్టారు. దీన్నిబట్టి ఈ విషయంలో టీడీపీ నాయకత్వం మొహమాటంతో లేదన్న సంకేతాలు పంపించడం గమనార్హం. ఈ సందర్భంగా వైసీపీతో బీజేపీ కొనసాగిస్తోన్న తెరచాటు స్నేహాన్ని గల్లా నర్మగర్భంగా ప్రస్తావించి, ఘాటుగానే బదులివ్వడం కూడా పార్టీ విధానాన్నే స్పష్టం చేస్తోంది. ఈ సందర్భంగా వైసీపీ-బీజేపీ పరోక్ష బంధాన్ని రాష్ట్ర ప్రజలకూ చాటడం ద్వారా, రెండు పార్టీలనూ ఏకకాలంలో ఇరుకునపెట్టినట్లు స్పష్టమయింది. వైసీపీ ఎంపీలు బడ్జెట్‌ను పొగిడి మీరు చేసిన అన్యాయానికి టీడీపీ కారణమంటున్నారని చెబుతూనే, దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన వ్యక్తి మద్దతు కోసం బీజేపీ వెంపర్లాడటం నైతికంగా పతనమయినట్లు కాదా అన్న విమర్శలతో.. ఆ రెండు పార్టీల పొత్తు ప్రయత్నాన్ని తూర్పారపట్టి, తన పార్టీ విధానాన్ని సుస్పష్టంగా చెప్పినట్టయింది. సంఖ్యాబలం వల్లే తమను బీజేపీ చిన్నచూపు చూస్తోందంటూ రగిలిపోతున్న టీడీపీ.. ఆ విషయాన్ని గల్లా ప్రసంగం ద్వారా చెప్పకనే చెప్పించినట్టయింది. అయితే సమీకరణలు మారుతున్నాయని, నాలుగేళ్ల తర్వాత ఇంకా పరిశీలిస్తున్నామనడం సిగ్గుచేటన్నవ్యాఖ్యలతో టీడీపీ వైఖరి ఏమిటన్నది స్పష్టమయింది.

ఏపీకి న్యాయం జరిగేవరకూ పోరాటం

● పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయం పైన రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు,. నిరసనలకు దిగుతున్నారు.. అందుకే నేడు సంపూర్ణంగా రాష్ట్ర బంద్‌ను పాటించారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ న్యాయం జరిగేవరకూ ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. గత 4 బడ్జెట్‌లలోను ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయమే ఐదో బడ్జెట్‌లోనూ కొసాగిందన్నారు. ఇందుకు బీజేపీ, టీడీపీలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు బంద్‌ను విజయవంతం చేశారన్నారు. శ్రీకాకుళంలో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, డీసీసీ అధ్యక్షుడు డోల జగన్నాథం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చౌదరి సతీష్‌ను అరెస్ట్ చేశారని, వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయతీరాజ్ శాఖలో 116 మందికి పదోన్నతులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విస్తరణాధికారి, పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ పదోన్నతులు ఎట్టకేలకు మంత్రి నారా లోకేష్ చొరవతో, కమిషనర్ పంచాయతీరాజ్ గురువారం సీనియారిటీ జాబితాలను ఖరారు చేసే ముందుగా ఆయన వివిధ అసోసియేషన్‌లతో మాట్లాడి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నారు. డీపీసీ సభ్యులు కెకె కిషోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ కాళీకుమార్, జాయింట్ సెక్రటరీ వారి ఆధ్వర్యంలో 116 అర్హులకు విస్తరణాధికారి, పంచాయితీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధిగా పదోన్నతి కల్పించారు. జోన్‌ల వారీగా జోన్-1లో (16) ఖాళీలు, జోన్-2లో (30) ఖాళీలు, జోన్-3లో (29) ఖాళీలు, జోన్-4లో (41) ఖాళీలు పూరించారు. జిల్లాల్లోని వీడీఓలు, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ అధికారులు, జిల్లా ప్రజా పరిషత్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్లు, డీపీఓ యూనిట్, సీనియర్ అసిస్టెంట్‌లు లబ్ధిపొందారు.

సీఐఐ సదస్సుకు పెట్టుబడులతో రండి

● రాష్ట్రం చిన్నదనుకోవద్దు, మా లక్ష్యాలు పెద్దవి ● బిజినెస్ లీడర్స్ ఫోరం రోడ్‌షోలో చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: 'మీరు సమర్పించే పత్రాలను పరిశీలిస్తాం. పెట్టుబడులు తెండి. అనుమతులు, వ్యవస్థాపక అంశాలకు నేను భరోసాగా ఉంటాను. ఆ బాధ్యత నాది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'మా రాష్ట్ర పారిశ్రామిక రాజధాని విశాఖలో ఈ నెల 24,25,26తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ సదస్సుకు మీరు తప్పక రావాలి' అని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. యుఎఇ బిజినెస్ లీడర్స్ ఫోరం ఆధ్వర్యాన 'ఆంధ్రప్రదేశ్‌లో అవకాశాలు-ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాటా మంతీ' అనే ఇతి వృత్తంతో గురువారం దుబాయ్‌లో ఏర్పాటైన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. గల్ఫ్‌లో స్థిరపడిన భారతీయ సంతతి వాణిజ్యవేత్తలనుద్దేశించి మాట్లాడుతూ 'ఈ గడ్డమీ ఎదుగుదలకు అవకాశాలను కల్పించింది. అందువల్ల ఈ దేశానికి విధేయంగా ఉండండి. జన్మనిచ్చిన జన్మభూమి భారత్‌ను మాత్రం మర్చిపోవద్దు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డ ప్రతి పారిశ్రామికవేత్త, ప్రతి వాణిజ్యవేత్త ఒక యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పాలన్నది నా స్వప్నం' అని స్పష్టం చేశారు.

మా లక్ష్యాలు పెద్దవి

తాను తొమ్మిదేళ్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశానని, ఇక్కడ ఉన్న అనేక మందికి తన విధానాలు, పనితీరు తెలిసినవేనని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం ఆనాటి రాష్ట్రంలోని 60 శాతంతో మాత్రమే ఉన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నాను. అయినా భవిష్యత్తు దార్శనికతతో అభివృద్ధికి 2022, 2029, 2050 వరకూ స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకుని ముందుకు సాగుతున్నట్లు వివరించారు. తమ కృషితో రాష్ట్రంలో ఇప్పటికే కియా, ఇసుజు, అపోలో టైర్స్ వంటి పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌లో కొలువుతీరాయని, గమేష సుజలిన్ కంపెనీలు ఇంధన రంగంలో కలసి పనిచేస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

పారిశ్రామికాభివృద్ధికి వీసీఐసీ, బీసీఐసీ

ఆటోమొబైల్ రంగానికి అనంతపురం, సౌర విద్యుత్ రంగానికి కర్నూలు అనువైనవిగా గుర్తించి అక్కడ ఆయా పరిశ్రమలు నెలకొల్పడానికి అనేక చర్యలు తీసుకున్నామని, తమ కృషి ఫలిస్తోందని అన్నారు. ప్రతి జిల్లాకు ఒక పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామని, విశాఖపట్నం, చెన్నై పారిశ్రామిక కారిడార్, బెంగుళూరు, చెన్నై పారిశ్రామిక కారిడార్లు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధికి బాట వేస్తున్నాయని సీఎం అన్నారు. ఉత్తరాంధ్రలో జీడిపప్పు, మామిడి, చెరుకు, కొబ్బరి ప్రాసెసింగ్, తూర్పు పశ్చిమ గోదావరి ప్రాంతంలో వరి, కొబ్బరి, అరటి, పామ్ ఆయిల్ శుద్ధి, రాయలసీమలో వేరు శనగర, బొప్పాయి, దానిమ్మ, బత్తాయి, మాంసం, డెయిరీ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. దక్షిణ కోస్తాలో సుగంధ ద్రవ్యాలు, చెరుకు, మామిడి, అరటి వంటి ఆహార శుద్ధి పరిశ్రమలలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ 'పెట్రోహబ్'గా మారే అవకాశాలున్నాయని సీఎం చెప్పారు. హార్డ్‌వేర్ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికే ఫాక్స్ కాన్ తమ రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని అన్నారు. అనేక ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ వాటికి ఎదురు నిలిచి దుబాయ్ అభివృద్ధి చెందిందని, కానీ అమరావతి నగర నిర్మాణానికి అన్నీ అనుకూలాంశాలే ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

గత ఏడాది 163.6 బిలియన్ల విలువైన 665 ఎంఓయూలు

2017లో తాము 163.6 బిలియన్ల విలువైన 665 ప్రాథమిక అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఎంఓయూలు పూర్తిస్థాయిలో ఆచరణకు వస్తే 5.5 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయని సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, మౌలిక వసతుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ ఉన్నారు.

అమరావతిలో మౌలిక సదుపాయాలకు రూ. 12,732 కోట్లు

● బాండ్ల ద్వారా రూ.2000 కోట్లు
● హైబీడ్ యాన్యుటీ విధానంలో రూ. 10,732 కోట్లు
● గ్యారంటీ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: రాజధాని అమరావతి పరిధిలో 12,732 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను ఏపీ సీఆర్‌డీఏ కల్పించనుంది. ఈ మేరకు నిధులను వివిధ పద్ధతుల్లో సమీకరించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీర్‌గా వ్యవహరించేందుకు గురువారం ఆమోదం తెలిపింది. రాజధాని పరిధిలో మౌలిక సదుపాయాలు, రహదారుల అభివృద్ధికి దాదాపు 30 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతుందని సీఆర్‌డీఏ అంచనా వేసింది. ఇందుకు అవసరమైన నిధులను దేశీయ బాండ్లు, మసాలా బాండ్లు, హైబ్రీడ్ యాన్యుటీ విధానం అమలు ద్వారా సమీకరించేందుకు ప్రతిపాదించింది. సీఆర్‌డీఏ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి, రుణాలు పొందేందుకు వీలుగా గ్యారంటీర్‌గా వ్యవహరించేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా దేశీయ, మసాలా బాండ్ల ద్వారా 2000 కోట్ల రూపాయలను సీఆర్‌డీఏ సమకూర్చుకోనుంది. మరో 10,732 కోట్ల రూపాయలను పీపీపీ విధానంలో హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో సమకూర్చుకోనుంది. ప్రభుత్వ ఉద్యోగులకు, ఐఎఎస్ అధికారుల కోసం 3840 గృహాలను సీఆర్‌డీఏ నిర్మిస్తున్నది. ఇందుకు 3306 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పాలనాపరమైన అనుమతిని కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాజధాని నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి.

హౌస్‌సర్జన్లు, పీజీలకు స్టయిఫండ్ ఖరారుకు కమిటీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: వివిధ వైద్య కళాశాలల్లో చదువుతున్న హౌస్ సర్జన్లు (ఇంటర్నీలు), పీజీ విద్యార్థులకు స్టయిఫండ్ పెంపుపై నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఒక కమిటీని ప్రభుత్వం నియమించింది. 2018, 2019 సంవత్సరాలకు సంబంధించి స్టయిపండ్ పెంచాలని వైద్య విద్య విభాగం ప్రతిపాదనలు పంపింది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు వీలుగా సిఫారసులు చేసేందుకు ఒక కమిటీని ప్రభుత్వం గురువారం నియమించింది.

మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: పెట్టుబడులను ఆహ్వానించేందుకు పది రోజుల పాటు దావోస్, అమెరికా దేశాల్లో విస్తృతంగా పర్యటించిన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం గన్నవరం విమానాశ్రయానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేసి ఘన స్వాగతం పలికారు.

బంద్ ప్రశాంతం

కేంద్రం తీరుపై పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 8: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం జరిగిన రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా విశాఖ బంద్ విజయవంతమైంది. టీడీపీ, వైసీపీ, వామపక్ష పార్టీలు, జనసేనతోపాటు, వివిధ ప్రజా సంఘాలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. తెల్లవారుజాము నుంచే వామపక్ష పార్టీలు ఆర్టీసీ బస్ డిపోల వద్ద ధర్నాకు దిగాయి. అయితే, బంద్‌ను పురస్కరించుకుని ముందుగానే బస్ సర్వీసులను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఒక్క బస్సు కూడా రోడ్డెక్కలేదు. ఆటోలు పాక్షికంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది.విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు రైళ్లలో వెళ్లాల్సి వచ్చింది. దీంతో విశాఖ వైపుగా వెళ్లిన అన్ని రైళ్లు కిటకిటలాడాయి. విద్యా సంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. వరక్త, వ్యాపార సంస్థలు, దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు.

స్తంభించిన గోదావరి జిల్లాలు!

రాజమహేంద్రవరం/ఏలూరు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ పది వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, జనసేన చేపట్టిన రాష్ట్రవ్యాప్తం బంద్‌లో భాగంగా గురువారం ఉభయ గోదావరి జిల్లాలు స్తంభించాయి. అన్నిచోట్లా ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడంతో అన్ని రకాల లావాదేవీలు నిలిచిపోయాయి. చివరి నిముషంలో అధికార తెలుగుదేశం పార్టీ సైతం నిరసన ప్రదర్శనలు, ధర్నాలకు దిగాలని నిర్ణయించడంతో పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. మొత్తం మీద ఒక్క బీజేపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పక్షాలూ బంద్‌కు సహకరించినట్టయ్యింది. వామపక్షాలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పెద్ద ఎత్తున స్పందించి ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది.

జాతీయ రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరంలో రూ.కోట్ల కార్యకలాపాలు స్తంభించాయి. అతి పెద్ద వస్త్ర వ్యాపారానికి కేంద్రమైన రాజమహేంద్రవరంలో సుమారు రెండు వేల దుకాణాల సముదాయం మూతపడింది. రాస్తారోకోలు, నిరసనలు, దిష్టిబొమ్మల దగ్ధం, ధర్నాలు దర్శనమిచ్చాయి. అనేక ప్రాంతాల్లో వివిధ పార్టీల ముఖ్య నాయకులను గృహనిర్బంధం చేసిన పోలీసులు ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొన్నవారిని కూడా వదలకుండా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. కొన్నిచోట్ల ఆందోళనకారులు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాటలు కూడా చోటుచేసుకున్నాయి. ఏజన్సీ ప్రాంతంలోని ఒకటి,రెండు తహసిల్దార్ కార్యాలయాలను మాత్రం పోలీసు రక్షణ మధ్య తెరిచారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దఎత్తున పోలీసులు మోహరించారు.

నెల్లూరులో బంద్‌లో పాల్గొన్న వైఎస్ జగన్

నెల్లూరు/ఒంగోలు/చిత్తూరు/తిరుపతి,: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత కల్పించకపోవడాన్ని నిరసిస్తూ విపక్షాలు, ప్రజాసంఘాలు గురువారం నిర్వహించిన బంద్ చిత్తూరు, నెల్లూరు ప్రకాశం జిల్లాల్లో బంద్ విజయవంతం అయింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో గురువారం ఉదయం నుండే వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలతో పాటు ప్రధాన ప్రతిపక్ష వైకాపా కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగారు. బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. వ్యాపారులు స్వచ్ఛంధంగా బంద్‌కు మద్దతుగా దుకాణాలను మూసివేశారు. విద్యాసంస్థలకు ప్రభుత్వం ముందుగానే సెలవు ప్రకటించడంతో విద్యార్థులంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల్లో ఉన్న ఉద్యోగులను బంద్ నిర్వాహకులు వెలుపలికి తీసుకువచ్చి కార్యాలయాలకు తాళాలు వేయించారు. బ్యాంకింగ్ వ్యవస్థ దాదాపు జిల్లాలో స్తంభించిపోయింది. జిల్లాలో ప్రజా సంకల్పయాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్ష నేత వై ఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలోని ఏ ఎస్ పేట మండలం దుండిగం గ్రామ రహదారిపై ప్లకార్డులు చేతపట్టి రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకుంటూ బంద్‌లో పాల్గొన్నారు. ఆయనతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు.

కాగా వామపక్షాల ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా బంద్ సంపూర్ణంగా జరిగింది. బంద్ సందర్భంగా ఆర్‌టిసి బస్సులు డిపోగ్యారేజీలకే పరిమితం అయ్యాయి. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు వైకాపా, జనసేనపార్టీలు, ఇతర విద్యార్థి సంఘాల నేతలు మద్దతు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. మంత్రి శిద్దా రాఘవరావు, జిల్లాపార్టీ అధ్యక్షుడు దామచర్ల జనార్ధన్‌లు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం మిత్ర ధర్మం పాటించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. వైకాపా నేత బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా, పోలవరంప్రాజెక్టు, దుగరాజపట్నం, విశాఖరైల్వేజోన్, కడప స్టీల్ ప్యాక్టరీ సహా విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన అంశాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లాకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి, సిపిఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఎం జిల్లానాయకులు జాలా అంజయ్యతోపాటు వివిధ వామపక్షపార్టీల నాయకులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అఖిల పక్షం పిలుపు మేరకు బంద్ విజయవంతం అయింది. చిత్తూరులో ఉదయం 6 గంటల నుంచే వైకాపా, ఉభయ వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జనతాదళ్ సెక్యులర్ పార్టీల నాయకులు రోడ్లపైకి వచ్చి బంద్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు మూతపడ్డాయి. తిరుమలకు వెళ్లే బస్సులకు బంద్ నుంచి మినహాయింపు ఇవ్వడంతో శ్రీవారి భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రాయలసీమలో సంపూర్ణం


కడప/అనంతపురం/కర్నూలు: సీమలో బంద్ సంపూర్ణంగా జరిగింది. కడప జిల్లాలో పోలీసుల కనుసన్నల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. వామపక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల నేతలు బంద్‌ను పర్యవేక్షించారు. కడప నగరంలో సీపీఐ, కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు బంద్‌ను పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్సులు తిరగలేదు. విద్యాలయాలు మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు అక్కడక్కడ తెరచి వున్నా, ఉద్యోగులు లేక ఖాళీగా కన్పించాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నిరసన గళం వినిపించాలని వామపక్షాలు రాష్ట్ర బంద్‌కు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి విజయవంతం చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో చేపట్టిన బంద్ సైతం ఊహించని రీతిలో సంపూర్ణంగా విజయవంతమైంది. దీంతో కేంద్రంపై జనాగ్రహం ప్రస్ఫుటం అయింది. సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీలకు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, జనసేన, బీఎస్‌పీ మద్దతు ప్రకటించి ఆందోళనల్లో పాల్గొన్నాయి.

మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మేయర్ మదమంచి స్వరూప నగరంలో టీడీపీ మహిళా కార్యకర్తలతో కలిసి చేతుల్లో మట్టి మూకుట్లతో మోకాళ్లపై నిరసన తెలిపారు. పెనుకొండలో ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే.పార్థసారథిని వామపక్షాలు అడ్డుకున్నాయి. మడకశిరలో ఎమ్మెల్యే వీరన్న కారును ఆందోళనకారులు అడ్డగించి, కిందకు దిగాలంటూ ఆందోళన చేశారు. అనంతపురం నగరంలో సీపీఎం కార్యకర్తలు ఓ లారీ అద్దాలు ధ్వంసం చేయడంతో, పోలీసులు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాలతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తల్ని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఓవర్‌బ్రిడ్జిపై వైకాపా కార్యకర్తలు టైర్లు తగులబెట్టారు. సీపీఎం కార్యకర్తలు ప్రధాని దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజాసంఘాలు గురువారం చేపట్టిన బంద్ కర్నూలు జిల్లాలో సంపూర్ణంగా జరిగింది. బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతిచ్చారు. వైసీపీ, జనసేన, కాంగ్రెస్, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు తెల్లవారుజామునే రోడ్లపైకి చేరుకుని బంద్‌ను పర్యవేక్షించారు



విశాఖలోని మద్దిలపాలెం వద్ద వివిధ పార్టీల కార్యకర్తల మానవహారం



రాజమహేంద్రవరంలో నిర్మానుష్యంగా మారిన మెయిన్ రోడ్డు



నెల్లూరు జిల్లా దుండిగం గ్రామ రహదారిపై ప్లకార్డులతో వైఎస్ జగన్ నిరసన



అనంతపురం నగరంలో టైర్లు తగులబెడుతున్న వైకాపా కార్యకర్తలు



బంద్‌తో నిర్మానుష్యంగా ఉన్న కర్నూలు బస్టాండ్



బంద్‌తో నిర్మానుష్యంగా ఉన్న కడప ఆర్టీసీ బస్టాండ్

బీజేపీపై భగ్గుమంటున్న జనం

నమ్మక ద్రోహమన్న వివిధ వర్గాలు ● టీడీపీ బయటకు రావాలి ● వైసీపీ ఎందుకు తెగించడం లేదు? ● బంద్‌పై ప్రజల భిన్నాభిప్రాయాలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 8: రాష్ట్రానికి బీజేపీ నమ్మకద్రోహం చేసింది. విభజించిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన ఆ పార్టీ మోసం చేసింది. ఇంత అన్యాయం జరుగుతున్నా టీడీపీ ఇంకా కేంద్రంలో ఉండటం ఎందుకు? కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం కాజేస్తున్నందుకే నిధులివ్వడం లేదు. ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ ఎందుకు తెగించడం లేదు?.. ఇవీ బంద్ రోజు వివిధ వర్గాల నుంచి వినిపించిన ప్రశ్నలు. బడ్జెట్‌లో కేటాయింపులకు నిరసనగా టీడీపీ, కాంగ్రెస్, వామపక్షాలు నిర్వహించిన బంద్, ఎంపీల పోరాటానికి సంఘీభావంగా జరిగిన ఆందోళనపై వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను ఆంధ్రభూమి ప్రతినిధి బృందాలు ఆరా తీశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ టీ స్టాళ్లు, హోటళ్లు, ఆటోస్టాండ్ల వద్ద జనాభిప్రాయ సేకరణ సందర్భంగా వివిధ వర్గాలు విభిన్నంగా స్పందించాయి. అయితే మెజారిటీ వర్గాలు మాత్రం రాష్ట్రానికి హోదా, ప్యాకేజీ, ప్రాజెక్టులు ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందన్న అభిప్రాయాన్నే వ్యక్తీకరించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, నమ్మక ద్రోహం చేసిందన్న అభిప్రాయం మెజారిటీ వర్గాల్లో వ్యక్తమయింది. ఎన్నికల ముందు మోదీ-బాబు-పవన్‌ను చూసి, బాబు అయితేనే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని, ఇక్కడ టీడీపీ అక్కడ బీజేపీ ఉంటేనే రాష్ట్రానికి నిధులు వస్తాయన్న నమ్మకంతోనే ఓట్లు వేస్తే, కేంద్రంలోని బీజేపీ మన రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుండా మోసం చేసిందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. బీజేపీ ప్రభుత్వం వల్ల ఒరిగిందేమీ లేదని, పెట్రోల్ నుంచి ఉప్పు వరకూ అన్ని ధరలూ పెరిగాయన్న విమర్శలు వినిపించాయి. టీడీపీ పక్కకు జరిగినా వైసీపీ జత కడుతుందన్న ధీమాతోనే బీజేపీ రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని మెజారిటీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందుకే హోదా ఇవ్వకపోయినా, ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించకపోయినా, బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోయినా బీజేపీ ధైర్యంతో ఉందని అభిప్రాయపడ్డారు. టీడీపీ వైఖరిపైనా విమర్శలు వినిపించాయి. రాష్ట్రానికి ఏమీ సాయం చేయని కేంద్రంలో టీడీపీ ఇంకా ఎందుకు కొనసాగుతోందన్న ప్రశ్నలు వివిధ వర్గాల నుంచి వినిపించాయి.


కేంద్రాన్ని నిలదీసి,ప్రశ్నించే అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ ఆ పనిచేయడం లేదని మరికొందరు అభిప్రాయపడ్డారు. మోదీని ప్రశ్నించినా, విమర్శించినా అరెస్టు చేస్తారన్న భయంతోనే కేసుల్లో ఉన్న జగన్ ఆ పనిచేయడం లేదన్నారు. బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని తెలిసినా, మోదీని విమర్శించకుండా రాష్ట్రంలో ఉన్న టీడీపీని విమర్శించడం బట్టి జగన్ బీజేపీకి భయపడుతున్నారన్న విషయం తెలిపోతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, వామపక్షాలు ఎంత చేసినా ఫలితం లేదని, టీడీపీ, వైసీపీనే కేంద్రంపై పోరాడాలన్నారు.

సాగర్ ఆయకట్టు మూడోజోన్‌కు మళ్లీ నిలిచిన సాగునీటి సరఫరా

2.30 లక్షల ఎకరాల పంటలతో తెలంగాణ దోబూచులాట ● బోర్డు వద్దకు పరుగులు తీసిన సాగునీటి సంఘాల నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టులో కృష్ణాజిల్లా మూడోజోన్ పరిధిలోని 2లక్షల 30వేల ఎకరాల్లో సాగవుతున్న వివిధ రకాల వాణిజ్య పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. తెలంగాణా ప్రభుత్వం నీటిని విడుదల చేస్తున్నట్లే చేస్తూ అర్ధంతరంగా నిలిపివేస్తూ రైతాంగంతో దోబూచులాడుకుంటోంది. నీటి సరఫరా నిలిచినప్పుడల్లా సాగునీటి సంఘాల నేతలు హైదరాబాద్‌లోని కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయానికి ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది. బోర్డు నిర్దేశించిన ప్రకారం కూడా నీటి సరఫరా జరుగటం లేదు. పంటలు ఏపుగా పెరిగే దశలో గత నెలలో నీటి సరఫరా నిలిచిపోగా నీటి సంఘాల నేతల జోక్యంతో గత నెల 28తేదీ నుంచి నీటి సరఫరా పునరుద్ధరణ జరిగింది. అయితే తిరిగి ఈనెల ఐదోతేదీ నీటి సరఫరా నిలిచిపోవటంతో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచన మేరకు రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వై.పుల్లయ్య చౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నాదెళ్ల చెన్నకేశవరావులు గురువారం హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో సభ్య కార్యదర్శి ఎ.పరమేశంను కల్సి ఇక్కడి పరిస్థితి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద కృష్ణాజిల్లాలోని తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టులో మిర్చి, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మామిడి, మినుము, పసుపు తదితర ఆరుతడి పంటలు రైతులు సాగు చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభ్వుం విజ్ఞప్తి మేరకు నవంబరు, డిసెంబర్, జనవరి మాసాలకు మొత్తం 12 టీఎంసీల నీటిని కెఆర్‌ఎంబీ నాగార్జునసాగర్ ఎడమ కాలువకు కేటాయించింది. నవంబరు మాసంలో మొదటి విడతగా 2,3 జోన్లకు 3.78 టీఎంసీలు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రెండవ విడతగా జనవరి మాసంలో 2,3 జోన్లకు ఇప్పటివరకు రెండో విడత 2.37 టీఎంసీలు మాత్రమే ఇచ్చిందని, 3వ జోన్‌కు జనవరి 28వ తారీఖున నీటిని విడుదల చేసి ఏ విధమైన సమాచారం లేకుండా ఈనెల 5వ తేదీన సాగునీటి విడుదలను నిలుపుదల చేశారనీ, దీనివలన 3వ జోన్‌లో ఉన్న 2.3 లక్షల ఆయకట్టులో ఉన్న ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని గోపాలకృష్ణారావు అన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా బోర్డు కేటాయించిన నీటి నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు 3వ జోన్‌కు కనీసం 1500 క్యూసెక్కులు 20 రోజులపాటు నిరాటంకంగా సాగునీటిని విడుదల చేసి ఆంధ్రప్రదేశ్ రైతులను కాపాడాలని కోరారు. ఫిబ్రవరి కోటా కింద ఆంధ్రప్రదేశ్‌లోని 2.3 జోన్లకు 4.25 టీఎంసీలు కేటాయించాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కెఆర్‌ఎంబీకి ఇండెంట్ పంపిందని వివరించారు. అట్లాగే నీటి విడుదల షెడ్యూలు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విజ్ఞప్తిని కూడా పరిగణనలోకి తీసుకుని నాగార్జునసాగర్ డ్యామ్ హెడ్ రెగ్యులేటర్ కూడా కనీసం 15రోజులపాటు విడుదల చేసి 15రోజుల పాటు వారబందీ పెడితే ఆంధ్రప్రదేశ్‌లోని చివరి ప్రాంతానికి సాగర్ నీరు వచ్చే అవకాశం ఉందని వారు కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. దీనిపై కార్యదర్శి స్పందిస్తూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటి విడుదలపై తమకు పూర్తి అవగాహన ఉందనీ, సాగునీటి సంఘాల రాష్ట్ర ప్రతినిధులు ఇచ్చిన ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని తెలంగాణా ప్రభుత్వానికి తక్షణం తగిన ఉత్తర్వులు ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ఆరుతడి పంటలను రక్షించడానికి అన్ని రకాల చర్యలు వెంటనే తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎస్‌ఎ జబ్బార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.శ్యాంప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



అవసరమైతే బీజేపీని ఎదిరిస్తాం: గంటా


గాజువాక, ఫిబ్రవరి 8: పొత్తుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టబోమని మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గురువారం గాజువాకలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై స్పందించారు. తమ ప్రభుత్వానికి రాష్ట్ర సంక్షేమమే ముఖ్యమని, దీనికి విఘాతం కలిగించే విధంగా ఉండే పొత్తులు తమకు అవసరం లేదని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం, ప్రయోజనాలకు ఎవరు సహకరిస్తారో, వారితోనే కలిసి ఉంటామన్నారు. రాష్ట్ర ప్రజలు కేంద్రంపై ఆగ్రహంతో ఉన్నారని, తమ ప్రభుత్వం కూడా తీవ్ర అసంతృప్తితో ఉందన్న విషయం తెలిసినా కేంద్రంలో స్పందన కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే బీజేపీని ఎదిరించి, ఎంత దూరం వెళ్లడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటినీ కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉందని, ఈ విషయం కేంద్రానికి తెలియంది కాదని, ఈ లోటు భర్తీకి కావల్సిన నిధులను బడ్జెట్‌లో చేర్చకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ఏపీకి సాయంపై ప్రస్తావనేదీ?: రాజప్ప

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఏపీకి సాయం గురించి ప్రస్తావించకపోవడం బాధ అనిపించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (హోం) చినరాజప్ప వ్యాఖ్యానించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో గురువారం మాట్లాడుతూ ప్రధాని ప్రసంగంపై చర్చ జరుగుతోందన్నారు. లోక్‌సభలో తమ పార్టీ ఎంపీలు ఆందోళన చేసిన తరువాత, ప్రధాని తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అన్యాయం తదితర అంశాలతో వాస్తవాలు మాట్లాడారన్నారు. కానీ ఏపీకి బీజేపీ పరంగా, కేంద్ర ప్రభుత్వ పరంగా ఏమి చేస్తారో చెప్పి ఉంటే బాగుండేదన్నారు. ప్రజల సెంటిమెంట్‌కు సంబంధించిన అంశమన్నారు. ప్రసంగంలో చివరిలోనైనా సాయం గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి అన్న అంశం ప్రజల సెంటిమెంట్ అని, బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని ప్రజలు అనుకుంటున్నారన్నారు. జరిగిన అన్యాయానికి నిరసనగా వామపక్షాలు బంద్‌కు ఇచ్చిన పిలుపు ప్రశాంతంగా జరగాలని ప్రభుత్వం భావించి, అన్ని చర్యలు తీసుకుందన్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

వేడుకగా కన్నప్ప ధ్వజారోహణం



శ్రీ కాళహస్తి, ఫిబ్రవరి 8: శ్రీ కాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ప్రారంభం సందర్భంగా భక్తకన్నప్ప ధ్వజారోహణం జరిగింది. గురువారం మధ్యాహ్నం అర్జునుడి ఉత్సవ మూర్తిని శివాలయానికి సమీపంలో ఉన్న కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడున్న ధ్వజస్తంభం వద్ద అర్చకులు పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మంగళవాయిద్యాల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరమశివుడు భక్తుడైన కన్నప్పకు ఇచ్చిన వరం ప్రకారం బ్రహ్మోత్సవాల్లో మొదటి పూజ భక్తుడైన కన్నప్పకే జరుగుతుంది. ఇందులో భాగంగానే గురువారం కన్నప్ప ధ్వజారోహణం జరిగింది. తరువాత దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ అధ్యక్షులు పీఆర్ మోహన్, శాంతారాం పవార్, కోలా ఆనంద్, మునిసిపల్ ఛైర్మన్ పార్థసారథి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రఘునాథ్, ఈ ఓ భ్రమరాంబ, జే ఈ ఓ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధ్వజారోహణం తరువాత ఉత్సవమూర్తిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. కాగా శుక్రవారం ముక్కంటీశుని ఆలయంలో ధ్వజారోహణ జరుగుతుంది.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

శుక్రవారం, 9 ఫిబ్రవరి 2018

'వాల్‌మార్ట్' విస్తరణ

చొరబడిన 'వాల్‌మార్ట్' సంస్థ చొచ్చుకొని వస్తోంది. 'చొరబాటు'కు మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. చొచ్చుకొని రావడానికి వీలుగా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిత్వంలోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం 'రాజ పథాన్ని' నిర్మిస్తోంది! 2012వ సంవత్సరానికి పూర్వం దొడ్డిదారుల గుండా మన 'చిల్లర వ్యాపార' రంగంలోకి చొరబడిన ఈ అమెరికా వారి 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థ'- మల్టీ నేషనల్ కంపెనీ- ఆ తరువాత చట్టబద్ధమైన 'ప్రధాన ద్వారం' గుండానే దేశంలోకి చొరబడింది. చిల్లర వ్యాపార రంగంలో విదేశీయులు పెట్టుబడులను పెట్టడానికి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఇందుకు కారణం. అంతకుపూర్వం 'వాల్‌మార్ట్', ఫ్రాన్స్ వారి 'క్యారీఫోర్' వంటి సంస్థలు మన దేశంలోని సంస్థలతో సక్రమంగాను, అక్రమంగాను అనుసంధానం ఏర్పరచుకొని చిల్లర వ్యాపారాన్ని కొల్లగొట్టాయి. 2012 తరువాత 'వాల్‌మార్ట్' స్వయంగా దేశమంతటా పెద్ద పెద్ద చిల్లర దుకాణాలను తెరుస్తోంది. ఇప్పుడు భారతీయ 'పంపిణీ' సంస్థల్లో భారీగా పెట్టుబడులను పెట్టడం ద్వారా, భారతీయ సంస్థలనే కొనుగోలు చేయడం ద్వారా చిల్లర వ్యాపారాన్ని అదుపు చేయాలన్న వ్యూహాన్ని వాల్‌మార్ట్ అమలు జరుపుతోందట! 'ఫ్లిప్ కార్ట్' అనే భారతీయ 'పంపిణీ' సంస్థను స్వాధీనం చేసుకొనడానికి 'వాల్ మార్ట్' పద్దెనిమిది నెలలుగా చేస్తున్న ప్రయత్నాల గురించి ప్రస్తుతం ప్రచారమౌతోంది. 'ఫ్లిప్ కార్ట్' సంస్థలో ఇదివరకూ పెట్టుబడులను పెట్టిన సంస్థల 'వాటా'లన్నింటినీ అధిక మూల్యం చెల్లించి కొనుగోలు చేయడానికి 'వాల్ మార్ట్' యత్నిస్తోందట! ఈ కొనుగోలు ప్రక్రియ కారణంగా గత ఏడాది అరవై ఐదు వేల కోట్ల రూపాయల విలువైన 'ఫ్లిప్ కార్ట్' వాటాలు, ఆస్తుల విలువ ఈ ఏడాది లక్షా ముప్పయి వేల కోట్ల రూపాయలకు చేరే అవకాశం ఉందట! ఇలాంటి 'కృత్రిమ' అభివృద్ధి దేశంలో ధరలను, ద్రవ్యోల్బణాన్ని పెంచడానికి దోహదం చేస్తుంది. 'వాల్‌మార్ట్' విస్తరణ కేవలం ప్రతీక మాత్రమే. వివిధ సంపన్న దేశాల బహుళ జాతీయ సంస్థలు మన దేశంలోకి చొరబడిపోతున్నాయి, స్వదేశీయ సంస్థలు మూతపడుతున్నాయి. మన ఆర్థిక వ్యవస్థపై విదేశీయుల పట్టు బిగిసిపోతుండడం 'ప్రపంచీకరణ' ఫలితంగా ఏర్పడిన 'స్వేచ్ఛా వాణిజ్యం'- మార్కెట్ ఎకానమీ. భారతీయ జనతా పార్టీ 1990వ దశకంలో ప్రతిపక్షంలో ఉండిన సమయంలో 'ప్రపంచీకరణ'ను వ్యతిరేకించింది. 1998 తరువాత 2004 వరకూ అధికారం చెలాయించిన కాలంలో 'ప్రపంచీకరణ'ను వ్యవస్థీకరించింది. 2014 మే 26వ తేదీకి పూర్వం 'భాజపా' చిల్లర వ్యాపారంలో విదేశీయుల పెట్టుబడులను వ్యతిరేకించింది. గత మూడున్నరేళ్ల పాలనలో 'చిల్లర వ్యాపారం' నుంచి విదేశీయ సంస్థలను వెళ్లగొట్టడానికి 'భాజపా' ప్రభుత్వం చేసింది సున్న! 'ఏకవస్తు ముద్రల' సింగిల్ బ్రాండ్- చిల్లర వ్యాపారంలో విదేశీయులు వందశాతం పెట్టుబడులను పెట్టడానికి 2011లోనే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం వీలు కల్పించింది. కానీ, ఇలా విదేశీయ సంస్థలు మన దేశంలో చిల్లర వ్యాపారంలో పెట్టుబడులను పెట్టడానికి ముందుగా మన ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవలసి ఉండేది. ఈ అనుమతి అవసరం లేదని యథేచ్ఛగా- ఆటోమేటిక్ రూట్- విదేశీయ సంస్థలు మన 'ఏకవస్తు ముద్రల' చిల్లర వ్యాపారంలోకి చొరబడి పోవచ్చునని గత జనవరిలో మోదీ ప్రభుత్వం నిర్ధారించింది. 'సంస్కరణ'లకు ఇది 'మచ్చుతునక' మాత్రమే..

విదేశాల నుంచి వివిధ రంగాలకు పెట్టుబడులు తరలివస్తుండడం వల్ల మన దేశంలోని జనానికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నాయి. ఉత్పత్తులు పెరిగి ఎగుమతులు పెరిగి 'విదేశీయ వినిమయ ద్రవ్య' పరిమాణం పెరుగుతుందట, విదేశీయ వాణిజ్యంలో మనకు ఏర్పడిన లోటు క్రమంగా తగ్గి మిగులు ఏర్పడుతుందట! ఈ 'సిద్ధాంతం' ప్రపంచీకరణ మొదలైన తరువాత గత పాతికేళ్లలో ఆచరణలోకి రాకపోవడం వికృత వాస్తవం. గత పదిహేనేళ్లలో విదేశీయ వస్తువులు ప్రధానంగా చైనీయ ఉత్పత్తులు మన దేశంలోకి ఇబ్బడి ముబ్బడిగా తరలి వస్తుండడం ఈ కఠోర వాస్తవం. దీపాలు- లాంటెరన్స్- దీపం బుగ్గలు- బల్బులు- పొయ్యి వెలిగించుకొనే పరికరాలు- లైటర్స్- గాలిపటాల దారం, వినాయకుని ప్రతిమలు, లడ్డూలు.. ఇవన్నీ కూడ చైనా నుంచి మన ఇళ్లలోకి చేరిపోవడం ప్రపంచీకరణ. కొత్తగా ఎంతమంది 'బహుళ సంస్థల' ఉద్యోగాల్లో చేరుతున్నారు? 'బహుళ సంస్థల' చిల్లర వ్యాపారం వల్ల ఎంతమంది చిట్టి వ్యాపారులు తమ దుకాణాలను మూసుకుంటున్నారు? ప్రభుత్వాల వద్ద లెక్కలున్నాయా? విదేశీయ నిధులతో కాక స్వదేశీయ నిధులతో ప్రగతిని సాధిస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 'భాజపా' వారు హోరెత్తించారు. ప్రభుత్వరంగ విమానయాన సంస్థ- ఎయిర్ ఇండియా-లో సగం వాటాలను విదేశీయ విమానయాన సంస్థలకు అమ్మిపారేస్తారట! సంస్కరణలకు ఇదో మచ్చుతునక!

ఉక్కు, సిమెంటు, ఇంధనం చమురు, ఇంధన వాయువు, విద్యుత్, బొగ్గు వంటి మౌలిక పారిశ్రామిక ఉత్పత్తులను పెంచడానికి వీలుగా ఈ మౌలిక రంగాల్లో మాత్రమే విదేశీయ పెట్టుబడులను అనుమతిస్తామని 1994-1996 సంవత్సరాల మధ్య అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ వాగ్దానం చేయడం చరిత్ర. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ మౌలిక రంగాలకు విదేశాల నుంచి లభించిన నిధుల విలువ ఎంత? ఇతరమైన అనవసర రంగాలకు లభించిన విదేశీయ సంస్థల పెట్టుబడుల విలువ ఎంత? మౌలిక రంగాలకు లభిస్తున్న పెట్టుబడుల కంటే ఇతర రంగాలకు లభిస్తున్న పెట్టుబడుల విలువ యాభయి రెట్లు అధికంగా ఉందన్నది ధ్రువపడని ప్రచారం! విదేశీయ సంస్థలు మన దేశంలోని బొగ్గు ఉత్పత్తులను పథకం ప్రకారం తగ్గించాయన్నది 2014లో జరిగిన ప్రచారం! 2008లో అమెరికాతో ఆర్భాటంగా కుదుర్చుకున్న 'అణు విద్యుత్' ప్రయోజనాల ఒప్పందం వల్ల ఒక్క యూనిట్ విద్యుత్ కూడ ఉత్పత్తి కాలేదు. ఈ ఒప్పందం అమలు జరిగితే రెండు పైసలకు యూనిట్ చొప్పున మన దేశంలో విద్యుచ్ఛక్తి సరఫరా జరిగిపోతుందని 2009 నాటి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన ప్రచారం. పదేళ్లు గడిచిపోయినప్పటికీ ఈ విద్యుత్ ఉత్పాదక కేంద్రాల నిర్మాణానికి పునాది రాయి కూడ సిద్ధం కాలేదు. ఆవకాయలను, అప్పడాలను, సేమ్యాలను, ఉప్పును, పప్పులను, కూరగాయలను, కరివేపాకును అమ్మడానికి 'వాల్‌మార్ట్' సంస్థ సిద్ధమైపోయింది! 'బహుళ వస్తు ముద్ర'ల చిల్లర వ్యాపారంలోకి విదేశీయ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటన్నది గత మూడున్నరేళ్లుగా స్పష్టం కాని కీలకమైన రహస్యం..

శుద్ధి ప్రక్రియ ద్వారా ఆహార పదార్థాలను నిల్వ చేసుకోవడం యుగాలుగా, తరాలుగా భారతీయ జీవన విధానం. ఈ ఆహార శుద్ధి ప్రక్రియ- ఫుడ్ ప్రాసెసింగ్- గృహ పరిశ్రమ. నాయనమ్మలు, అమ్మమ్మలు పచ్చళ్లు మొదలుకొని ఒరుగులు, బొరుగులు, అటుకులు, మరమరాలు, పుట్నాలు, జంతికలు, కోవాలు, తాండ్రలు తయారు చేసేవారు. ఈ కుటీర పరిశ్రమల యజమానులు వినియోగదారులను దోపిడీ చేయలేదు, ఈ వృత్తిద్వారా తాము జీవించారు. వీటిని బుట్టల్లో, తట్టల్లో పెట్టుకొని సంచార వ్యాపారులు గ్రామాల్లో, పట్టణాల్లో అమ్మి జీవించారు. స్వయం సహాయ బృందాలను, ఇతర గ్రామీణ బృందాలను ప్రోత్సహించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ 'ఆహారశుద్ధి'ని వికేంద్రీకృతం చేసి విస్తరించవచ్చు. కానీ ప్రభుత్వాలు ఈ వృత్తిని 'కేంద్రీకృతం' చేశాయి, చేస్తున్నాయి. బృహత్ ఆహారశుద్ధి ప్రాంగణాల- మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు-లను ఏర్పాటు చేస్తున్నాయి. పాలకోవా ఇంట్లో తయారుచేసి వీధుల్లో తిరిగి అమ్మే వ్యాపారులు నిరుద్యోగులై రోడ్డున పడుతున్నారు. రసాయనాలు కలసిన శీతల పానీయాల- కోల్డ్ డ్రింక్స్- రుచి మరిగిన వారికి లేత కొబ్బరి నీరు రుచించడం లేదు మరి. 'వాల్‌మార్ట్' దుకాణాలను తెరవనివ్వబోమని 2012లో చేసిన 'భీషణ ప్రతిజ్ఞ' గురించి భాజపా నాయకులకు ఇప్పుడు ధ్యాస ఉందా?

పత్రికా భాష ఎలా ఉండాలి..?

భాస్కరవాణి

-డా. పి.భాస్కరయోగి సెల్: 99120 70125

ఓ తరగతి గదిలో గణితం ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నాడు. 'ఒక వస్త్రవ్యాపారి మీటరు బట్టకు 50 రూపాయలు తీసుకుంటే 32 మీటర్ల బట్టలో అతడు చేసిన దోపిడీ ఎంత?' అని ఓ విద్యార్థిని అడిగాడు. ఏం జవాబు చెప్పాలో అర్థం కాక విద్యార్థి బిక్కమొహం వేశాడు. వస్త్రవ్యాపారి తన వ్యాపారం ద్వారా సంపాదించింది లాభమా? దోపిడీనా? వాడికి అర్థం కాలేదు. గతంలో బెంగాల్ కమ్యూనిస్టు ప్రభుత్వం ఇలా అడిగేది అని హాస్యం కోసం కొందరు చెబుతుంటారు. ప్రశ్నను రెచ్చగొట్టే విధంగా నూరిపోయడం కమ్యూనిస్టులకు అలవాటు. అలాగే పత్రికా రంగంలో కొత్త పరిభాషల్ని సృష్టించడం కోసం వాళ్లు బాగా ఆరాటపడతారు. ఈ పరిభాష, వ్యాఖ్యానం, విషయ సృష్టి, నిర్వచనం.. అన్నిట్లో ఈ దేశ మూలతత్వంపై మెల్లగా దాడిచేస్తారు. పైగా ప్రచార ప్రసార మాధ్యమ రంగాన్ని తామే నైతిక మార్గంలో నడిపిస్తున్నట్లు భ్రమింపచేస్తారు. కొందరైతే తమది ఏ సిద్ధాంతమో అర్థం కాకుండా చేసి మనల్ని కన్ఫ్యూజ్ చేస్తారు. వీర కమ్యూనిస్టులా పోజులిచ్చే ఓ విద్యావేత్త బాసరలో యజ్ఞం చేస్తాడు, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞానసభలో మాట్లాడగలుగుతాడు. మరో పెద్ద మనిషి మావోయిస్టులతో చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరిస్తాడు, శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామిని తన ఇంటికి పిలిపించుకుని ఆయనతో సన్నిహితంగా మెలగుతాడు. ఇలాంటి 'రెండు నాల్కల' మహా మనుషులంతా పత్రికలకు సిద్ధాంతకర్తలుగానూ వ్యవహరిస్తారు. వారు నాటిన విషబీజాలే మహావృక్షాలై ఇప్పుడు చాలా పత్రికల్లో కీలక స్థానాల్లో వున్నారు.

వీరు నోరు తెరిస్తే 'ప్రజల భాష' అని కలర్ ఇస్తుంటారు, కానీ అది ఏ దేశ ప్రజల భాషనో చెప్పరు. పత్రికల భాష ద్వారా కూడా మన ఆయువుపట్టును దెబ్బతీస్తారు. కొన్ని పదాలకు అర్థ సంకోచం, మరికొన్ని పదాలకు అర్థ వ్యాకోచం కల్పిస్తారు. సాంప్రదాయిక పదాలకు అర్థ నిమ్నత కల్పించి అగౌరవ పరుస్తారు. 'శఠగోపం' అనే పదం ఆగమశాస్త్ర పదం. శఠులు అనగా మోసగాళ్లు, వంచకులు అని అర్థం. అలాంటి మోసగాళ్లను తన పాదాల కింద తొక్కిపెట్టేవాడు విష్ణువు అనే దానికి సూచనగా శఠారిని భక్తుల తలపై మూడుసార్లు పెడతారు. శఠారి అంటే మోసగాళ్లకు శత్రువు అని అర్థం. కానీ ఈ పదం ఈరోజు నిమ్నత పొంది ఏదైనా మోసం చేసిన సంఘటనకు అతడు 'శఠగోపం' పెట్టి వెళ్లిపోయాడు అని మారింది. కుంభకోణం తమిళనాడులోని ప్రసిద్ధ క్షేత్రం. అక్కడ ఎప్పుడో, ఎవరో మోసం చేసారని ఆ పదాన్ని సామాజిక క్షేత్రంలో డబ్బు కొల్లగొట్టేవారందరికీ ప్రయోగిస్తున్నారు. ఏదైనా డబ్బును కుట్రతో కాజేస్తే పెద్ద కుంభకోణం జరిగింది అని అంటున్నారు. కైంకర్యం అంటే పూజ అని అర్థం. ఇది కూడా ధనం కాజేయడం అనే అర్థంలో వాడుతున్నారు. మంగళం అంటే శుభం అని అర్థం. సాధారణంగా ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం ముగింపులో మంగళహారతి ఇస్తారు. ఇప్పుడు 'మూసివేయబడిన' వాటిని గురించి చెప్పడానికి మంగళం అని వాడుతున్నారు. మరి ఈ పదాల సృష్టికర్తలు ఎవరు?

ఏదైనా డబ్బును కుట్రతో కాజేస్తే పెద్ద కుంభకోణం జరిగింది అని అంటున్నారు. కైంకర్యం అంటే పూజ అని అర్థం. ఇది కూడా ధనం కాజేయడం అనే అర్థంలో వాడుతున్నారు. మంగళం అంటే శుభం అని అర్థం. సాధారణంగా ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం ముగింపులో మంగళహారతి ఇస్తారు. ఇప్పుడు 'మూసివేయబడిన' వాటిని గురించి చెప్పడానికి మంగళం అని వాడుతున్నారు. మరి ఈ పదాల సృష్టికర్తలు ఎవరు? భాషను, వ్యాకరణాన్ని ధ్వంసం చేసి ప్రాచీనతను నరికివేయాలనే కరడుగట్టిన భాషావేత్తలు, భాషను సరళం చేసే మిషతో వ్యవహార భాషను నెత్తికెత్తుకున్న మేధావులే ఈరోజు భాషలు అంతర్ధానం అవుతున్నాయని గగ్గోలు పెడతారు.

భాషను, వ్యాకరణాన్ని ధ్వంసం చేసి ప్రాచీనతను నరికివేయాలనే కరడుగట్టిన భాషావేత్తలు, భాషను సరళం చేసే మిషతో వ్యవహార భాషను నెత్తికెత్తుకున్న మేధావులే ఈరోజు భాషలు అంతర్ధానం అవుతున్నాయని గగ్గోలు పెడతారు. నన్నయ్యభట్టు రాజమహేంద్రవరంలో ఉండి భారతం రచించినా, నెల్లూరులో జీవించి తిక్కన సోమయాజి భారత రచన చేసినా, వరంగల్లులో పోతనామాత్యుడు నివసించి భాగవతం గ్రంథస్థం చేసినా ఇందులోని పలుకుబడి అన్ని ప్రాంతాలవాళ్లను అక్కున చేర్చుకొంది. ఈ పద్య, గద్యాలు అన్ని ప్రాంతాలవాళ్లకూ అర్థమయ్యాయి. కానీ, భాషా సంస్కర్తల పేరుతో పత్రికల ద్వారా తెలివిగా మూల భాషను మట్టుబెట్టే ప్రయత్నం చాలామంది 'ఎర్ర పాత్రికేయులు' నిర్విఘ్నంగా కొనసాగించారు. అసలు ప్రాథమికమైన వ్యాకరణం నేర్చుకోవడం కూడా నేరం అన్నంతగా ఈ మేధావులు పత్రికా రంగంలో ప్రచారం చేశారు. దీంతో ఏది సాధుపాఠమో ఏది సరైన పద ప్రయోగమో చెప్పలేని దుస్థితి.

నిజానికి 'విలేఖరులు' అనే పదంలోనే వ్యాకరణం దోషం వుంది. ఇది భాషా శాస్త్రం చదువుకొన్న వాళ్లందరికీ తెలుసు. 'విలేకరులు' అనేది సరైన పాఠం. భాషా పరిజ్ఞానం కల్పించాల్సిన బాధ్యతను విస్మరించిన ఈ మేధావులు వున్న భాషను జీవం లేకుండా చేసి కొత్త పదాలను సృష్టించడం విడ్డూరం. అవన్నీ కృతకంగా ఉంటున్నాయి.

ఆచార్య కసిరెడ్డి వంటివారు పత్రికా భాష ఎలా ఉండాలనే దానిపై విస్తృత చర్చే చేశారు. పత్రికా రచనలో భాషా సమతుల్యత ఉండాల్సిందిపోయి విషమతుల్యత చోటు చేసుకోవడం వింతల్లోకెంత వింత. సిద్ధాంతాల కనుగుణంగా భాషను సృష్టించి వాటికి నిర్వచనాలు ఇస్తుంటే మనం ఇంత సంకుచితం అయిపోయామా? అనిపిస్తుంది. శైలీశయ్యా సమత కోసం పత్రికా భాషలో చాలా నియమాలు పాటించాలి. ఇవేవీ లేకుండానే పత్రికల్లో భాష చాలావరకు కొనసాగుతుంటే, వీటిపై ఎలాంటి శిక్షణ లేకుండానే టీవీ మాధ్యమాలు దుమ్ము రేపుతున్నాయి. కులోన్మాదులను సెలబ్రిటీలుగా మార్చే ప్రక్రియ ప్రసార మధ్యమాలు నిరాటంకంగా చేస్తుంటే మనం నోరెళ్లబెట్టి చూడడం తప్ప ఇంకేం చేయలేం. వితండ వాదం, అడ్డగోలు వాదనను జర్నలిజంలో అత్యున్నత ప్రమాణంగా పాటిస్తుంటే విలువలు, పాఠాలు వింత పదాలు..!

ఈనాడు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేఖరులకు భాషా నైపుణ్యం, విషయ సేకరణ కొరవడింది. సంచలనమే వార్తగా జగతికెక్కడం భాషను పాతరేయడం కాక ఇంకేమిటి? ఈ గందరగోళంలో మనం భాషా పరిజ్ఞానం కోల్పోతున్నాం. పత్రికా భాషలో గ్రాంథిక భాష కాకుండా వ్యవహార భాష ఉండాలి. మాండలిక ప్రయోగం చేసినా అది కనీసం డెబ్బై శాతం మందికి తెలిసినదిగా ఉండాలి. పదాద్యక్షరాల్లో అచ్చు ఉంటే అచ్చు, హల్లుంటే హల్లే విధిగా రాయాలి. వ్యవహార భాష పేరుతో ఊరును వూరుగా రాయకూడదు. గ్రాంథికంలో వాడే 'అతనియందు' లాంటి పదాల్లో అతనిలో అని రాయాలి. సంధికార్యాలు అవసరం ఉంటేనే చేయాలి. ఉచ్చారణ విధిని అనుసరించి లిపి వుండాలి. పరుష సరళాలు గసడదవలు సమాసంలో పాటించవచ్చు. ఉదా: కూరగాయలలో 'కా'ను 'గా'గా కూడా రాయవచ్చు. ఆయన కాలు బెణికింది అన్నపుడు 'కా'ను 'గా'గా రాయాల్సిన అవసరం లేదు.

ఈనాటి తెలుగులో 'అర సున్న' అవసరం లేదు. రెండు పదాలను మించి సమాసం చేయవద్దు. జన వ్యవహారంలో బాగా నానుతున్న అన్యదేశ్యాలు ప్రయోగించవచ్చు. కారు, స్టేషన్, రైలు, బందోబస్తు వంటివి. కొందరు 'చదవడం' లాంటి పదాల్లో 'డ'కు బదులుగా 'ట'ను వాడతారు. కానీ ఎక్కువమంది ప్రయోగించే 'డ'ను వాడడం మంచిది. తెలుగులోకి వచ్చిన ఉర్దూ, పారసీ పదాలు ప్రసిద్ధమైతే ఈరోజుకూ వాడుతున్నారు. బర్దస్త్, రద్దీ రాస్తా, రాస్తారోకో, వాజీఫా, దివాలా వంటి పదాలు ఇప్పటికీ జనం నోట్లో నానుతున్నాయి. అందుకే పత్రికలు స్వీకరించాయి. కానీ దీనిని కూడా ఏదో మహాప్రసాదంగా అభివర్ణిస్తూ 'గంగా యమునా తెహజీబ్' అని జబ్బలు చరచుకొనేవాళ్లు పత్రికారంగంలో బోలెడంతమంది ఉన్నారు. వాళ్లతో వచ్చిన చిక్కంతా అదే..!

పత్రికా రచనలో విరామ చిహ్నాలకూ ప్రాధాన్యత ఉంది. ఒక్క విరామ చిహ్నం అందులోని భావాన్ని తెలియజేస్తుంది. ముగింపుచుక్క (ఫుల్‌స్టాప్), తోకచుక్క (కామా), కోలన్ (చుక్కతోక), కోలన్ (రెండు చుక్కలు) పొట్టిగీత, ఒంటి ఉల్లేఖనాలు, జంట ఉల్లేఖనాలు, ప్రశ్న చిహ్నం, సంబోధన, రాగ చిహ్నం (ఎక్స్‌లమేటరీ) వంటివి తప్పక పాటించాలి. ఇవి సరిగా పాటించకుంటే అడ్డుకట్టలేని ప్రవాహమే.

చదివేవాళ్లకు విసుగు తెప్పించకుండా అల్పాక్షరాల్లో అనల్ప భావన సారవంతంగా చెప్పాలి. పాఠకుడి మనస్సుపై బరువు పడని అంశాలు రచనలో వుండాలి. భాషా సౌందర్యాన్ని సామాన్యుడి దరిచేర్చేది పత్రిక. అలాంటి పత్రికలు కూడా సిద్ధాంతాల రాద్ధాంతాల చట్రంలో ఇరుక్కొని నలిగిపోవడం గర్హనీయం. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు' అన్న నానుడి నిజం కావాలంటే భాషపై విషం చిమ్మే ప్రయత్నం మానుకోవాలి. తమ సిద్ధాంతాలకు అనుగుణమైన భాషను ప్రచార ప్రసార మాధ్యమాలకు ఎక్కించి 'పీఠాలపై కూర్చున్న కుహనా మేధావుల'కు భాష ద్వారా విషప్రచారం చేయడం బాగా తెలుసు. మూలాలను ముంచేసే ఈ ప్రక్రియ ఈ డెబ్బై ఏళ్లలో పత్రికా రంగంలో బాగా కొనసాగింది. దీనికి సమాంతరంగా ఇప్పుడు సామాజిక మాధ్యమాలు వస్తే వీళ్లు భరించలేక పోతున్నారు. గతంలో వీళ్లు చెప్పిందే వేదంగా ఉండేది. ఇప్పుడు స్వీయ ఆలోచనలతో కొత్త తరం విజృంభిస్తుంటే ఈ కుహనా మేధావులు తట్టుకోలేక అక్కసు వెళ్లగక్కుతున్నారు. ప్రసిద్ధ పాత్రికేయుడైన రాజ్‌దీప్ సర్దేశాయ్ ఎన్నోసార్లు 'నెట్ హిందువులు' అంటూ తన ఉక్కుబోత వెళ్లగక్కాడు. అక్షరానికి రక్తాన్ని రుద్ది 'ఎర్రసిరా' అని నమ్మించవచ్చు, కానీ 'అక్షరం' నాశనం లేనిదన్న సత్యం అర్థమైతే అది శాశ్వతమైన భారతీయత అని తెలుసుకొంటారు.

★

రాయితీలు స్వల్పం.. జనహితమే లక్ష్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనాకర్షక పథకాలు మెండుగా ఉంటాయన్న అంచనాలకు భిన్నంగా ప్రజాహితమే ముఖ్యమన్న భావనను ప్రతిబింబిస్తూ మోదీ సర్కారు సాహసోపేతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దేశ ప్రజానీకంలో అసమానతలను తగ్గించటంపై దృష్టిపెట్టి, సామాజిక భద్రతకు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి, ఉపాధి కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వం పూనుకుంది. పన్ను ఎగవేతకు మార్గాలను మూసివేసి, సబ్సిడీలను అవసరమైన వారికే పరిమితం చేయటం, పన్ను రాయితీలను తగ్గించటం మీద ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించినట్టు బడ్జెట్ తేటతెల్లం చేస్తోంది.

మార్కెట్ల పతనం దేనికి సంకేతం?

బడ్జెట్ ప్రతిపాదనలకు సానుకూలంగా స్టాక్ మార్కెట్లు స్పందిస్తే సంపన్న వర్గాలకు అనుకూలంగా ఆ ప్రతిపాదనలు ఉన్నాయని అర్థం. ఈసారి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం మొదలెట్టగానే కొంతసేపు మార్కెట్లు లాభాల్లోనే కొనసాగాయి. పన్నుల ప్రతిపాదనలు తెలిపిన తర్వాత సూచీలు కుదుపులకు లోనయ్యాయి. సెన్సెక్స్ 450 పాయింట్ల వరకు పతనమైంది. ప్రసంగం ముగిసాక 290 పాయింట్ల వరకు పెరిగి చివరకు 58.36 పాయింట్లు నష్టంతో లావాదేవీలు ముగిసాయి. స్టాక్‌మార్కెట్లను తీవ్రంగా నిరాశపర్చినది మూలధన లాభాల పన్ను. లక్షలకు పైబడ్డ లాభాలపై 10 శాతం దీర్ఘకాల మూలధన లాభాల పన్నును విధించారు. ఇది మదుపరులకు నచ్చలేదు. కాని ఇది పురోగామి చర్య. గత ఏడాది పెద్దపెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల వారు రూ.3,67,000 కోట్లమేరకు స్టాక్‌మార్కెట్ల లావాదేవీలపై లాభాలు ఆర్జించారు. ప్రభుత్వానికి ఆ లాభాల కారణంగా ఒక్క రూపాయి కూడా ఆదాయం రాలేదు. కనుక ఆర్థికమంత్రి ఫిబ్రవరి 1 నుండి జరిగే అన్ని లావాదేవీలపై మూలధన లాభాల పన్ను విధించారు. సంపన్న వర్గాలు వారు వ్యతిరేకిస్తారని తెలిసి కూడా ఈ పురోగామి చర్యలకు పూనుకోవటం నిజంగా సాహసమే.

చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఊతం

కార్పొరేటు పన్ను మన దేశంలో ప్రస్తుతం 30 శాతంగా ఉంది. దీన్ని తగ్గించాలని పారిశ్రామిక వర్గాలు ఎప్పటి నుండో కోరుతున్నాయి. ఇతర దేశాలలో కార్పొరేటు పన్నులు మన దేశంలో కంటే తక్కువగా ఉన్నాయి. పెట్టుబడులను ఆకర్షించటానికి దేశాల మధ్య ఉన్న పోటీ వలన ఈ పన్నును తగ్గించటం తప్పనిసరి. గత ఏడాది 50 కోట్ల మేర టర్నోవర్ ఉన్న కంపెనీలకు మాత్రమే 25 శాతం కార్పొరేటు పన్నును వర్తింపచేశారు. ఈ ఏడాది ఈ పరిమితిని 250 కోట్లకు పెంచారు. దానితో ఆరులక్షల కంపెనీలకుగాను 59,300 కంపెనీలకు కార్పొరేటు పన్ను 25 శాతం అయింది. మిగిలిన 7000 కంపెనీలు చాలా పెద్దవి. వారి టర్నోవర్ ఏడాదికి లక్షల కోట్లలో ఉంటుంది. కాలక్రమంలో వాటికి కూడా దీనిని వర్తింప చేస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. ఈ చర్య చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెద్ద ఊరట.

నల్లధనం కట్టడికి యత్నం

గత ఏడాది పెద్దనోట్ల రద్దు తర్వాత ఆశించినంత మేర నల్లధనం బయటపడలేదు. బ్యాంకులు, ఉన్నత అధికార వర్గాలవారు నల్లకుబేరులతో చేతులు కలపటంలో ఆచరణలో ఆ పథకం విఫలమైనట్లుగా కనపడింది. కానీ, ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనల వలన పన్ను చెల్లింపుదారులు పెరిగారు. పెద్దనోట్లు రద్దు తర్వాత కార్పొరేటు పన్ను ద్వారా రాబడి పెరగలేదు. అయితే వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారుల సంఖ్య 8.27 కోట్లకు చేరింది. 120 కోట్ల మంది ఉన్న దేశంలో కేవలం 7 శాతం మాత్రమే ఆదాయపన్ను చెల్లిస్తున్నారు. జీఎస్‌టి ప్రవేశపెట్టిన తర్వాత వ్యక్తిగత ఆదాయపు పన్ను ద్వారా, కార్పొరేటు పన్ను ద్వారా కూడా రాబడి పెరిగింది. అన్ని లావాదేవీలు నమోదు అవుతుండటంతో వచ్చిన ఆదాయపుపన్ను ఎగవేత వ్యాపారులకు కష్టంగా మారింది. అంతకుముందు ఉన్న అనేక పరోక్ష పన్నుల స్థానంలో ఇప్పుడు వారు చెల్లిస్తున్న ఒకేఒక పన్ను వస్తు సేవల పన్ను. దాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామని ఆర్థికమంత్రి ప్రకటించటం ముదావహం.

వేతన జీవులకు వెసులుబాటు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ప్రభుత్వేతర వేతన జీవుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని వారికి కొంత వెసులుబాటును ఈ బడ్జెటులో కలిగించి ఉండవలసింది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెరుగుతుందని, పన్ను శ్లాబులలో, పన్నురేట్లలో అనుకూలమైన మార్పులు వస్తాయని ఆశించిన ఉద్యోగస్తులకు ఆశాభంగం అయింది. బహుశా బడ్జెటుపై చర్చ సందర్భంగా పన్నురేట్లను ఆర్థికమంత్రి సవరించవచ్చు లేదా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని కొంత పెంచవచ్చు. వయోధికులు బ్యాంకులలో, పోస్టాఫీసులలో దాచుకునే మొత్తాలపై వచ్చే వడ్డీ ప్రస్తుతం 10వేలు దాటితే పన్ను పరిధిలోకి వస్తుంది. ఆ పరిమితిని 50 వేలకు పెంచటం వయోధికులకు ఉపశమనం. జీవిత బీమా సంస్థలో 7.5 లక్షల వరకు మదుపు చేసుకొనేందుకు ఉన్న ప్రస్తుత పరిమితిని 15 లక్షల వరకు పెంచి, నికరంగా వార్షిక వడ్డీ శాతం 8 శాతం వచ్చేటట్లు చేశారు.

రబీ పంటలకు ఇప్పటికే వర్తింపు చేసిన కనీస మద్దతు ధర పెంపును ఇప్పుడు ఖరీఫ్ పంటలకు వర్తింపచేయటంతో దాదాపు అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్లయింది. ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు అయేటట్లు కనీస మద్దతు ధర నిర్ధారించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలుకు నోచుకోకపోయినా 1 1/2 రెట్లు అదనంగా కనీస మద్దతు ధరను పెంచటానికి నిర్ణయించటం ముదావహం. అయితే, రైతులలో కేవలం 5.8 శాతం మంది మాత్రమే దాని వలన లబ్ధి పొందనున్నారు. వ్యవసాయ ఋణాల లక్ష్యం వచ్చే ఆర్థికానికి 10 శాతం అంటే 11 లక్షలకు పెంచటం, పాడి రైతులకూ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వటం, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు, పరిమళ ద్రవ్యాలు, సుగంధ నూనెలు, తదితర చిన్న ఉత్పత్తిదారులకు సహకారం, నేరుగా వినియోగదారులకే అమ్ముకోవటానికి వీలుగా 22 వేల గ్రామ సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి చేయటానికి సంకల్పం, కౌలు రైతులకు ఋణ సౌకర్యం అందించేందుకు చేసిన ప్రతిపాదనలు అన్నీ గ్రామీణ భారత వికాసానికి దీన్‌దయాళ ఉపాధ్యాయ స్ఫూర్తి నుండి చేసినట్లు కనపడుతుంది.

ఆయుష్మాన్ భారత్

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 10 కోట్లమంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరే ఈ జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం క్రింద ఏడాదికి 5 లక్షలమేర పేదల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. దీంతోపాటు ఆరోగ్య, స్వస్థత కేంద్రాలు ద్వారా సమగ్ర ఆరోగ్య పరిరక్షణ సేవలను అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరుచుతున్నట్లు ఆర్థికమంత్రి చెప్పారు. గ్రామీణ పేద ప్రజలను ఉద్దేశించి యోచన చేసిన ఆరోగ్య పథకాలు ప్రజలకు మేలు చేసేవే.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

జాతీయ రహదారుల అభివృద్ధికి, గ్రామీణ రహదారులకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదల ఇళ్ళ నిర్మాణానికి, రైల్వేల ఆధునీకరణకు, రైల్వే ప్రయాంకుల భద్రతకు భారీ ఎత్తున నిధులు కేటాయించారు. 2019 నాటికి దాదాపు కోటి ఇళ్ళు నిర్మాణానికి, పట్టణ ప్రాంతాలలో 37 లక్షల ఇళ్ళు నిర్మాణానికి పూనుకొనటం సాహసమే. 9వేల కిలోమీటర్లకు పైగా పొడవైన జాతీయ రహదారులను నిర్మాణం చేయాలని సంకల్పించారు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగా మౌలిక వసతులు విస్తరణ కార్యక్రమంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయి.

అమలు జరిగేనా?

గ్రామీణ భారతం రుణశయ్య మీద ఉంది. బడ్జెటులో సింహభాగం రూ.14.34 లక్షల కోట్లు గ్రామ ప్రాంతాలలోనే ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. 3.17 లక్షల కిమీ మేర రహదారులు, 51 లక్షల కొత్త ఇళ్ళు, 1.86 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, 1.75 కోట్ల ఇళ్ళకు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు ప్రకటించారు. పథకాలు అమలైతే గ్రామీణ భారతం స్వర్ణభారతం అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. సామాజిక భద్రతకు, ప్రజారోగ్యానికి, నల్లధనం అదుపునకు, స్వావలంబన సాధనకు ప్రభుత్వం తీసుకొన్న చర్యలు నిజంగా అభినందనీయమే. ప్రభుత్వ యంత్రాంగపు సామర్థ్యాన్ని నమ్ముకొని ఇవన్నీ కార్యరూపం దాల్చి ప్రజలకు చేరుతాయని మోదీ అనుకుంటే ఆయన పప్పులో కాలువేసినట్లే!

-డా. బి.సారంగపాణి

మీ రోగమే మా భాగ్యం!

జనాంతికం

బుద్ధా మురళి

buddhamurali2464@gmail.com

"ఏరా..! అలా మెలికెలు తిరిగిపోతున్నావ్? ఏదో చెప్పాలనుకుంటున్నావ్?"

"ఆఫీసులో సుజాత అదోలా చూసింది.."

"చూడదా? కలిసి పనిచేస్తున్న వారికి ఆ మాత్రం అనిపించకుండా ఉంటుందా? కాటికి అడ్వాన్స్ బుకింగ్ చేసుకుని ఎదురు చూస్తున్న వాడిలా కనిపిస్తున్నావ్.. నీకు అసలేమైంది?"

"వెటకారం చాలులే, నాకేమీ కాలేదు. నా కొత్త లుక్‌ను చూసి, జెలసీతో ఏదో మాట్లాడుతున్నావ్! హీరోలా ఉన్నాను నాకేంటి? "

"నేనూ అదే అంటున్నాను. 45ఏళ్ల వయసు కూడా లేదు అప్పుడే తెలుగు సినిమా హీరోలా అరవై ఏళ్ల వ్యక్తిలా కనిపిస్తున్నావు. బహుశా షుగర్ కావచ్చు.. టెస్ట్ చేయించుకున్నావా? "

"షుగర్, బీపీ, థైరాయిడ్, న్యుమోనియా, ఓల్డ్ మోనియా అన్ని టెస్ట్‌లు చేయించుకున్నా.. నాకేమీ కాలేదు"

"పోనీ.. ఆ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఉన్న యంత్రాలన్నింటికీ పని కల్పిస్తూ అన్ని టెస్టులు చేయమనాల్సింది. ఏదో ఒక రోగం కచ్చితంగా బయటపడేది. "

"రోజురోజుకూ నేను స్లిమ్‌గా తయారవుతున్నానని నీకు కుళ్లు.."

"ఏదో అంతుచిక్కని జబ్బుతో బాధపడుతున్నట్టు కనిపిస్తున్నావ్ .. కొంపదీసి .."

"ఛీ..ఛీ.. జీవితంలో సుఖమే లేదు ఇక సుఖ రోగమా?"

"మరేంటిరా.. అలా అయిపోతున్నావ్... సడన్‌గా చూస్తే నేను కూడా నిన్ను అస్సలు గుర్తుపట్టలేదు. "

"నువ్వేంటి.. వారం రోజుల పాటు పుట్టింటికి వెళ్లి వచ్చిన మా ఆవిడే చూడగానే నన్ను గుర్తు పట్టలేదు. "

"నువ్వు ఏదో దాస్తున్నావు.. మహా నాయకులు, దేశాధినేతలు అనారోగ్యంతో ఉంటే వెంటనే ప్రకటించరు. రాజ్యం అల్లకల్లోలం అవుతుందని, పెద్ద పెద్ద కంపెనీల పాలకులూ అంతే. నువ్వో సాధారణ ఉద్యోగివి, వీలునామా రాసేంత ఆస్తి కూడా లేదు"

"అనారోగ్యం అని ఎందుకు అనుకుంటావ్? ఆరోగ్యం, కొత్త శక్తి వల్ల ఇలా అయ్యాననే ఆలోచన నీకు ఎందుకు రావడం లేదు"

"ఏదో దాస్తున్నావనేది మాత్రం నిజం"

" ట్యుమ్రీరావు ఆరోగ్య ఫార్ములాను అనుసరిస్తున్నా. దాని ఫలితమే ఇది. "

"ఏంటో ఆ ఫార్ములా?"

"గురుముఖంగా నేర్చుకుంటేనే ఆరోగ్యం బాగుంటుంది. ట్రేడ్ సీక్రెట్ ఎవరికీ చెప్పవద్దన్నారు. ఐనా మిత్రుడివి కాబట్టి చెబుతున్నాను. నువ్వు ఉదయం ఏం చేస్తావ్?"

"ఏం చేస్తాం.. మా ఆవిడ లేస్తే టిఫిన్ చేస్తుంది.. నేనూ తింటాను. ముందు నేనే లేస్తే టిఫిన్ చేస్తాను.. ఇద్దరం తింటాం"

"మరదే.. అల్పమానవులు మీరంతా ఉదయం టిఫిన్ చేసి మధ్యాహ్నం భోజనం చేస్తారు. రాత్రి నిద్ర పోతారు. కానీ మేమలా కాదు. ట్యుమ్రీరావు ఫార్ములా దీనికి భిన్నమైంది. మేం ఉదయం భోజనం చేస్తాం. మధ్యాహ్నం టిఫిన్ చేస్తాం. పగలు పడుకుంటాం, రాత్రి మేల్కొంటాం. ఆఫీసు పని ఇంట్లో చేస్తాం. ఇంట్లో పని ఆఫీసులో చేస్తాం. భార్యను పలకరించం, పక్కింటావిడ చెప్పిన పని చేస్తాం . దీని వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో నూటపాతిక సంవత్సరాలు బతుకుతాం.. నూటపాతికకు ఐదో పదో ఎక్కువే తప్ప తగ్గే ప్రసక్తే లేదని ట్యుమ్రీ రావు గట్టిగా బల్లగుద్ది మరీ చెప్పాడు."

"నిజమా?"

"ఇలాంటి అపనమ్మకులతో ఈ ఫార్ములా గురించి మాట్లాడవద్దని, విశ్వాసుల వద్దనే మాట్లాడాలని ట్యుమ్రీరావు అందుకే చెప్పారు"

"సరే.. నూటపాతిక సంవత్సరాలు బతుకతావనే అనుకుందాం. అంత కాలం బతికి ఏం చేస్తావురా? ఒంటరిగా బోరుకొట్టి పిచ్చెక్కి ఆత్మహత్య చేసుకుంటావు. దాని కన్నా సకాలంలో మరణం మంచిది కదా?"

"నా మనోభావాలను అవమానిస్తున్నావ్.."

"ట్యుమ్రీరావు ఈ ఫార్ములా రహస్యం నీకు చెప్పి ఎంత తీసుకున్నాడు"

"ఏడాదికి ఇంత అని నూటపాతిక సంవత్సరాల మొత్తం నాలుగు ఇన్‌స్టాల్ మెంట్లలో తీసుకున్నాడు."

"అంత గ్యారంటీ ఇచ్చినప్పుడు ఫీజేదో నీకు నూటపాతిక సంవత్సరాలు వచ్చిన తరువాత తీసుకుంటే బాగుండేది కదా?"

"ఫార్ములాపై నాకు నమ్మకం లేకపోతే కదా?"

"దీన్నే మార్కెట్ మాయాజాలం అంటారురా అప్పిగా .. పతంజలి పుణ్యమాని ఆయుర్వేదానికి, ఆరోగ్య రహస్యాలకు ఇప్పుడు మంచి డిమాండ్ ఏర్పడింది. ట్యుమ్రీరావు కన్నా ముందు ఇంకో రావు ఇలానే బాగుపడ్డాడు.. కానీ ఆరోగ్యం మందగించి అతడు కనిపించకుండా పోయాడు. ట్యుమ్రీరావుల ప్రకృతి ఆహారానికి మంచి మార్కెట్ ఏర్పడింది. మహా మహా కోల్గెట్ కంపెనీ వాడే పతంజలి దెబ్బకు వేదాంత కోల్గెట్ అంటూ పురాణాలను నమ్ముకున్నాడు. నీకో రహస్యం చెప్పనా? ఈ మార్కెట్ టెక్నిక్ మీ ట్యుమ్రీ రావు కొత్తగా కనిపెట్టిందేమీ కాదు. కోల్గెట్ వంటి బహుళజాతి కంపెనీ పతంజలి కన్నా ముందే ఈ టెక్నిక్‌ను ఇండియాలో అమలు చేసింది. ఉదయం లేవగానే మనం టీ తాగుతాం కదా? దీనిపై నీ అభిప్రాయం?"

"ఎక్కువగా టీ తాగడం ఆరోగ్యానికి మంచిది కాదు.. ట్యుమ్రీ రావులే కాదు నువ్వు ఏ డాక్టర్‌ను అడిగినా చెబుతారు."

"నిజమే కదా? కానీ మొదట మన దేశంలో టీ అలవాటు చేసేందుకు ఏం చెప్పారో తెలుసా? దీర్ఘాయుష్షు కోసం టీ తాగమని ప్రకటనలు ఇచ్చారు. సరిగ్గా ఎనభై ఏళ్ల క్రితం 'ఇండియా టీ వల్ల దీర్ఘాయుష్షు కలుగుతుంది' అని 4.1.1937 నాటి గోల్కొండ పత్రికలో పూర్తి పేజీ ప్రకటన ఇచ్చారు. ఆయుష్షు పెరగడానికి టీ తాగమని ఆనాడే విస్తృత ప్రచారం చేశారు. కావాలంటే నెట్‌లో దొరుకుతుంది చూడు. ఏదో సమాచారం కోసం ఇంటర్నెట్‌లో అన్వేషిస్తుంటే ఆ ప్రకటన కనిపించింది. టీ ఎలా తయారుచేయాలో కూడా ఆ ప్రకటనలో నేర్పించారు. ఒకసారి మనకు అలవాటు అయ్యాక టీ లేనిదే బతక లేని స్థితికి చేరుకున్నాం. బ్రిటిష్ వాడు దేశం వదిలి వెళ్లినా ఆ కాలంలో వాడు అలవాటు చేసిన టీ మనల్ని ఇంకా వదలలేదు."

"అంటే.. నిజం కాదా? "

"అదేదో కంపెనీ అండర్‌వేర్ ధరిస్తే అందమైన అమ్మాయిలు మన వెంట పడతారనే ప్రకటనలు నమ్మడం లేదా? అలానే దీర్ఘాయుష్షు కోసం ఫలానా హోటల్‌లో తినండి, ఫలానా హీరో సినిమాలే చూడండి అని చెప్పినా మనం నమ్మేస్తాం. మన నమ్మకమే వారి వ్యాపారం. ఆరోగ్యం పేరుతో మనకు ఏదైనా అమ్మవచ్చునని 80 ఏళ్ల క్రితమే బ్రిటిష్ కంపెనీలు కనిపెట్టాయి."

★


జైపూర్‌లోని జోహారీ బజార్‌లో కలశ్ శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు

భూ ఆక్రమణ కేసులో గిరిరాజ్ సింగ్

పాట్నా జిల్లా అసోపూర్‌లో కేంద్ర మంత్రిపై దళితుడి ఫిర్యాదు ■ స్పందించిన ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం

పాట్నా, ఫిబ్రవరి 8: బిహార్‌లోని పాట్నా జిల్లా అసోపూర్‌లో జరిగిన భూకబ్జా కేసులో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత గిరిరాజ్‌సింగ్ పేరు నమోదైంది. ఆయనతోపాటు మరో 32మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అసోపూర్ గ్రామానికి చెందిన రామ్‌నారాయణ ప్రసాద్ అనే దళితుడి ఫిర్యాదుపై స్పందించిన ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం ఆదేశాల మేరకు మంత్రి గిరిరాజ్‌సింగ్‌పై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని దనాపూర్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్ సందీప్‌కుమార్ సింగ్ తెలిపారు. కాగా బిహార్‌లోని నవడా ఎంపీ గిరిరాజ్‌సింగ్, అతడి అనుచరులు తనకు చెందిన 2.6 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని, వారి ప్రయత్నాలను అడ్డుకోబోగా తనను దుర్భాషలాడారని బాధితుడు రామ్‌నారాయణ ఫిర్యాదు చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈనెల 2వ తేదీన ఇచ్చిన కోర్టు ఆదేశం మేరకు ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

కాగా ఈ కేసు వెనుక బిహార్ శాసనసభలో విపక్ష నాయకుడు తేజస్వీయాదవ్ ప్రోద్బలం ఉంది. తన ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీకి చెందిన ఎంపీపై కేసు నమోదైనందున ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని తేజస్వీయాదవ్ డిమాండ్ చేశారు. దళితులకు చెందిన మూడెకరాల భూమిని మీ సన్నిహితుడైన గిరిరాజ్‌సింగ్ ఆక్రమించుకున్నారని, తక్షణం రాజీనామా చేయాలని ఆయన ట్విట్టర్‌లో డిమాండ్ చేశారు.



బినామీ భూలావాదేవీలు, అవినీతి ఆరోపణలతో తేజస్వీయాదవ్‌పై కేసులు పెట్టిన నేపథ్యంలో ఇప్పుడు ఆయన గిరిరాజ్ వ్యవహారాన్ని రచ్చకీడ్చి నితీశ్‌కుమార్ రాజీనామాను కోరుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కుమారుడైన తేజస్వీయాదవ్ గతంలో డిప్యూటీ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా తనస్థానంలో ఆ తరువాత డిప్యూటీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బీజేపీకి చెందిన సుశీల్ కుమార్ మోడీపై కూడా తేజస్వీయాదవ్ విమర్శలు గుప్పించారు. అబద్ధాలను ప్రచారం చేయడంలోను, భూకబ్జా వివాదాలను మరుగుపరచడంలోను నిష్ణాతులైన మీకు గిరిరాజ్‌సింగ్ కబ్జాచేసిన భూమిలో వాటా ఉందా అంటూ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. కాగా దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ స్పందిస్తూ గిరిరాజ్ సింగ్ చట్టానికి కట్టుబడే వ్యక్తి అని, సమయం వచ్చినప్పుడు కోర్టు ఎదుట సత్యం వెల్లడిస్తామని, ఈ విషయాన్ని రాజకీయ వివాదంగా మార్చేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను పట్టించుకోనవసరం లేదని అన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి

- డబుల్ బెడ్‌రూమ్‌ల్లో 1,73,406 ఇళ్లకు టెండర్లు పూర్తి
- లక్ష 38వేల 795 ఇళ్లు గ్రౌండ్, 5824 పూర్తి
- ప్రతీ హాస్టల్, పాఠశాల, కళాశాలలకు గ్రేడింగ్‌లు
- అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి గురుకులంలో సీటు
- స్టడీ సర్కిళ్ళ ద్వారా బలహీన వర్గాల యువతకు శిక్షణ
- ఇళ్లు, విద్య, విద్యుత్‌శాఖలపై తెలంగాణ సిఎస్ జోషి సమీక్ష


సచివాలయంలో వివిధ శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎస్ ఎస్‌కె జోషి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి దృష్టిసారించారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయంలో గురువారం రెండో రోజు కూడా వివిధ కార్యక్రమాలపై శాఖాధిపతులతో జోషి సమీక్ష సమావేశం నిర్వహించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, విద్యుత్, విద్యా, మున్సిపల్ శాఖల పురోగతిని సిఎస్ అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో ఇప్పటివరకు లక్ష 73 వేల 406 ఇళ్లకు టెండర్లు ఖరారు కాగా లక్ష 38వేల 795 ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా 5824 ఇళ్లు పూర్తి అయినట్టు సిఎస్ వివరించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన ఇళ్లకు నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సౌభాగ్య పథకం ద్వారా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన గురుకుల విద్యాలయాల్లో అర్హతకలిగిన ప్రతీ విద్యార్థికి సీటు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక నుంచి ప్రతీ హాస్టల్, పాఠశాల, కళాశాలకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని రూపొందించాలని సిఎస్ ఆదేశించారు. స్టడీ సర్కిళ్ళ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా శిక్షణా ఇవ్వాలన్నారు. హాస్టళ్లల్లో నాణ్యమైన భోజనం అందించడానికి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం వల్ల రోజు వారి డిమాండ్ 9460 మెగావాట్లకు చేరుకుందని, గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం డిమాండ్ పెరిగిందని సిఎస్‌కు అధికారులు వివరించారు. ఈ వేసవిలో ఇది 11 వేల మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్టు వారు వివరించారు. మున్సిపల్‌శాఖపై సమీక్షిస్తూ మెట్రో వాటర్ వర్క్సులో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సిఎస్ జోషి సూచించారు.

ఎన్ని ఉద్యోగాలిచ్చారు?

- కేంద్ర బడ్జెట్ వల్ల ద్రవ్య లోటుకు ఊతం
- మోదీ సర్కార్‌పై చిదంబరం విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ ప్రతిపాదనలు ద్రవ్య లోటును మరింత పెంచేవే అవుతాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం విమర్శలు గుప్పించారు. గత నాలుగేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే సృష్టించిన ఉపాధి అవకాశాలు ఏ మేరకు ఉన్నాయని, ఎన్ని ఉద్యోగాలను మోదీ ప్రభుత్వం యువతకు అందించిందని ఆయన ప్రశ్నించారు. 16.7 శాతం పన్నుల వృద్ధిని సాధిస్తామని ప్రభుత్వం చెబుతోందని, కాని అదేమీ వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టడం లేదన్నారు. 2018-19 వార్షిక బడ్జెట్ విత్తలోటు పరిస్థితిని మరింత విషమింపజేసేదిగానే ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యానికి మించిన స్థాయిలోనే ప్రతి ఏడాది ద్రవ్యలోటు పెరిగిపోతోందని, వీటివల్ల ద్రవ్యోల్బణ తీవ్రత మరింత శృతిమించి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడానికి దారితీసే అవకాశం ఉంటుందని తెలిపారు.


గురువారం పార్లమెంటు సమావేశాలకు వస్తున్న కాంగ్రెస్ ఎంపీ చిదంబరం

అక్షయ గోల్డ్ ఆస్తుల వివరాలివ్వండి

ఆంధ్రా సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: అక్షయగోల్డ్‌కు సంబంధించిన 300 ఆస్తుల మార్కెట్ విలువను, ప్రభుత్వం నిర్ణయించిన విలువను సీల్డ్ కవర్‌లో పెట్టి ఇవ్వాలని హైకోర్టు ఆంధ్రప్రదేశ్ సిఐడి విభాగాన్ని ఆదేశించింది. అక్షయ గోల్డ్ ప్రజలను మోసం చేసిందని, ఈ వ్యవహారంపై సిబిఐ చేత విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ వి రామసుబ్రహ్మణియన్, జస్టిస్ ఎస్‌వి భట్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

సీనియర్ న్యాయవాది ఎస్‌ఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ఒక కంపెనీ అక్షయ గోల్డ్‌ను టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ విషయమై ఒక ఇంప్లైడ్ పిటిషన్‌ను కోర్టులో దాఖలై ఉందన్నారు. ఈ కంపెనీకి ఉన్న ఆస్తులు, అప్పుల జాబితాను ఆసక్తి ఉన్న ఒక కంపెనీ తయారు చేసిందన్నారు. అగ్రిగోల్డ్ విషయంలో ఈ కంపెనీని టేకోవర్ చేసే కంపెనీ తన గుర్తింపును చెప్పిందని, కాని అక్షయగోల్డ్ విషయంలో ఆసక్తి ఉన్న కంపెనీ తన గుర్తింపును ఎందుకు వెల్లడించడంలేదని హైకోర్టు అడిగింది. టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చిన కంపెనీ తన వివరాలు చెప్పకుండా సొమ్మును డిపాజిట్ చేసేందుకు కోర్టు అంగీకరించదని హైకోర్టు స్పష్టం చేసింది. డిపాజిటర్లకు వారి డిపాజిట్లను చెల్లించే విధానాన్ని పర్యవేక్షిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషనర్లు కూడా అక్షయగోల్డ్ కంపెనీ ఆస్తుల మార్కెట్, ప్రభుత్వ విలువలను అంచనా వేసి తమకు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను మార్చి 5వ తేదీకి వాయిదా వేశారు.

‘డిఫెన్స్ కారిడార్’ హైదరాబాద్‌లో పెట్టాలి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ మంత్రి నిర్మాలా సీతారామన్‌కు ఐటీ మంత్రి కేటీ రామారావువిజ్ఞప్తి చేశారు. గురువారం నాడు తెలంగాణ పంచాయతిరాజ్, ఐటి శాఖ మంత్రి కేటీఆర్ కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నరేంద్రసింగ్ తోమర్, హర్షవర్ధన్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో సమావేశమయ్యారు.

మేథోసంపత్తి సూచికలో మెరుగుపడిన ఇండియా

భారత్‌కు 44వ ర్యాంకు ■ తొలి మూడు స్థానాల్లో అమెరికా, బ్రిటన్, స్వీడన్

వాషింగ్టన్, ఫిబ్రవరి 8: అంతర్జాతీయ మేధోసంపత్తి సూచిక (ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ-ఐపీ)లో భారత్ తన స్థానాన్ని గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపరుచుకుంది. ఈ విషయంలో తొలి యాబయి ర్యాంకులు సాధించిన దేశాల్లో భారత్‌కు 44వ స్థానం లభించింది. గత ఏడాది ఈ ర్యాంకులు పొందిన తొలి 45 దేశాల్లో భారత్ 43వ స్థానంలో నిలవగా ఇప్పుడు తన ర్యాంకును మరింత మెరుగుపరుచుకుంది. అయితే మరింత మెరుగైన ర్యాంకు సాధించడానికి భారత్ తన విధానాల్లో అదనపు, అర్థవంతమైన సంస్కరణలు అమలు చేయాలని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అభిప్రాయపడింది. అంతర్జాతీయ మేధో సంపత్తి సూచికలో ర్యాంకులు సాధించిన 50 దేశాల జాబితాతో కూడిన వార్షిక నివేదికను ఆ సంస్థకు చెందిన గ్లోబల్ ఇన్నొవేషన్ పోలసీ సెంటర్ (జీఐపీసీ) రూపొందించింది. ఇప్పుడు విడుదల చేసిన ఆ నివేదిక ఆరవది. ప్రపంచంలో 50 దేశాల ఆర్థిక వ్యవస్థల్లో నవకల్పనలు, సరికొత్త ఆవిష్కరణలు, సంస్కరణలు, మేధోసంపత్తి హక్కులు, చట్టాలు, సాంకేతిక అంశాలు, ఫలితాల ఆధారంగా ఈ ర్యాంకులు ప్రకటిస్తారు. మేధోసంపత్తిలో ర్యాంకును మెరుగుపరుచుకున్నప్పటికీ భారత్ ఆ జాబితాలో ఇంకా అట్టడుగునే ఉన్న విషయాన్ని గుర్తించాల్సి ఉంది. ‘మొత్తంమీద చూస్తే భారత్ 5వ నివేదికలో 25 శాతం స్కోరు సాధించగా ఇప్పుడు ఆరవ నివేదికలో గణనీయంగా స్కోరును 30 శాతానికి పెంచుకుంది’ అని ఆ నివేదికలో పేర్కొన్నారు. కంప్యూటర్ ఆధారిత నవకల్పనలు, సానుకూల సంస్కరణల వల్ల భారత్ ఈ ఫలితాలు సాధించింది. 37.98 పాయింట్లతో అమెరికా తొలిస్థానంలోను, 37.97 పాయింట్లతో రెండోస్థానంలోను, 37.03 పాయింట్లతో స్వీడన్ మూడో స్థానంలోను నిలిచాయి. కంప్యూటర్ ఆధారిత ఆవిష్కరణల పరీక్షా విధానాల మార్గదర్శకాలను మారుస్తూ భారత్ గత జూలైలో తీసుకున్న చర్యల వల్ల సాంకేతిక నవకల్పనలు సాధ్యమయ్యాయని, అందువల్ల తన ర్యాంకును మెరుగుపరుచుకోగలిగిందని ఆ నివేదిక స్పష్టం చేసింది. జాతీయ మేధోసంపత్తి హక్కుల విధానాల్లో మార్పులు చేస్తూ ఈ విషయంలో వర్క్‌షాప్‌లు, సాంకేతిక శిక్షణ, సెమినార్లు, చర్చాగోష్టుల వంటివి ప్రభుత్వం చేపట్టడం కూడా ఇందుకు దోహదపడింది. మేధోసంపత్తి ర్యాంకును మెరుగుపరుచుకోవడంలో భారత్ తొలిసారిగా కొన్ని ప్రతికూల పరిస్థితులను అధిగమించింది, అయినా ఇంకా సాధించాల్సినది చాలా ఉందని, చాలా దేశాలకన్నా వెనుకబడే ఉందని జీపీసీ ఉపాధ్యక్షుడు పాట్రిక్ కిల్‌బ్రిడే పేర్కొన్నారు.

మీవన్నీ డొల్ల ప్రకటనలే

అరుణ్ జైట్లీపై మండిపడ్డ సుజనా

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: డొల్ల ప్రకటనలతో ప్రజలను మోసం చేయలేరంటూ తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి సుజనా చౌదరి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో వాదనకు దిగారు. పార్లమెంటు ఆవరణలోని తెలుగదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్ద ఇరువురు మంత్రుల మధ్య ఈ వాగ్వివాదం చోటు చేసుకుంది. లోక్‌సభ గురువారం రాత్రి వాయిదా పడిన అనంతరం అరుణ్‌జైట్లీ బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయానికి వెళుతున్న సమయంలో పక్కనే ఉన్న తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం నుంచి సుజనా చౌదరి బయటకు వస్తున్నారు. ఇరువురు ఎదురుపడగానే జైట్లీ మాట్లాడుతూ ‘నేను విభజన హామీలపై లోక్‌సభలో రెండు ప్రకటనలు చేసినా మీరెందుకు సంతృప్తి చెందటం లేదు.ఎందుకు నిరసన వ్యక్తం చేస్తున్నారు?’అని ప్రశ్నించారు. దీనికి సుజనా చౌదరి బదులిస్తూ ‘మీరు డొల్ల ప్రకటనలతో ప్రజలను మోసం చేయలేరు’అంటూ మండిపడ్డారు. ఏవో ప్రకటనలు చేసేసి మోసం చేశారని సుజనాచౌదరి ఆరోపించటం పట్ల జైట్లీ కూడా ఆగ్రహం చెందారు. విమర్శలను ఎంత మాత్రం సహించని జైట్లీకి సుజనా చౌదరి ఆరోపణలు షాక్ ఇచ్చాయి. సుజనా తన వాదన కొనసాగిస్తూ రాజకీయ పార్టీలు ఉంటాయి, పోతాయి కానీ ప్రజలు ఎల్లకాలం ఉంటారు, వారికి ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చటం మన బాధ్యత అని స్పష్టం చేశారు. ‘పార్టీలకు విలువ ఇవ్వాలి తప్ప నంబర్లకు కాదు’అని సుజనా చురకేశారు. అలాగని చౌదరి గట్టిగా మాట్లాడటంతో అరుణ్‌జైట్లీ మరింత అసహనం, అవమానానికి గురయినట్టు కనిపించింది.

వీరు అంతర్జాతీయ ఉగ్రవాదులే

పాక్ ఉగ్రత్రయంపై అమెరికా నిర్ణయం ■ ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దంటూ ఆదేశాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 8: పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలపై డొనాల్డ్ ట్రంప్ సర్కార్ కొరడా ఝుళిపించింది. లష్కరే తోయిబా, తాలిబన్ మిలిటెంట్ సంస్థలకు చెందిన ముగ్గురు తీవ్రవాదులను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటిస్తూ గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రమాదకరమైన వ్యక్తులకు, సంస్థలకు ఏ విధంగానూ ఆశ్రయం ఇవ్వొద్దని పాకిస్తాన్‌కు తెగేసి చెప్పింది. అమెరికా ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ఫలితంగా రెహ్మాన్ జేబ్ ఫకీర్ మహ్మద్, హిజ్‌బ్‌ఉల్లా, దిలావర్ ఖాన్ అనే ఈ ముగ్గురు ఉగ్రవాదుల ఆస్తులు జప్తు అవుతాయి. వీరితోగాని, వీరి సారథ్యంలోని సంస్థలతో గాని అమెరికా ప్రజలు ఏ రకంగానూ అమెరికా ప్రజలు లావాదేవీలు జరపడానికి వీలుండదు. ఈ ముగ్గురు ఉగ్రవాదులకు లష్కరే తోయిబా, తాలిబన్లతో సంబంధాలు ఉన్నాయని అమెరికా విదేశాంగ విభాగం స్పష్టం చేసింది. దక్షిణాసియా ఉగ్రవాద నెట్‌వర్క్‌లను దెబ్బతీయాలన్న చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చేవారిని, అలాగే అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను నడిపే వారిని తాము వదిలిపెట్టేది లేదని అమెరికా సీనియర్ అధికారి సిగల్ మండేల్కర్ వెల్లడించారు. అల్‌ఖైదా, లష్కరే తోయిబా, తాలిబన్‌తోపాటు ఇతర ఉగ్రవాద గ్రూపులకు వివిధ రకాలుగా సహాయపడుతున్న వారందరినీ లక్ష్యంగా చేసుకుని తాము చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఉగ్రవాదులకు ఏ రకంగానూ నిధులు అందకుండా చూడడంతోపాటు దక్షిణాసియాలోని పాకిస్తాన్ సహా ఏ దేశం కూడా వీరికి ఆశ్రయాన్ని కల్పించకూడదని స్పష్టం చేశారు. రెహ్మాన్ జేబ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించడానికి కారణం లష్కరే తోయిబాకు ఆయన ఆర్థికంగానూ, సాంకేతికంగానూ సహాయపడడమేనని తెలిపింది. కొన్నేళ్లపాటు లష్కరే తరపున పనిచేసిన ఆయన నిధులను సేకరించడంతోపాటు గల్ఫ్‌లో ఆ సంస్థకోసం ఓ నెట్‌వర్క్‌ను కూడా నడిపాడని అమెరికా అధికారి తెలిపారు.

తాజ్‌పై విజన్ డాక్యుమెంట్

ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రపంచ వింతల్లో ఒకటైన చారిత్రక కట్టడం తాజ్‌మహాల్ పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నదీ సమగ్ర నివేది ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. తాజ్ ట్రెపిజియం జోన్(టీజెడ్)పేరుతో ప్రభుత్వం తీసుకున్న హడావుడి నిర్ణయాలను జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. టీటీజెడ్ పరిధిని 10,400 కిలోమీటర్లు విస్తరించడంతోపాటు హడావుడిగా కార్యక్రమాలు చేపట్టడంపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆగ్రా, ఫిరోజాబాద్, మధుర, హత్రాస్, ఎటా, రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌ను టీటీజెడ్ పరిధిలోకి తెచ్చారు. టీటీజడ్ పరిధిలో చర్మ పరిశ్రమలు, హోటళ్లు ఎందుకు అంత హడావుడిగా ఏర్పాటు చేస్తున్నారని బెంచ్ నిలదీసింది. యూపీ ప్రభుత్వం తరపున కోర్టుకు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాపై బెంచ్ ప్రశ్నల వర్షం కురిపించింది. గతంలో అలాంటి కార్యకలాపాలు నిలిపివేసిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది.‘ఇప్పటికప్పుడు అంత హడావుడిగా కార్యక్రమాలు చేపట్టడానికి ఏమైనా ప్రత్యేక కారణం ఉందా?’అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. 17వ శతాబ్దాం నాటి ప్రముఖ కట్టడం తాజ్‌మహాల్ పరిరక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నదీ విజన్ డాక్యుమెంట్ అందజేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. నాలుగువారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని బెంచ్ స్పష్టం చేసింది.


ఇండో-ఈజిప్టు భాయి భాయి!

కైరో, ఫిబ్రవరి 8: భారత్‌కు ఈజిప్టు దౌత్యపరంగా, ఆర్థికపరంగా మంచి మిత్రదేశమేకాకుండా విస్వసనీయమైన భాగస్వామి అని ఆ దేశంలో భారత రాయబారి సంజయ్ భట్టాచార్య స్పష్టం చేశారు. రాజధాని ఢిల్లీలో మహ్మద్ జకీ ఎల్ సెవడే అధ్యక్షతన జరిగిన ఓ సదస్సులో భట్టాచార్య మాట్లాడుతూ భారత్‌కు ఈజిప్టు సహజ మిత్రదేశమని అన్నారు. పెట్టుబడుల రంగంలోనూ ఇరుదేశాలు పరస్పర సహకారంతోముందుకెళ్తున్నాయని ఆయన చెప్పారు. ఈజిప్టు ఆర్థికాభివృద్ధిలో భారత్ పాత్ర కీలకమైందని భట్టాచార్య అన్నారు. భారత్-ఈజిప్టు రానున్న రోజుల్లో ఉమ్మడిగా మరిన్ని కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తాయని ఆయన ప్రకటించారు. భారత్‌లో పెట్టుబడుల అవకాశాలు పెంపొందించుకునేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వాణిజ్యభూమి

వేతన జీవులకు, సీనియర్ సిటిజన్లకు
రూ.12వేల కోట్ల లబ్ధి

◆ వచ్చే ఏడాది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్
◆ లోక్‌సభలో మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: రానున్న ఆర్థిక సంవత్సరం కోసం ఇటీవల లోక్‌సభలో తాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులు, సీనియర్ సిటిజన్లకు రూ. 12వేల కోట్ల లబ్ధి చేకూర్చడం జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఈక్విటీలపై ఆర్జించే లాభాలపై పది శాతం లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) పన్ను విధించడాన్ని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. లోక్‌సభలో 2018-19 బడ్జెట్‌పై జరిగిన చర్చకు గురువారం జైట్లీ సమాధానమిస్తూ తమ ప్రభుత్వం చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల మధ్య కాలంలో, దీర్ఘ కాలంలో ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూరుతుందన్నారు. ఈ చర్యల ఫలితంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా అవతరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2014 మేలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటయ్యాక దేశంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా ప్రకారం, భారత్ కేవలం 0.1 శాతం తేడాతో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనే ట్యాగ్‌ను కోల్పోయిందని జైట్లీ తెలిపారు. అయితే భవిష్యత్తులో భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాకే, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో మెరుగుపడిందని పేర్కొంటూ ఆయన గత యుపీఏ ప్రభుత్వ పనితీరుపై విరుచుకుపడ్డారు.

చమురు ధరలు తగ్గాల్సిందే

సౌదీ, అమెరికాలను కోరుతాం ◆ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రపంచంలోనే అతి పెద్ద చమురు ఉత్పత్తి దేశాలయిన సౌదీ అరేబియా, అమెరికాలను చమురు ధరలు తగ్గించాల్సిందిగా భారత్ ఈ నెలలో కోరనుంది. ఇంధన వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు చమురు ధరలు తగ్గించాల్సిందిగా భారత్ ఈ రెండు దేశాలను కోరనుందని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం తెలిపారు. సౌదీ చమురు శాఖ మంత్రి ఖలీద్ అ అల్ ఫలీహ్ ఈ నెల 23, 24 తేదీలలో భారత్‌లో పర్యటించనున్నారని, అమెరికా ఇంధన మంత్రి రిక్ పెర్రీ ఫిబ్రవరి 28- మార్చి ఒకటో తేదీ మధ్య భారత్‌లో పర్యటిస్తారని ప్రధాన్ వెల్లడించారు. చమురు ధరలు తగ్గవలసిన అవసరం ఉందని తాము అభిప్రాయపడుతున్నామని మంత్రి ప్రధాన్ గురువారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ అన్నారు. ప్రపంచంలో చమురు వినియోగంలో మూడో అతి పెద్ద దేశమయిన భారత్.. ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలయిన సౌదీ అరేబియా, అమెరికాల దృష్టికి ప్రస్తుతం అధిక స్థాయిల వద్ద ఉన్న చమురు ధరల అంశాన్ని తీసికెళ్తామని, ఈ ధరలను హేతుబద్ధమయిన స్థాయికి తగ్గించవలసిన అవసరాన్ని నొక్కి చెబుతామని ప్రధాన్ తెలిపారు. వినియోగదారులకు ఉపశమనం కలిగించేలా పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌లో పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని ఎందుకు తగ్గించలేదని అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయం చెప్పారు. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధర జనవరి చివరలో నాలుగేళ్ల గరిష్ఠ స్థాయి అయిన బారెల్‌కు 71 డాలర్లకు పెరిగి, అప్పటి నుంచి ఇప్పటి వరకు 8 శాతం తగ్గింది. గురువారం బారెల్‌కు 65.37 డాలర్ల వద్ద క్రయ విక్రయాలు జరిగాయి.

విశాఖ విమానాశ్రయంలో విదేశీ మారక సేవలు

❖ ప్రత్యేక హక్కులు పొందిన సెంట్రమ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 8: విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఫారెక్స్, యాత్రా సేవలు ఇపుడు మెరుగైన రేట్లతో అందుబాటులోకి వస్తున్నాయి. భారతదేశంలో ప్రముఖ ఫారెన్ ఎక్స్ఛేంజ్ కంపెనీ, సెంట్రల్ గ్రూప్‌లో భాగమైన సెంట్రమ్ డైరెక్ట్ సంస్థ విశాఖ విమానాశ్రయంలో విదేశీ మారక సేవలను అందించేందుకు హక్కులు పొందింది. విశాఖ విమానాశ్రయంలో ప్రారంభమైన ఫారెక్స్ కౌంటర్ ద్వారా నగరంలోకి వచ్చిపోయే ప్రయాణికులకు విదేశీ మారకాన్ని మెరుగైన రేట్లతో ఈ సంస్థ అందించనుంది. వీటితోపాటు ట్రావెలర్స్ చెక్స్, మల్టీ-కరెన్సీ ప్రీ పెయిడ్ కార్డులు, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ వంటి పలు రకాల సేవలు అందించనుంది. విశాఖకు అన్నింటికంటే ప్రధానంగా ఓడరేవు దగ్గరగా ఉన్నందున ఇది ఒక ప్రధాన వాణిజ్య కేంద్రంగా భాసిల్లుతోంది. ఇది భారతదేశంలోనే రెండవ అతిపెద్ద ఓడరేవుఅయినందున వాణిజ్య పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించగలుగుతోంది. అలాగే అంతర్జాతీయ విమానాలు కూడా నగరానికి నేరుగా కనెక్టివిటీని అందిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీలో తమకు మూడు బ్రాంచీలున్నాయని సెంట్రమ్ సంస్థ సీఈవో, ఎండీ టీసీ గురుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కార్యకలాపాలు గణనీయంగా విస్తరించే ప్రణాళికలున్నాయని, సెంట్రమ్ డైరెక్ట్ కరెన్సీ నోట్లు, మల్టీ కరెన్సీ ట్రావెల్ కార్డ్స్, రెమిటెన్స్ సర్వీసెస్, ట్రావెలర్స్ చెక్స్, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ వంటి విస్తృత శ్రేణికి చెందిన వివిధ సేవలను అందిస్తుందన్నారు. విదేశీ మారక కొనుగోలు, అమ్మకాలను ఆన్‌లైన్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంట్రమ్‌ఫారెక్స్.కామ్ ద్వారా నిర్వహిస్తుంది. విశాఖ విమానాశ్రయం గత ఏడాదితో పోల్చినట్లయితే 30 శాతం వృద్ధిని సాధించి, 2016-17 ఆర్థిక సంవత్సరానికిగాను 23 లక్షల మంది ప్రయాణికులకు తమ సేవలు అందించింది.కాగా విమానాశ్రయంలో ఫారెక్స్ కౌంటర్‌ను విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ జి.ప్రకాష్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

తాడేపల్లిగూడెం ఆశ్రమంపై దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వండి

❖ పశ్చిమ గోదావరి ఎస్పీని ఆదేశించిన హైకోర్టు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 8: తాడేపల్లిగూడెంలోని ఒక ఆశ్రమంలో 22 మంది మహిళలను అక్రమంగా నిర్బంధించారనే అభియోగంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీని ఆదేశించింది. ఈ ఆశ్రమాన్ని చండీగఢ్‌కు చెందిన బాబా వీరేంద్ర దేవ్ దీక్షిత్ ఆధ్యాత్మిక తరగతుల పేరిట నడుపుతున్నాడని, ఇక్కడ అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ జి శ్రీను మరో కొంతమంది దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది.

తాము ఫిర్యాదు చేసినా ఇంతవరకు తాడేపల్లిగూడెం ఎస్పై లేదా కలెక్టర్, ఎస్పీ ఇంతవరకు స్పందించలేదని పిటిషనర్లుకోర్టుకు తెలిపారు.

స్టాక్ మార్కెట్‌కు
ఉపశమనం

ఏడు రోజుల నష్టాలకు తెర ◆ బలపడిన కీలక సూచీలు
330 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ ◆ వంద పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ

ముంబయి, ఫిబ్రవరి 8: కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు, ఆసియన్ మార్కెట్లలో పరిస్థితి సానుకూలంగా ఉండటంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. వరుసగా ఏడు రోజుల పాటు చవిచూసిన నష్టాలకు తెర దించి, గురువారం లాభాల్లో ముగిశాయి. కీలక మార్కెట్ సూచీలు పైకి ఎగబాకాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ 330 పాయింట్లు (0.97 శాతం) పుంజుకొని, 34,413.16 పాయింట్ల వద్ద ముగిసింది. గత రెండు వారాలలో సెన్సెక్స్ ఒకే సెషన్‌లో ఇంత ఎక్కువగా పెరగడం ఇదే మొదటిసారి. దేశీయ, ప్రపంచ పరిణామాలు ప్రతికూలంగా ఉండటంతో ఈ సూచీ గత ఏడు సెషన్లలో కలిపి 2,200.54 పాయింట్లు పడిపోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ గురువారం వంద పాయింట్లు (0.96 శాతం) పుంజుకొని, 10,576.85 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇటీవల ధరలు బాగా పడిపోయిన బ్యాంకింగ్ షేర్లను మదుపరులు ఎక్కువగా కొనుగోలు చేశారు. దీంతో ఈ షేర్ల ధరలు పెరిగాయి. ఫార్మా, ఐటీ రంగాల షేర్ల ధరలు కూడా పుంజుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ అంచనా వృద్ధి రేటు పెరగడంతో పాటు ముడి చమురు ధరలు తగ్గడం కూడా మదుపరుల సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఆరు వారాల కనిష్ట స్థాయి, బారెల్‌కు 65.16 డాలర్లకు పడిపోయింది. తనకు అవసరం ఉన్న చమురులో అధిక భాగం దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు ముడి చమురు ధర తగ్గడం సానుకూలాంశం. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు స్థిరీకరణ పొందడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.2 శాతం నమోదవుతుందని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బుధవారం తన ద్రవ్య విధాన సమీక్షలో అంచనా వేయడం దేశీయ స్టాక్ మార్కెట్‌కు ఊతమిచ్చింది. సెన్సెక్స్ గురువారం 34,208.11 పాయింట్ల అధిక స్థాయి వద్ద ప్రారంభమయి, గరిష్ఠ స్థాయి 34,634.35 పాయింట్లు, కనిష్ఠ స్థాయి 34,108.76 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు 34,413.16 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా గురువారం కీలకమైన 10,550 స్థాయిపైన 10,576.85 పాయింట్ల వద్ద ముగిసింది. క్రితం ముగింపుతో పోలిస్తే ఈ సూచీ 100.15 పాయింట్లు పుంజుకుంది. ఈ సూచీ అంతకు ముందు ఇంట్రా-డేలో గరిష్ఠ స్థాయి 10,637.80, కనిష్ఠ స్థాయి 10,479.55 పాయింట్ల మధ్య కదలాడింది. ఇదిలా ఉండగా, బుధవారం దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) నికరంగా రూ. 461.19 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేయగా, ఫారిన్ ఫండ్స్ రూ. 1,022.50 కోట్ల విలువయిన షేర్లను విక్రయించాయి. గురువారం నాటి లావాదేవీల్లో సెన్సెక్స్ ప్యాక్‌లోని సంస్థల్లో సన్ ఫార్మా అత్యధికంగా 6.32 శాతం లాభపడింది. డాక్టర్ రెడ్డీస్ 3.18 శాతం లాభపడింది. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హిందుస్తాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్, మారుతి సుజుకి, ఎల్అండ్‌టీ, రిలయన్స్, ఎంఅండ్ఎం, కోల్ ఇండియా, బజాజ్ ఆటో, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, హీరో మోటోకార్ప్, ఆసియన్ పెయింట్స్, విప్రో 2.97 శాతం వరకు లాభపడ్డాయి. మూడో త్రైమాసికంలో నికర లాభం ఏడు శాతం పెరిగిన ఔషధ దిగ్గజం సిప్లా షేర్ ధర 7.83 శాతం పెరిగింది. గురువారం నాటి లావాదేవీల్లో నష్టపోయిన సంస్థల్లో పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఓఎన్‌జీసీ, అదాని పోర్ట్స్, ఐటీసీ లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి.

సాంప్రదాయేతర ఇంధన వనరుల సమర్థ వినియోగంపై దృష్టి

❖ అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్తల పిలుపు
❖ రాజమహేంద్రవరంలో మూడు రోజుల సదస్సు ప్రారంభం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 8: ప్రస్తుతం వినియోగంలో వున్న సాంప్రదాయ ఇంధన వనరులను కాపాడుకుంటూనే ప్రత్యామ్నాయంగా సాంప్రదాయేతర ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై ప్రపంచ దేశాలు దృష్టిసారించాలని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. నీరు, బొగ్గు, గ్యాస్, పెట్రో ఉత్పత్తుల వినియోగం పెరగడంవల్ల అంతరించిపోయే ప్రమాదంతోపాటు భూతాపం పెరిగిపోతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యామ్నా ఇంధన వనరులపై పరిశోధనలు సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వేదికగా మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. అమెరికాలోని కాన్ సెంటర్ పునరుత్పాదక శక్తి కేంద్రం లూయిస్ విల్లీ విశ్వవిద్యాలయంతో చేసుకున్న ఒప్పందం మేరకు ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు కాన్ సెంటర్ శాస్త్రవేత్తలు జోస్‌స్పర్జియన్, సీనల్‌స్కీ హాజరయ్యారు.

భావితరాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా భావిస్తున్న పునరుత్పాదక శక్తి వనరులపై జరుగుతున్న పరిశోధనా ఫలితాలను విద్యార్థులు, ఇతర శాస్త్రవేత్తలతో పంచుకోవడానికి ఈ సదస్సును ఏర్పాటుచేశారు. దీనికి తోడు సౌర విద్యుత్‌ను నిల్వ చేసే విధానంపై కూడా పరిశోధనలు సాగుతున్నట్టు తెలిపారు. ఈ పరిశోధనా ఫలితాలపై ప్రపంచ దేశాలు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సులో కీలకమైన పరిశోధనా ఫలితాలపై చర్చించి విద్యార్థులతో శాస్త్రవేత్తలు పంచుకుంటారని సదస్సు కన్వీనర్ డాక్టర్ కె రామచంద్రరావు, ఆర్ట్సు కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్‌కుమార్ తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాలనాయుడు, ఉన్నత విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ గీతాంజలి, కాలేజి విద్య ఆర్జేడీ కె ప్రవీణ్, కాలేజి ఎడ్యుకేషన్ ప్రత్యేక అధికారి రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

1వ పేజీ తరువాయి

త్వరలో ప్యాకేజీ

ప్రకటించారని, అందులో భాగంగా ఇచ్చిన పలు హామీలు అమలయ్యాయని, కొన్ని అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర విభజన వలన పలు సంస్థలు తెలంగాణాలోనే ఉండిపోయాయని, అందుకే ఏపీలో కూడా పలు సంస్థలను ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయని జైట్లీ చెప్పారు. రాష్ట్రంలో పలు సంస్థలు ఏర్పాటుకు నిధులు విడుదల చేశామని, ఇక మీదట కూడా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి, రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించామని ఆయన తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాబార్డ్ ద్వారా నాలుగు వేల ఐదు వందల కోట్ల రూపాయలు ఇదివరకే చెల్లించినట్లు జైట్లీ ప్రకటించారు. పోలవరానికి ఇక మీదట కూడా నిధులు కేటాయింపు కొనసాగుతుందని అన్నారు. ప్రస్తుతం తాము రెండు అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక హోదాకు బదులు చెల్లించవలసిన మొత్తం ఎంత అనే దానిపై చర్చలు జరుగుతున్నాయని, రాష్ట్ర ఆర్థికశాఖకు చెందిన అధికారులతో నిన్న చర్చలు జరిగాయని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చర్చల గురించి తెలియజేసేందుకు వారు వెళ్లారని జైట్లీ వివరించారు. రాష్ట్ర అధికారులు మరిన్ని నిధులు ఇవ్వాలంటున్నారని, హోదాకు బదులు ఇవ్వవలసిన నిధులను విదేశీ సహాయ పథకాల ద్వారా ఇవ్వాలని మొదట నిర్ణయించారని, అయితే విదేశీ సహాయ రుణాలు రావటం ఆలస్యమవుతున్నందున ఈ నిధులను నాబార్డ్ ద్వారా ఇప్పించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారని, ఈ దిశగా చర్చలు కొనసాగుతున్నాయని జైట్లీ తెలిపారు. దీనికి సంబంధించిన కేంద్ర ఆర్థిక శాఖ ఎక్స్‌పెండిచర్ కార్యదర్శి చేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే వీటిని అమలు చేస్తామని జైట్లీ చెప్పారు. రెవెన్యూ లోటు విషయంలోకూడా రాష్ట్రం నుండి కొన్ని ప్రతిపాదనలు వచ్చాయని, వీటిపై నిన్న చర్చ జరిగిందని అన్నారు. రెవెన్యూ లోటుపై కేంద్రం చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయని జైట్లీ వివరించారు. రెవెన్యూ లోటు భర్తీకి సంబంధించి రాష్ట్ర అధికారులు ఎక్కువ నిధులు కోరుతున్నారని, ఈ అంశంపై కేంద్ర అధికారులు, రాష్ట్ర అధికారుల లెక్కలలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రైల్వే తదితర ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ఏపీ సమస్యల పట్ల తమకు పూర్తి సానుభూతి ఉన్నదని, ప్రతి సమస్యను పరిశీలిస్తున్నామని, వీటి పరిష్కారానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అయోధ్య.. భూవివాదమే

ప్రత్యేక బెంచ్ విచారణ చేపట్టింది. కాగా గురువారం నాడు ఇరుపక్షాల వాదనలను ఆలకించింది. అలాగే 'టైటిల్ సూట్'లో అసలు వాదప్రతివాదులు హైకోర్టులో సమర్పించిన దస్త్రాలు, పుస్తకాలు, ఎగ్జిబిట్‌లలో స్థానిక భాషలలో ఉన్న అంశాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి పదిహేనురోజుల్లో అత్యున్నత న్యాయస్థానానికి నివేదించాలని జస్టిస్ దీపక్ మిశ్రా ఇరుపక్షాలను ఆదేశించారు.

అలహాబాద్ హైకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా 524 ఆధారాలను సమర్పించారు. వీటిలో 504 ఆధారపత్రాలు, రామాయణం, రామచరితమానస్, శ్రీమద్‌భగవద్గీత వంటి 20 పుస్తకాలు, భారతీయ పురావస్తు శాఖ నివేదిక ఉన్నాయి. కాగా ఈ కేసులో సినీప్రముఖులు శ్యాంబెనగల్, రచయిత కిరణ్ నగార్కర్, సీనియర్ డ్వకేట్ చిరాగ్ ఉదయ్ సింగ్ సహా మరికొందరు ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యేందుకు సిద్ధపడగా కోర్టు వారిని ఈ కేసులో చేర్చడానికి ఇప్పుడు సాధ్యం కాదని చెప్పింది.

మీకే కాదు.. నాకూ బాసే

అన్నది పార్టీకి పూర్వవైభవం తేవడానికి అత్యంత కీలకమని అన్నారు. తాను పార్టీ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు ఏ విధమైన సహాయ సహకారాలు అందించారో అదే స్ఫూర్తిని కనబర్చి రాహుల్ నాయకత్వంలోనూ పనిచేయాలని సోనియా పిలుపునిచ్చారు. ఎలాంటి విభేదాలకు తావు లేకుండా రాహుల్ నాయకత్వంలో పార్టీ కచ్చితంగా విజయాలను సాధించగలదన్న నమ్మకం తనకుందని సోనియా అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పునరుజ్జీవన ప్రక్రియ మొదలైందని పేర్కొన్న సోనియా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వాస్తవాలు పట్టవని ధ్వజమెత్తారు. లోక్‌సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా, అలాగే దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక భావనల పునరుద్ధరణే ధ్యేయంగా అన్ని పార్టీలూ కలిసి పనిచేయాలన్నారు. మోదీ హయాంలో మైనారిటీలకు భద్రత లేదని, దళితులపై తీవ్రస్థాయిలో దాడులు పెచ్చరిల్లుతున్నాయని ఆరోపించారు.

అయితే ఈ దాడులు ఒక పథకం ప్రకారం సమాజాన్ని చీల్చాలన్న ఉద్దేశంతో జరుగుతున్నాయని చెప్పడానికి ఎన్నో దృష్టాంతాలు ఉన్నాయని తెలిపారు. ఈ రకమైన పరిస్థితే గతంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లలో తలెత్తిందని రానున్న ఎన్నికల సమయంలో కూడా కర్నాటకలోనూ ఇలాంటి పరిస్థితులే పునరావృతం అయ్యే అవకాశం ఉందని సోనియా తెలిపారు. సంకుచిత ప్రయోజనాలకోసం సమాజాన్ని చీల్చడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో నేరపూరిత చర్య అని పేర్కొన్న సోనియా, ఇంత జరుగుతున్నా కేంద్రంలోని అధికార పార్టీ నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరించడం విడ్డూరమన్నారు.

ఎన్‌డీఏలో బీజేపీకి సెగ

సుష్మాస్వరాజ్ చిన్నమ్మను అంటూ ప్రచారం చేసి తాజా బడ్జెట్‌లో తెలంగాణకు తగిన నిధులు ఇవ్వకపోవడాన్ని టీఆర్ఎస్ లోక్‌సభలో ప్రస్తావించిందని వెల్లడించారు. దీంతో ఇప్పుడు సొంత బలం ఉన్నా భవిష్యత్తులో మిత్రుల అవసరం ఏర్పడితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు బీజేపీని ఇరుకునపెడతాయని ఆ పార్టీ వ్యూహకర్తలు పార్టీ అధినేత అమిత్ షా, ప్రధాని నరేంద్రమోదీకి వివరించడంతో పార్టీ సీనియర్ నాయకులు, కేంద్రంలో కీలకమంత్రులైన రాజ్‌నాథ్, అరుణ్‌జైట్లీలతో చర్చించి వీలైనంత త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలకు ముగింపు పలకాలని సూచించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత వారు టీడీపీ సభ్యులతో కూడా చర్చించి తొందరలోనే అన్ని సర్దుకుంటాయని సర్దిచెప్పినా ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, హోదాకు బదులు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీకి ఈ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించేంత వరకు తమ ఆందోళన ఆగబోదని తేల్చి చెప్పడంతో బీజేపీ పెద్దలు ఈ అంశానికి అధిక ప్రాధాన్యతనిచ్చి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోందని విశ్లేషకులు తెలిపారు. మొత్తం మీద బలం లేని కారణంగా టీడీపీని తక్కువ అంచనా వేసి బీజేపీ ఇరుకున పడిందన్న అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

విభజన హామీల అమలులో విఫలం

చర్చించారు. అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పవన్ ఆరోపించారు. అలాగే పలు అంశాలపై అధికార టీడీపీ నేతలు కూడా భిన్నరకాలుగా స్పందిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా ఆయన పరోక్షంగాతప్పుపట్టారు. ఏపీ హక్కుల సాధన కోసం జేఏసీని ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం తానే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు. ఇందులో భాగంగానే తొలుత లోక్‌సత్తా అధినేత జెపితో సమావేశమైనట్టు ఆయన పేర్కొన్నారు. కాగా 11వ తేదీన కాంగ్రెస్ సీనియర్ నేత ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో పవన్ కళ్యాణ్ భేటీ కానున్నట్టు తెలిసింది.

స్టార్‌గా వెలుగొందుతూ ఎంతో హాయిగా ఉన్న పవన్‌కళ్యాణ్ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎంతో సమస్యాత్మకమైన రాజకీయ రంగంలోకి వచ్చారని జెపి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని జెపి అన్నారు. కేంద్రం సకాలంలో స్పందించి తగిన న్యాయం చేయకపోతే ప్రజలు ఏకీకరణ జరుగుతుందని, రాజకీయపక్షాలు ఒకే వేదికపైకి వచ్చి పోరాటం చేయాల్సి వస్తుందని అన్నారు. హామీలను ఇచ్చి , వాటిపై వెనక్కు పోవడం ఏ విధంగానూ సమంజసం కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను సైతం కేంద్రం నెరవేర్చాలని జెపి పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే హామీలను నెరవేర్చాల్సిందేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భుండేల్‌ఖండ్‌కు నాలుగు వేల కోట్ల రూపాయిలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజలను రాజకీయ బాధితులను చేయవద్దని జెపి అన్నారు.

రాష్ట్రానికి ఎమిరేట్స్ గ్రూపు, దుబాయ్ ఎయిరో స్పేస్

❖ బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం
❖ దుబాయ్‌కి సీట్ల సంఖ్య పెంచాలన్న మక్దూమ్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి




ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న ఎమిరేట్స్ గ్రూపు

అమరావతి, ఫిబ్రవరి 8: విమానయాన రంగంలో నవ్యాంధ్రప్రదేశ్ ఉజ్వలంగా వెలిగిపోనుంది. దుబాయ్‌కు చెందిన ఎమిరేట్స్, దుబాయ్ ఎయిరోస్పేస్ సంస్థలు రాష్ట్రంలో అడుగుపెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఎమిరేట్స్ గ్రూపు ముందుకొచ్చింది. ఏవియేషన్ శిక్షణ కోసం ఒక అకాడమీని సైతం నెలకొల్పనుంది. దీంతోపాటు మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్ఆర్) సదుపాయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ ఈడీబీతో ఎమిరేట్స్ గ్రూపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం ఎమిరేట్స్ గ్రూపు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి (ఏపీ ఈడీబీ) కలిసి వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేస్తాయి. ఏరోస్పేస్ సంబంధిత మౌలిక సదపాయాలు, తయారీ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటిల్లో 'ఎమిరేట్స్' పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ వర్కింగ్ గ్రూపులు పరిశీలిస్తాయి. అలాగే ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఏపీలో నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యం పెంపులోనూ ఎమిరేట్స్, ఏపీఈడీబీ సంయుక్తంగా కలిసి పని చేస్తాయి. ఈ ఒప్పందం వాస్తవరూపం దాల్చితే, రాష్ట్రానికి కొత్తగా రూ. 30వేల కోట్ల మేర పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం లభిస్తుంది. విమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్ ప్రారంభించాలని గురువారం దుబాయ్‌లోని ఎమిరేట్స్ హెడ్‌క్వార్టర్స్‌లో తనతో సమావేశమైన ఎమిరేట్స్, దుబాయ్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ చైర్మన్ షేక్ అహ్మద్ బీన్ సయీద్ అల్ మక్దూమ్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఏపీ, అమరావతికి తమ విమాన సర్వీసులను ఆరంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని, కానీ భారత ప్రభుత్వ నియమ నిబంధనలు ఇందుకు అడ్డంకిగా ఉన్నాయని మక్దూమ్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. భారత్ నుంచి దుబాయ్ రావడానికి ఇప్పుడు కేటాయిస్తున్న సీట్ల సంఖ్య పరిమితంగా ఉందని, పాత ఒప్పందాన్ని భారత ప్రభుత్వం సవరించాలని చెప్పారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎమిరేట్స్ సంస్థలు రెండూ దీనిపై చర్చించి ఒక నిర్ణయానికి రావాల్సి ఉందన్నారు. విమానాలు ప్రయాణికులను చేరవేస్తాయి.. దాంతోపాటు ఆయా గమ్యస్థానాల్లో ఆ ప్రయాణికులు ఆర్థిక కార్యకలాపాలు సాగించేందుకు దోహదం చేసే ఏర్పాట్లు కూడా అవసరమే.. ముఖ్యంగా అక్కడికి వెళ్లిన వారు సేద తీరేందుకు తగిన వసతి, షాపింగ్ చేసేందుకు మాల్స్, సమావేశాలు జరిపేందుకు వీలుగా విశాలమైన మందిరాలు ఉండాలి.. పర్యాటకాభివృద్ధి అనేది ఎక్కడైనా కీలకం.. అదే ముఖ్యమని మక్దూమ్ తన అభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి వెల్లడించారు. ఎయిర్‌లైన్ విజయవంతం కావడానికి ఒక మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించడం తప్పనిసరమని తెలిపారు. దుబాయ్‌లోని హోటళ్లలో లక్షకు పైగా గదులు అందుబాటులో వున్నాయని, జోర్డాన్ వంటి దేశంలో 14వేలకుపైగా హోటల్ గదులు ఉన్నాయని తెలిపిన మక్దూమ్, 2020 నాటికి దుబాయ్‌లో 1.50 లక్షల హోటల్ గదులు ఉంటాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో మక్దూమ్‌తోపాటు యుఏఈలో భారత రాయబారి నవ్‌దీప్ సూరి కూడా ఉన్నారు.

ఎయిరో సిటీ ఏర్పాటుకు దుబాయ్ ఎయిరో స్పేస్ ఆసక్తి

దుబాయ్ ఎయిర్‌పోర్టు ఫ్రీ జోన్ అథారిటీ డైరెక్టర్ జనరల్, దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ అథారిటీ వైస్ చైర్మన్, దుబాయ్ ఎయిరో స్పేస్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అహ్మద్ ఆల్ ఝురానీతో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి ఎయిరో సిటీ ఏర్పాటు సన్నాహాల్లో ఉన్నామని, ఇందుకోసం సౌదీ అరేబియా ఫైనాన్షియర్స్‌తో కలిసి పనిచేస్తున్నామని ముఖ్యమంత్రికి ఝురానీ వెల్లడించారు. కేపీఎంజీ సహకారంతో మరో మూడు నెలల్లో దీనిపై సవివర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. 'ఎయిర్ బస్'తో ఒప్పందం కుదుర్చుకున్నామని, నాసాతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. విశాఖలో జరిగే సిఐఐ- భాగస్వామ్య సదస్సుకు హాజరవుతానని ఝురానీ మాటివ్వగా, నాటికల్లా స్పష్టమైన ప్రతిపాదనలతో రావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభూమి



వింటర్ ఒలింపిక్స్ మస్కట్ సూహోరాంగ్

సర్వం సిద్ధం

నేటి నుంచి 25 వరకు వింటర్ ఒలింపిక్స్

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 8: వింటర్ ఒలింపిక్స్‌కు దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్ అన్ని విధాలా సిద్ధమైంది. విపరీతమైన చలి వల్ల సమస్యలు తలెత్తుతాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ మెగా ఈవెంట్ విజయవంతమవుతుందని నిర్వహణ కమిటీ (ఓసీ) అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి మొదలయ్యే వింటర్ ఒలింపిక్స్ ఈనెల 25న ముగుస్తాయి. డోపింగ్ కేసుల్లో రష్యా విలవిల్లాడడం, చిరకాల శత్రు దేశం ఉత్తర కొరియా అథ్లెట్లను పంపడం వంటి అంశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పయాంగ్‌చాంగ్ ఒలింపిక్ స్టేడియంలో ప్రారంభ, ముగింపు ఉత్సవాలతోపాటు పలు పోటీలు జరుగుతాయి. మొత్తం 92 దేశాల నుంచి 2,952 మంది అథ్లెట్లు వింటర్ ఒలింపిక్స్‌లో పోటీపడతారు. 7 క్రీడలకు సంబంధించి (15 విభాగాలు) 102 ఈవెంట్స్‌లో అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. డోపింగ్ రహిత క్రీడలను నిర్వహించాలని అటు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), ఇటు ప్రపంచ డోపింగ్ నిరోధక విభాగం (వాడా) నిర్విరామంగా కృషి చేస్తుండగా, పలు దేశాలకు చెందిన, ప్రధానంగా రష్యా అథ్లెట్లు ఎంతో మంది డోప్ పరీక్షల్లో దోషులుగా తేలడం అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నది. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఈ క్రీడల్లో ఉత్తర కొరియా భాగస్వామి కావడం ఆనందాన్ని కలిగించే అంశమైనా, డోప్ ఫలితాలు ఆ ఆనందాన్ని ఆవిరి చేస్తున్నాయి. ఈ వింటర్ ఒలింపిక్స్‌లో ఇంకెన్ని కేసులు బయటపడతాయో, ఎంత మంది డోప్ దోషులుగా తేలుతారో చూడాలి. ప్రస్తుతానికి మాత్రం ప్రపంచమంతా శుక్రవారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం పయాంగ్‌చాంగ్‌వైపు ఆసక్తిగా చూస్తున్నది. 2014 సోచీ వింటర్ ఒలింపిక్స్ కంటే పయాంగ్‌చాంగ్ పోటీలు చాలా రకాలుగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నది వాస్తవం. శాంతి, పరస్పర సహకారం నినాదాలను దక్షిణ కొరియా వింటర్ ఒలింపిక్స్ ట్యాగ్స్‌గా ఎంపిక చేసింది. అయితే, ఉత్తర కొరియాతో ఉన్న విభేదాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ఈ క్రీడలతోనైనా మారుతుందనేది అనుమానమే. ఐఓసీ మాత్రం పయాంగ్‌చాంగ్ ఒలింపిక్స్ విజయవంతమై, అసలు సిసలైన క్రీడాస్ఫూర్తిని చాటుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నది. ఏదిఏమైనా మంచు మైదానాల్లో, గడ్డకట్టే చలిలో మెరుపు వేగమే ప్రధానంగా జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో ప్రతి ఈవెంట్ ప్రేక్షకులను ఉర్రూతలూగించడం ఖాయం.

ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు జరిగే పయాంగ్‌చాంగ్ జాతీయ స్టేడియానికి పైకప్పు లేదు. స్థానిక కాలమానం ప్రకారం ప్రారంభోత్సవ ఉత్సవాలు రాత్రి 8 గంటలకు మొదలవుతాయి. ఎముకలు కొరికే చలిలో, విపరీతమైన చలిగాలులను తట్టుకుంటూ వివిధ జట్ల కవాతును, సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించడం ప్రేక్షకులకు ఒక సవాలే. కెనడా నుంచి వచ్చే అథ్లెట్లు కూడా చలికి వణుకుతున్నారంటే, పయాంగ్‌చాంగ్‌లో వాతావరణం ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు.



పట్టువీడిన ఉత్తర కొరియా!

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 8: దక్షిణ కొరియాతో తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, వింటర్ ఒలింపిక్స్ కోసం ఉత్తర కొరియా పట్టు వీడింది. అథ్లెట్లు మాత్రమేగాక, ఛీర్ లీడర్లను, కళాకారులను కూడా పయాంగ్‌చాంగ్‌కు పంపింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మొండి పట్టుకు, వివాదాస్పద ఏకపక్ష నిర్ణయాలకు పెట్టింది పేరు. అలాంటి నియంత శత్రు దేశమైన దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనాలని నిర్ణయించుకోవడం వెనుక చాలానే కసరత్తు జరిగింది. పరీక్షలు పరీక్షలు, క్షిపణులు ప్రయోగాలతో ప్రపంచ దేశాలను భయాందోళనకు గురి చేస్తున్న ఉత్తర కొరియాలో ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ పర్యటించాడు. రాజకీయాలతో క్రీడలకు సంబంధం లేదని, కాబట్టి వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనాలని కిమ్‌ను కోరాడు. ప్రపంచ శాంతి నినాదంతో ఈ పోటీలను నిర్వహిస్తున్న విషయాన్ని కూడా అతను కిమ్‌కు వివరించాడు. నిజానికి ఈ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. చిరకాల శత్రువులైన ఈ రెండు దేశాలు ఒకే వేదికను పంచుకోవడం చాలా అరుదు. అయితే, రాకీయాలతో క్రీడలకు సంబంధం లేదని ఇటీవల తరచు వినిపిస్తున్న వాదన. ఆ కోణంలో ఆలోచించినందువల్లే, ఉత్తర కొరియా అథ్లెట్లను దక్షిణ కొరియా సాదరంగా ఆహ్వానించింది. ఎన్నో అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఉత్తర కొరియాను బాచ్ ఒప్పించగలిగాడు. దాని ఫలితమే ఇప్పుడు వింటర్ ఒలింపిక్స్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.

రష్యా ఉక్కిరిబిక్కిరి

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 8: వ్యూహాత్మక డోపింగ్‌కు పాల్పడి, సస్పెన్షన్ వేటును ఎదుర్కొంటున్న రష్యా ఏం చేయాలో దిక్కుతోచక ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. డోప్ పరీక్షలో విఫలమై, వింటర్ ఒలింపిక్స్ నుంచి నిషేధానికి గురైన 28 మంది అథ్లెట్లకు క్రీడా వివాదాల మధ్యవర్తిత్వ కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చినా ఫలితం లేకపోయింది. డోప్ దోషులను వింటర్ ఒలింపిక్స్‌కు ఆహ్వానించేది లేదని ఒలింపిక్స్ స్థానిక నిర్వహణ కమిటీ (ఓసీ) స్పష్టం చేయడంతో రష్యాకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దీనిపై అప్పీల్ చేసి, అనుకూలంగా తీర్పు సంపాదించుకునేలోపే వింటర్ ఒలింపిక్స్ ముగుస్తాయన్నది వాస్తవం. డోప్ సుడిగుండంలో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరవుతున్న రష్యాకు ఐఓసీ ఇటీవల తీసుకున్న నిర్ణయం శరాఘాతమైన విషయం తెలిసిందే. వింటర్ ఒలింపిక్స్ నుంచి రష్యాను సస్పెండ్ చేస్తూ ఐఓసీ తీర్మానాన్ని ఆమోదించడంతో డోప్ ప్రకంపనలు అంతర్జాతీయ క్రీడా రంగాన్ని ఇప్పటికీ వెంటాడుతున్నాయనే విషయం స్పష్టమైంది. రియో సమ్మర్ ఒలింపిక్స్‌కు ముందు కూడా దాదాపు ఇలాంటి పరిస్థితే తలెత్తింది. అప్పట్లో ఐఓసీ పతాకం కింద రష్యా అథ్లెట్లు పోటీ చేశారు. తాజా పరిణామం కారణంగా, వింటర్ ఒలింపిక్స్‌లోనూ ఐఓసీ పతాకంపైనే రష్యా అథ్లెట్లు బరిలోకిదిగుతారు. దేశ క్రీడా రంగానికి కొత్త రూపాన్ని ఇవ్వడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ సర్కారు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రష్యాకు గత ఏడాది రియో ఒలింపిక్స్, తాజాగా పయాంగ్‌చాంగ్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం దక్కలేదు. వ్యూహాత్మక డోపింగ్‌కు పాల్పడిన కారణంగా సర్వత్రా విమర్శలను ఎదుర్కొంటున్న రష్యా దిద్దుబాటు చర్యలు ఎంత వరకూ చేపట్టిందనేదే ప్రశ్న. డోపింగ్‌తో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధాలు ఉన్నా, అందుకు సహకరించినా కఠిన చర్యలు తప్పవని సర్కారు ప్రకటిస్తుండగా, ఒకరి తర్వాత మరొకరిగా డోప్ దోషులు పుట్టుకు రావడం రష్యాను ఆందోళనకు గురి చేస్తున్నది. వింటర్ ఒలింపిక్స్‌లో ఎవరూ డోప్ పరీక్షల్లో దోషులుగా తేలకపోతే, రష్యా ఊపిరి పీల్చుకుంటుంది. అప్పటి వరకూ అందరి కళ్లూ ఆ దేశ అథ్లెట్లపైనే ఉంటాయన్నది వాస్తవం.



చలికి గజగజ

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 8: గతంలో ఎన్నడూ అథ్లెట్లు ఎదుర్కోనంత చలిలో పయాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్ జరగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం నుంచి మొదలుపెడితే, వివిధ పోటీలు, ఆతర్వాత ముగింపు ఉత్సవం వరకూ ప్రతి అంశానికీ అడుగడుగునా చలి తీవ్రత సమస్యలను సృష్టించడం ఖాయం. అక్కడ నమోదవుతున్న అత్యల్ప ఉష్ణోగ్రత ఉష్ణోగ్రత ప్రస్తుతం -25 డిగ్రీల సెల్సియస్. ఇది మరింత పెరిగి, -35 వరకూ చేరే అవకాశం లేకపోలేదు. మధ్యాహ్నం సమయాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందని వింటర్ ఒలింపిక్స్ నిర్వాహణ కమిటీ (ఓసీ) అధికారులు అంటున్నారు. అయితే, ఏ రకంగా చూసినా, అతి తక్కువ ఉష్ణోగ్రతల విషయంలో పయాంగ్‌చాంగ్ ముందు ఉంటుంది. నార్వేలోని లిలెహామర్‌లో జరిగిన 1994 వింటర్ ఒలింపిక్స్ సమయంలో -10 డిగ్రీల ఉష్ణోగత నమోదైంది. ఇప్పటి వరకూ ఈ పోటీల్లో అదే అత్యల్పం. కానీ, పయాంగ్‌చాంగ్ ఆ రికార్డును అధిగమించనుంది. సముద్ర మట్టానికి 2,460 అడుగుల ఎత్తులో ఉండే పయాంగ్‌చాంగ్ నగరం దక్షిణ కొరియాలోనే అతి చల్లని ప్రాంతం. చలితోపాటు చలిగాలులు కూడా వీస్తుంటాయి. ఈ కారణంగానే మధ్యాహ్నం వరకూ ఎవరూ బయట తిరిగే పరిస్థితి ఉండదు. వింటర్ ఒలింపిక్స్‌కు వివిధ దేశాల నుంచి వచ్చే అథ్లెట్లు, అధికారులు, అభిమానులను పయాంగ్‌చాంగ్ వాతావరణం భయపెడుతుందనేడంలో అనుమానం లేదు.

స్కీయింగ్ వంటి ఈవెంట్స్‌లో పోటీపడే అథ్లెట్లను కూడా వాతావరణం భయపెడుతున్నది. చలి పెరుగుతున్న కొద్దీ, మంచు గడ్డలు మరింత గట్టిపడతాయి. స్కీయింగ్, జంపింగ్స్ కోసం వాడే పరికరాలు ఎందుకూ పనికిరాకుండా పోతాయి. తమతో తెచ్చుకున్న స్కీలను చెత్తబుట్టలో పడేయడం తప్ప మరో మార్గం లేదని ఆస్ట్రియా అల్ పైన్ స్కీయర్ మార్సెల్ హిచెర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.



కర్లింగ్‌తో మొదలు..

గ్యాంగ్‌నియంగ్ (దక్షిణ కొరియా), ఫిబ్రవరి 8: పయాంగ్‌చాంగ్‌లో 18 రోజుల పాటు నిర్వహించే వింటర్ ఒలింపిక్ గేమ్స్‌లో భాగంగా దక్షిణ కొరియా జాంగ్ హై-జీ గురువారం తొలిసారిగా మిక్స్‌డ్ డబుల్స్‌లో కర్లింగ్ స్టోన్ పోటీతో ప్రారంభించింది. వాస్తవానికి అధికారికంగా శుక్రవారం ఈ గేమ్స్ ప్రారంభం కావల్సి ఉంది. కానీ గ్యాంగ్‌నియంగ్ కర్లింగ్ సెంటర్‌లో రౌండ్ రాబిన్ మ్యాచ్‌తో పోటీలను ప్రారంభించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫిన్‌లాండ్‌కు చెందిన ఊనా కౌస్టే-టామ్ రత్నామైకీ, మరో వైపు కెనడా-నార్వే, స్విట్జర్లాండ్-రష్యా అథ్లెట్లు తలపడ్డారు.

జియో టీవీలో ప్రసారాలు

ముంబయి, ఫిబ్రవరి 8: దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్‌లో శుక్రవారం నుండి ప్రారంభం కానున్న వింటర్ ఒలింపిక్ గేమ్స్ ప్రసార హక్కులను జియో టీవీ దక్కించుకుంది. ఇప్పటికే జనాదరణ పొందిన టీవీ యాప్ జియో టీవీ మన దేశంలో ప్రసార హక్కులను సంపాదించింది. గేమ్స్‌ను ప్రసారం చేసేందుకు జియో టీవీతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మిలియన్ల మంది తమ మొబైళ్లలో గేమ్స్‌లను తిలకించనున్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో జియో టీవీ కలసి పనిచేయడం ద్వారా ప్రసారాలను అందజేయనుంది. వింటర్ ఒలింపిక్స్ ఈనెల 9 నుండి 25 వరకు జరుగనున్నాయి. ఇందులో 15 క్రీడాంశాలతోపాటు స్కైయింగ్, స్కేటింగ్, స్కై జంపింగ్, ఐస్ హాకీ, స్నో బోర్డింగ్ వంటి 102 క్రీడా విభాగాలు ఉంటాయి. ప్రపంచంలోని 90 పైగా దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు.

కెరీర్‌కు గుడ్‌బై!

శ్రీలంక ఫాస్ట్‌బౌలర్ లసిత్ మలింగ యోచన


సెయింట్ మార్టిజ్ (న్యూజిలాండ్), ఫిబ్రవరి 8: అంతర్జాతీయ క్రికెట్‌కు శ్రీలంక క్రికెట్ జట్టు ఫాస్ట్‌బౌలర్ లసిత్ మలింగ గుడ్‌బై చెప్పే దిశగా యోచిస్తున్నాడు. త్వరలో జరుగబోయే ఐపీఎల్ టోర్నీలలో భాగంగా ముంబయి ఇండియన్స్ జట్టు బౌలింగ్ కోచ్‌గా అతనిని నియమించారు. ఇంతవరకు జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లలో మలింగ ముంబయి ఇండియన్స్ జట్టుతో ఆడాడు. కానీ ఈసారి జరిగిన ఆటగాళ్ల వేలంలో అతనిని ఏ ఫ్రాంచైజీ కూడా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో అతని కెరీర్ ముగిసినట్టే అని అంతా భావిస్తున్న తరుణంలో మలింగను ఆ జట్టు బౌలింగ్ కోచ్‌గా నియమించడం ఆసక్తి రేపుతోంది. ఐపీఎల్ టోర్నీలలో ముంబయి ఇండియన్స్ జట్టు తరపున ఆడిన దశాబ్దకాలంలో బౌలింగ్‌తో అలరిస్తూ జట్టు విజయాల్లో తనదైన పాత్రను పోషించాడు. 'క్రికెట్‌తో మానసికంగా బాగా అలసిపోయా..ఈ పరిస్థితులలో అంతర్జాతీయ టోర్నీలలో ఆడాలనుకోవడం లేదు' అని ఆయన మీడియాతో వ్యాఖ్యానించాడు. అయితే, తన నిర్ణయాన్ని ఇంకా తమ శ్రీలంక క్రికెట్ కు చెప్పలేదని అన్నాడు. ఐపీఎల్‌లో ఆడేందుకు తన కెరీర్ దాదాపు ముగిసినట్టేనని, కానీ ముంబయి ఇండియన్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తానని అన్నాడు.

టైమింగ్స్ మారిస్తే ఐపీఎల్ బహిష్కరణ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌లు జరిగే సమయాలను మారుస్తూ భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) తీసుకున్న నిర్ణయంపై నిరసన వ్యక్తమవుతున్నది. టైమింగ్స్ మారిస్తే ఐపీఎల్‌నే బహిష్కరిస్తామని ఫ్రాంచైజీలు బీసీసీఐకి అల్టిమేటం జారీ చేసినట్టు సమాచారం.

పేరు చెప్పడానికి ఇష్టపడని బోర్డు అధికారి ఒకరు పీటీఐతో మాట్లాడుతూ మ్యాచ్‌ల ప్రసార హక్కులను సొంతం చేసుకున్న స్టార్ ఇండియా సంస్థ కోరిక మేరకే మ్యాచ్‌లు జరిగే సమయాలను బీసీసీఐ మార్చిందని చెప్పాడు. రాత్రి 8 గంటలకు మొదలయ్యే డే/నైట్ మ్యాచ్‌లు ఈ ఏడాది రాత్రి 7 గంటలకే ప్రారంభమవుతాయి. సాయంత్రం 4 గంటలకు మొదలు కావాల్సిన డే మ్యాచ్‌లను గంటన్నర ఆలస్యంగా, సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. స్టార్ ఇండియా ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ స్టార్ చానెళ్లలో ప్రసారమవుతున్న కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని, మ్యాచ్‌లు జరిగే సమయాలను మార్చాలన్న సూచనకు బీసీసీఐ తలవంచింది. అయితే, చానెళ్ల డిమాండ్ మేరకు ఇలాంటి మార్పులు చేసుకుంటూపోతే, టోర్నమెంట్‌కు విలువ ఉండదని వివిధ ఫ్రాంచైజీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయని పీటీఐతో మాట్లాడిన బోర్డు అధికారి తెలిపాడు. మార్పులు అనివార్యమైతే, ఐపీఎల్‌ను బహిష్కరించాలన్న ఆలోచన కూడా ఫ్రాంచైజీలకు లేకపోలేదని అన్నాడు. ఈ వార్తలో నిజానిజాలు ఎలా వున్నా, సమయాలు మారినప్పుడు సహజంగానే దాని ప్రభావం అటు ఆటగాళ్లపైన, ఇటు ప్రేక్షకులపైన పడుతుంది. స్టార్ డిమాండ్ మేరకు బీసీసీఐ సమయాలను మారుస్తుందో లేక ఫ్రాంచైజీల కోరిక మేరకు పాత షెడ్యూల్‌నే అమలు చేస్తుందో చూడాలి.

సింధు గెలిచినా ఓడిన భారత్!



అలోర్ సెటార్ (మలేసియా), ఫిబ్రవరి 8: ఆసియా బాడ్మింటన్ టీం చాంపియన్‌షిప్స్‌లో శుక్రవారం జపాన్‌ను ఢీకొన్న భారత్ 1-4 తేడాతో చిత్తయింది. రియో ఒలింపిక్స్ రజత పతక విజేత, తెలుగు తేజం పీవీ సింధు తన ప్రత్యర్థి అకానే యమాగూచీని ఓడించినప్పటికీ ఫలితం లేకపోయింది. మిగతా మ్యాచ్‌లను కోల్పోయిన భారత్‌కు పరాభవం తప్పలేదు. మొదటి మ్యాచ్‌లో 36 నిమిషాలు పోరాడిన సింధు 21-19, 21-15 తేడాతో అకానే యమాగూచీపై విజయం సాధించింది. కానీ, రెండో మ్యాచ్‌లో శ్రీకృష్ణ ప్రియ కుందరవల్లి 12-21, 10-21 తేడాతో తన ప్రత్యర్థి సయాకా సాటో చేతిలో పరాజయాన్ని ఎదుర్కొంది. దీనితో ఇరు జట్లు చెరొక విజయంతో సమవుజ్జీగా నిలిచాయి. కానీ, ఆతర్వాత జపాన్ కోలుకొని ఎదుదాడి చేయగా, భారత్ అదే స్థాయిలో రాణించలేక, పరాజయాలను కొనితెచ్చుకుంది. మూడో సింగిల్స్‌లో అయా ఒహోరీతో పోరాటానికి దిగిన డబుల్స్ స్పెషలిస్టు అశ్వినీ పొన్నప్ప 14-21, 12-21 తేడాతో ఓడింది. ఈ ఫలితంతో జపాన్‌కు 2-1 ఆధిక్యం లభించింది. రెండో డబుల్స్‌లో సంయోగితా గోర్పాడే, ప్రజాక్తా సావంత్ కొంత వరకూ పోరాడినప్పటికీ, షిహో తకానా, కొహరు యొనెమోతో జోడీ చేతిలో 17-21, 17-21 తేడాతో ఓటమిపాలయ్యారు. జపాన్ తిరుగులేని స్థాయిలో 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఎలాంటి ప్రాధాన్యం లేని రెండో డబుల్స్ మ్యాచ్‌లోనూ భారత్‌కు ఓటమి తప్పలేదు. అశ్వినీ పొన్నప్ప, సిక్కీ రెడ్డి జోడీతో తలపడిన మిసాకీ మత్సుమొతో, అయాకా తకహషి 21-18, 21-18 తేడాతో విజయం సాధించి, జపాన్‌ను 4-1 ఆధిక్యంతో గెలిపించారు. అయితే, తన గ్రూప్‌లో రెండో స్థానాన్ని ఆక్రమించిన కారణంగా, జపాన్ చేతిలో ఓడినప్పటికీ భారత్‌కు క్వార్టర్స్‌లో చోటు దక్కింది. భారత పురుషుల జట్టు కూడా క్వార్టర్స్‌కు అర్హత సంపాదించింది.

ఫెడ్ కప్ టెన్నిస్ కజక్ చేతిలో భారత్ ఓటమి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రతిష్ఠాత్మక ఫెడ్ కప్ ఆసియా/ఓషియానిగా గ్రూప్-1 ప్లే ఆఫ్‌లో భాగంగా గురువారం జరిగిన పోరులో కజకస్థాన్ చేతిలో భారత్ 1-2 తేడాతో పరాజయాన్ని చవిసింది. జపాన్‌తో పోరాడి గెలిచిన విధంగానే అంకిత రైనా కజక్‌పైన కూడా పూర్తి ఆధిపత్యాన్ని కనబరచి, విజయాన్ని నమోదు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మొదటి మ్యాచ్‌లో జరినా డయాస్‌తో తలపడిన కర్మాన్ కౌర్ థండి 0-6, 4-6 తేడాతో ఓటమిపాలైంది. అయితే, రెండో మ్యాచ్‌లో అంకిత అద్వితీయ ప్రతిభ కనబరచింది. జూలియా పటింటోస్వాను 6-3, 1-6, 6-4 ఆధిక్యంతో ఓడించింది. కానీ కీలకమైన చివరి మ్యాచలో ప్రార్థన తుంబారేతో కలిసి ఆడిన అంకితకు పరాజయం తప్పలదు. జరీనా డయాస్, జూలియా పటింటోస్వా జోడీ 6-0, 6-4 ఆధిక్యంతో అంకిత, ప్రార్థన జోటీపి ఓడించారు.

ఒత్తిడి లేకుండా ఆడడమే నా కర్తవ్యం

భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ

కేప్ టౌన్, ఫిబ్రవరి 8: మైదానంలో తనదైన స్టయిల్‌లో ఆడుతూ ప్రత్యర్థి జట్టు బౌలర్ల బంతులను తుత్తినియలు చేసే భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆటతీరును వేనోళ్ల పొగడనివారు ఉండరు. బ్యాటింగ్ చేస్తున్నపుడు ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా ఆడడమే తన ముందున్న కర్తవ్యమని అతను అన్నాడు. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన మూడో వన్డేలో కోహ్లీ 124 పరుగులు ఎదుర్కొని 160 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి, వన్డేలో 34 సెంచరీ నమోదు చేసిన విషయం తెలిసిందే. కీలక మ్యాచ్‌గా పరిగణించిన ఈ సమయంలో జట్టు కెప్టెన్‌గా సమర్థమైన పాత్ర పోషించాడు. ఈ ఏడాది 30వ పడిలో పడుతున్న కోహ్లీ 34-35 ఏళ్లు వచ్చేవరకు ఇలానే ఆటతీరును ప్రదర్శిస్తానని గట్టి నమ్మకంతో చెబుతున్నాడు. యువకుడిగా ఉన్నందున మైదానంలోకి వెళ్లినపుడు బౌలర్ ఎవరు అనే విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా తనదైన శైలిలో దూసుకుపోవడమే ఎంతో ఇష్టమని అన్నాడు. 'అంతర్జాతీయ టోర్నీలలో పరుగులు చేయడం అంత సులభం కాదు, కొన్ని పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండవు. బంతులు బౌన్స్ అయినా, పేస్ అయినా ఎదుర్కొనేందుకు ఎప్పుడూ సిద్ధమే' అని కోహ్లీ పేర్కొన్నాడు.





త్రిపురలో గురువారం బీజేపీ నిర్వహించిన ఒక ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. సభకు హాజరైన జనం.

గెలిపిస్తే త్రిపురకు అద్భుత భవిత

ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ ఉద్ఘాటన ◆ మాణిక్ సర్కార్‌ను సాగనంపితేనే మోక్షం

సోనాముర (త్రిపుర), ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి దోహదం చేసే బీజేపీకే పట్టం కట్టాలని త్రిపుర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మాణిక్ సర్కార్ సారథ్యంలోని వామపక్ష ప్రభుత్వాన్ని సాగనంపాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలని గురువారం నాడిక్కడి రంగామాటియా మదర్సా మైదానంలో జరిగిన భారీ ర్యాలీలో మోదీ అన్నారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న మాణిక్ సర్కార్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి, ప్రజల అభ్యున్నతికి ఏమాత్రం దోహదం చేయలేకపోయిందని మోదీ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజల స్థితిగతులు మారాలంటే అభివృద్ధే చుక్కానిగా త్రిపుర దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు పోటీగా మందుకు సాగాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలదోసి బీజేపీకి పట్టం కట్టడం ఒక్కటే సముచిత నిర్ణయం అవుతుందని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా హైవేలు, ఇంటర్‌నెట్, రహదార్లు, విమాన సర్వీసులు (హెచ్ఐఆర్ఏ) ఇబ్బడిముబ్బడిగా రాష్ట్రానికి రావాలంటే ప్రస్తుత ప్రభుత్వాన్ని మార్చి బీజేపీకి అధికారాన్ని అప్పగించడమే మార్గమని తెలిపారు. దీర్ఘకాలంగా త్రిపుర వెనుకబడిన రాష్ట్రంగానే మిగిలిపోయిందని, అభివృద్ధి అన్నది ఏ కోశానా రాష్ట్రంలో లేదని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో రవాణా సౌకర్యాలను విస్తృతంగా పెంపొందించడం ద్వారా రాష్ట్రంలో ప్రగతి దిశగా పరివర్తన తీసుకురావాలన్నదే బీజేపీ ఆశయమని మోదీ ఉద్ఘాటించారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ప్రగతిని సాధించాలంటే ప్రస్తుత సర్కార్ వల్ల ఏ రకమైన ఉపయోగం ఉండదన్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే సరైన రోడ్డు మార్గాలు, హైవేలు, రైలు సౌకర్యాలు, విమాన సౌకర్యాలు అన్ని విధాలుగా పెంపొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈ నాలుగింటిని రాష్ట్రానికి తీసుకువస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. 60 స్థానాలు కలిగిన త్రిపుర అసెంబ్లీకి ఈ నెల 18న ఎన్నికలు జరుగుతాయి. మార్చి 3న ఫలితాలు వెలువడతాయి.

ఏపీ హక్కులకోసం దద్దరిల్లిన పార్లమెంట్

నిరవధికంగా నిరసన తెలుపుతున్న ఎంపీలు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను అమలు చేయాలంటూ రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ లోపలా, బయటా వరుసగా మూడోరోజూ ఆందోళన చేపట్టారు. గురువారం టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఉభయ సభల్లో తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. పార్లమెంట్‌లో అవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు తోట నర్సింహం, కె.రామ్మోహన్ నాయుడు, అవంతి శ్రీనివాస్, పండుల రవీంద్రబాబు, మురళీమోహన్, మాగంటి బాబు, కొనగళ్ల నారాయణరావు, గల్లా జయదేవ్, కేశినేని నాని, శ్రీరాం మాల్యాద్రి, నిమ్మల కిష్టప్ప, రాజ్యసభ సంభ్యులు సీఎం రమేష్, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేష్, గరికపాటి రామ్మోహన్‌రావు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలిస్తూ ఆందోళన చేశారు. ఎంపీ శివప్రసాద్ ప్రత్యేక వేషధారణలో డప్పును మోగిస్తూ పాటలు పాడి నిరసన తెలిపారు. మరోవైపు వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్, మిధున్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని, విభజన హామీలను అమలుచేయాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం లోక్‌సభ ప్రారంభకాగానే టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు స్పీకర్ పోడియం వద్దు నిలబడి ప్లకార్డులు పదర్శిస్తూ నినాదాలిస్తూ నిరసనను కొనసాగించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ పోడియం వీడి తమ స్థానాల్లో కుర్చోవాలని టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలను విజ్ఞప్తి చేశారు. ఎంపీలంతా అదేమీ పట్టించుకోలేదు. ఈ పరిస్థితులలో టీడీపీ ఎంపీ శివప్రసాద్ ఢమరుకం మోగిస్తూ హడావిడి చేశారు. రైల్వేజోన్ క్యా హువా, స్పెషల్ స్టేటస్ క్యా హువా అని ఎంపీ కిష్టప్ప అంటే.. మిగతా టీడీపీ ఎంపీలు గోవిందా... గోవిందా అంటూ నినాదాలు చేశారు. ఈ పరిస్థితుల్లో ఏపీ అంశంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడతారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ చేసిన విజ్ఞప్తిని కూడా ఎంపీలు పట్టించుకోలేదు. ఎంపీ శివప్రసాద్ స్పీకర్ సచివాలయ సిబ్బంది వద్ద ఉండే నియామవాళి పుస్తకాలను లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సిబ్బందికి ఇబ్బంది కలిగించవద్దని హెచ్చరించారు. అనంతరం సభను 15 నిమిషాలపాటు వాయిదా వేసి టీడీపీ, వైకాపా ఎంపీలను తన చాంబర్‌కి రావాలని కోరారు. ఎంపీలు కొంతమంది స్పీకర్ దగ్గరకు వెళ్లారు. అనంతరం కూడా ఎంపీలు నిరసన కొనసాగించారు. వైఎస్‌ఆర్‌సీపీ, టీడీపీ ఎంపీలు విరామం లేకుండా ఉదయం నుంచి సాయంత్రం సభ వాయిదా పడేవరకు నిరసన కొనసాగిస్తూనే ఉన్నారు.



గురువారం పార్లమెంటు వెలుపల ఆందోళన చేస్తున్న తెలుగుదేశం ఎంపీలు

పాత పాటే పాడారు

జైట్లీ ప్రకటనపై ఏపీ ఎంపీల అసంతృప్తి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఏపీ విభజన సమస్యల పరిష్కారంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో చేసిన ప్రకటన తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలను సంతృప్తి పరచలేదు. జైట్లీ మరోసారి తమను మోసం చేశారంటూ రెండు పార్టీల ఎంపీలు లోక్‌సభలో నిరసన వ్రతాన్ని కొనసాగించారు. స్పీకర్ సభను వాయిదా వేయటంతో వారు శుక్రవారం కూడా పార్లమెంటు ఉభయసభల్లో నిరసన వ్రతం కొనసాగించవచ్చు. అరుణ్ జైట్లీ గురువారం సాయంత్రం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు బదులిచ్చే సమయంలో ఏపీ సమస్యల గురించి ప్రస్తావిస్తూ పరిష్కారాలు సూచిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్, సహాయ మంత్రి విజయ్ గోయల్ మధ్యాహ్నం నుండీ వారిని ఊరించారు. జైట్లీ ప్రకటన చేయనున్నందున నిరసన మానుకోవాలని విజప్తి చేశారు. అయితే జైట్లీ ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవటంతో తెలుగుదేశం సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. జైట్లీ తమను మరోసారి మోసం చేశారని పలువురు ఎంపీలు ఆరోపించారు. పోలవరం పునరావాస ప్యాకేజీ ఏమైందని పలువురు తెలుగుదేశం సభ్యులు జైట్లీని ప్రశ్నించారు. అయితే జైట్లీ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా తాను చెప్పాలనుకున్నది చెప్పి సీట్లో కూర్చున్నారు.

రాష్ట్ర విభజన హామీలపై రెండు రోజుల క్రితం చేసిన ప్రకటననే జైట్లీ గురువారం పునరావృతం చేశారు. ప్రత్యేక హోదాకు బదులు ఇవ్వవలసిన నిధులు, బడ్జెట్ రెవెన్యూ లోటు అంశంపై జైట్లీ కొత్తగా ఏమీ చెప్పలేదు. హోదాకు బదులు ఇవ్వవలసిన నిధులను నాబార్డ్ ద్వారా ఇప్పించే అంశంపై అధికారులతో చర్చిస్తున్నాం, లోటు విషయంపై కూడా చర్చలు జరుగుతున్నాయంటూ ఆయన తప్పించుకున్నారు. జైట్లీ పాత ప్రకటనను తిరగదోడటాన్ని తెలుగుదేశం ఎంపీలు ప్రతిఘటిస్తారని అనుమానించిన బీజేపీ అధినాయకత్వం ఆయనకు రక్షణగా కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య శాఖ మంత్రి ఉమా భారతిని మోహరించారు.

నిరసనకు కాంగ్రెస్ మద్దతు

ఏపీ విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదాపై లోక్‌సభలో చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ నోటీసు ఇచ్చింది. లోక్‌సభ 184వ నిబంధన కింద చర్చ, ఓటింగ్ జరపాలని లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కి కాంగ్రెస్ పక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే నోటీసు అందజేశారు. మరోవైపు లోక్‌సభలో టీడీపీ ఎంపీలు సోనియా గాంధీని కలిసి సమస్యలు వివరించారు. తప్పకుండా సహకారం అందించడంతోపాటు పోరాటం చేస్తామని టీడీపీ ఎంపీలకు సోనియాగాంధీ హామీ ఇచ్చారు.

రాజ్యసభలోనూ ఆందోళన

రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభంకాగానే రాష్ట్రానికి చెందిన ఎంపీలు నిరసనను కొనసాగించారు. ఏపీ విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎంపీలు సీఎం రమేష్, తోట సీతారామలక్ష్మి, గరికపాటి రామ్మోహన్‌రావు, టీజీ వెంకటేష్, కాంగ్రెస్ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, టీ సుబ్బరామిరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్లకార్డులు పదర్శిస్తూ నిరసన తెలిపారు.

మంత్రివర్గం నుంచి బయటికి రండి

- సుజనా చౌదరిని డిమాండ్ చేసిన విజయసాయి రెడ్డి
- పదవిలో ఉంటూ కేంద్రంతో ఎలా విభేదిస్తారని నిలదీత
- గొంతు కలిపిన తృణమూల్, సమాజ్‌వాది
- పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను తిరస్కరించిన వెంకయ్య



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వంతో విభేదిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి మంత్రివర్గం నుండి రాజీనామా చేయాలని వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు విజయసాయి రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌డీయేలో భాగస్వామిగా కొనసాగుతూనే ప్రభుత్వంతో ఎలా విభేదిస్తారని ఆయన నిలదీశారు. 'మిమ్మల్ని సభనుండి పంపించివేయవలసి వస్తుంది' అని హెచ్చరించిన సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడుతో ఆయన వాదనకు దిగారు. 'మీరు ఏం చేసినా ఫరవాలేదు' అని విజయసాయి రెడ్డి బదులివ్వటంతో వెంకయ్య ఆగ్రహం చెందారు. 'మీపై కఠిన చర్యలు తీసుకోవలసి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు.

విజయసాయి రెడ్డి రాజ్యసభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సభలో ప్రకటన చేయాలని సుజనా చౌదరి ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. రాజ్యసభలో తెలుగుదేశం ఎంపీలు విభజన హామీలను అమలు చేయాలంటూ సభలో గొడవ చేయటాన్ని పరిష్కరించేందుకు సూచనలు ఇచ్చే అధికారం సుజనా చౌదరికి ఉన్నదని వెంకయ్య రూలింగ్ ఇచ్చారు. ఈ సూచనతో విజయసాయి రెడ్డి ఏకీభవించలేదు. సుజనా చౌదరి మంత్రివర్గంలో కొనసాగుతూ ప్రభుత్వంతో ఎలా విభేదిస్తారని ప్రశ్నించారు. అలా చేయలంటే మొదట మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ అగర్వాల్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు పూర్తిగా బలపరిచారు. దీనితో సభలో తీవ్ర గందరగోళం నెలకొనటంతో సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపడుతున్న సమయంలో తెలుగుదేశం సభ్యులు సీఎం రమేష్, గరికపాటి రామ్మోహన్ రావు, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేశ్, కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచందర్‌రావు పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ విభజన హామీలు అమలు చేయాలనే నినాదాలిచ్చారు. రామచందర్‌రావు మౌన ప్రదర్శన కొనసాగించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమానికి సభ్యులు అడ్డుపడడం మంచిది కాదని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రం మండుతోంది కాబట్టి ఈ సమస్యను పరిష్కరించాలని రమేష్ సూచించారు. సుజనా చౌదరి స్పందిస్తూ విభజన చట్టాన్ని అన్యాయంగా ఆమోదించారు, దీనికి రెండు జాతీయ పార్టీలు బాధ్యత వహించాలి, ప్రస్తుతం నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు ఉక్కు కార్మాగారం, అమరావతికి సహాయం, ప్రత్యేక హోదా, బడ్జెట్ లోటు భర్తీ తదితర సమస్యల పరిష్కారానికి అరుణ్ జైట్లీ హామీ ఇవ్వాలి. పదిహేను రోజుల్లో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఈ సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు. వెంకయ్య సూచన మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్ మాట్లాడుతూ అరుణ్ జైట్లీ బడ్జెట్‌పై బదులిచ్చే సమయంలో ఈ సమస్యల పరిష్కారంపై స్పందిస్తారని హామీ ఇచ్చారు. సుజనా చౌదరి మంత్రివర్గం సభ్యుడై ఉంటూ మరో మంత్రిని డిమాండ్ ఎలా చేస్తారని ఎస్పీ సభ్యుడు నరేష్ అగర్వాల్ నిలదీశారు.

కేవీపీ రామచందర్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల కష్టాలు, సమస్యలు, విభజన హామీల గురించి ఇక్కడ మాట్లడకపోతే ఇంకెక్కడ మాట్లాడుతామని ప్రశ్నించారు. విభజన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విభజన చట్టాన్ని ఆమోదించిన రాజ్యసభ గౌరవాన్ని నిలపకపోతే ఎలా? అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఎలా? అని ఆయన నిలదీశారు. ఈ దశలో విజయసాయి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతూ మంత్రులందరూ సమష్టి బాధ్యత వహించాల్సిదేనని అన్నారు. ప్రభుత్వంతో విభేదించాలంటే సుజనా చౌదరి మొదట తన మంత్రిపదవికి రాజీనామా చేయాలని, తెలుగుదేశం ఎన్‌డీయే నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. విజయసాయి పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను వెంకయ్య తిరస్కరించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఏమీ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. సుజనా చౌదరి కేవలం సూచన చేశారు తప్ప ప్రభుత్వంతో విభేదించలేదని స్పష్టం చేశారు. నరేష్ అగర్వాల్ తదితరులు విజయసాయి వాదనను సమర్థించారు. ఒక మంత్రి ప్రస్తావించిన అంశానికి రెండో మంత్రి బదులివ్వవచ్చా? అని ప్రశ్నించారు. ఒక సమస్యను పరిష్కరించేందుకు అధ్యక్షుడి సలహాతో మంత్రులు సలహాలు ఇవ్వవచ్చునని వెంకయ్య రూలింగ్ ఇచ్చారు. విజయసాయితోపాటు సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు రూలింగ్‌తో ఏకీభవించలేదు. వెంకయ్యతో విజయసాయి రెడ్డి వాదనకు దిగారు. అధ్యక్షుడి అనుమతి తీసుకోకుండానే మాట్లాడుతారా? అని వెంకయ్యనాయుడు ఆయనను ప్రశ్నించారు. సుజనా చౌదరి మంత్రిపదవికి రాజీనామా చేయాలి, తెలుగుదేశం పార్టీ ఎన్‌డీయే నుండి వైదొలగాలని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. మిమ్మల్ని సభనుండి పంపించివేయవలసి వస్తుందని చైర్మన్ ఆయనను హెచ్చరించిన అనంతరం సభను వాయిదా వేశారు.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు జైలుశిక్ష

వచ్చే ఎన్నికల్లో పోటీకి అనర్హత ◆ అవినీతి కేసులో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

ఢాకా, ఫిబ్రవరి 8: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశానికి మూడుసార్లు ప్రధానిగా సేవలందించిన 72 సంవత్సరాల ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు ఖలీదాపై దాఖలైన ఒక కేసులో ఆమె అవినీతికి పాల్పడ్డారని నిర్ధారిస్తూ ఐదేళ్ల కఠిన కారాగార శిక్షను ప్రత్యేక న్యాయస్థానం విధించింది. దీనివల్ల ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికల్లో ఆమె పోటీ చేసే అవకాశం కోల్పోయినట్టే. ఆమె భర్త దివంగత జియావుర్ రహ్మాన్ పేర స్థాపించిన జియా అనాధాశ్రమ సంస్థకు విదేశాల నుంచి అందిన 21 మిలియన్ టాకాల (250,000 అమెరికన్ డాలర్లు) వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారంటూ ఆమెపై కేసు దాఖలైంది. ఈ కేసులో నిందితుడైన ఆమె పెద్ద కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఉపాధ్యక్షుడితోపాటు మరో నలుగురికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి మహమ్మద్ అఖతరుజ్జమన్ తీర్పు చెప్పారు. రాజకీయ ఉత్కంఠ నెలకొనగా, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య తెల్లటిచీర ధరించిన ఖలీదా జియా గంభీరవదనంతో కోర్టుకు హాజరయ్యారు. ఈ అవినీతి కేసులో నిందితుల నేరాలు ఎటువంటి అనుమానం లేకుండా నిర్ధారణ అయ్యాయని, ప్రధాన నిందితురాలు ఖలీదా జియా వయోభారాన్ని దృష్టిలో పెట్టుకొని తక్కువ శిక్ష విధించామని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. 632 పేజీల తీర్పులో ముఖ్య విషయాలను న్యాయమూర్తి పది నిమిషాల్లో చదివి వినిపించారు. శిక్షపడిన వారిలో చట్టసభ సభ్యుడు కాజీ సలీముల్ హక్ కమాల్, వ్యాపారవేత్త షర్‌ఫుద్దీన్ అహ్మద్, మాజీ ప్రధాన కార్యదర్శి కమాలుద్దీన్ సిద్దిఖి ఉన్నారు. కాగా ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేస్తామని, భగవంతుడు న్యాయం చేస్తాడని జియా తరపున న్యాయవాది ఖొండ్కర్ మహబూబ్ హుస్సేన్ పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. తీర్పు వెలువడిన తరువాత ఖలీదా జియాను పాత ఢాకా కేంద్ర కారాగారానికి జీపులో తరలించారు. దేశానికి మూడుసార్లు ప్రధానిగా వ్యవహరించిన జియా జాతీయ పార్టీకి అధ్యక్షురాలని, వయోభారాన్ని పరిగణలోకి తీసుకుని జైలులో ఆమెకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హోంమంత్రి అసదుజ్జమన్ ఖాన్ తెలిపారు. కోర్టుతీర్పు, ఖలీదా జియాను జైలుకు తరలిస్తున్న నేపథ్యంలో ఢాకాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.





గురువారం ఢాకాలోని ప్రత్యేక న్యాయ స్థానానికి హాజరవుతున్న ఖలీదా జియా. ఖలీదాకు జైలు శిక్ష విధించడంతో రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్న బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ కార్యకర్తలు



ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో నిర్వహిస్తున్న 32వ అంతర్జాతీయ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ మేళాలో సరదాగా సెల్ఫీలు దిగుతున్న రాధాకృష్ణులు, రావణ వేషధారణ కళాకారులు

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

C M Y K



రాజకీయాల్లో మీరు ఏవైనా కోరుకుంటే ఒక మనిషిని అడగండి. మీరు ఏదైనా చేయాలనుకుంటే ఒక మహిళను అడగండి

-మార్గరేట్ థాచర్

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శుక్రవారం 9, ఫిబ్రవరి 2018



పేదరాలి పెద్ద మనసు

కూరగాయలమ్మి ఆసుపత్రి కట్టించిన వృద్ధురాలు సుభాషిణి సేవానిరతికి దక్కిన పద్మ పురస్కారం

అది ఏప్రిల్ 13, 1971 సంవత్సరం. పశ్చిమ బెంగాల్ దక్షిణ 24 పరగణాల జిల్లాలోని హన్సపకుర్ అనే కుగ్రామం. అక్కడి కూరగాయల సంతలో కూరగాయలు అమ్ముతున్న సదన్ చంద్ర మిస్త్రీ(35) అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. పెద్ద జబ్బుకాకపోయిన సరైన మందులు, వైద్య సదుపాయం లేక చనిపోయాడు. ఈ సంఘటన అక్కడ కూరగాయలు అమ్మే ఓ వర్తకుడిని ఎంతో ఆవేదనకు గురిచేసింది. ఇక్కడ ఉంటే ఇలాగే ఏ రోగం వచ్చినా నయం చేసే దిక్కు లేదు అనుకున్నాడు. భార్య ఎంత నచ్చజెపుతున్నా వినకుండా తన చదువురాని 23 సంవత్సరాల సుభాషిణీని వదిలేసి ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని ఆ కుగ్రామాన్ని వదలి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి ఆ ఎండలో కూరగాయలు అమ్ముతూ సుభాషిణి దృఢ సంకల్పం తీసుకుంది. ఈ గ్రామంలో ఎలాగైనా ఆసుపత్రి కట్టించి పేదలకు వైద్య సదుపాయం కల్పించాలనేది ఆమె సంకల్పం. అలా వెళ్లిపోయిన భర్త మరణం తరువాత పిల్లలను తనతో పాటు తెచ్చుకుని వారిని పెంచి పోషించుకుంటూ రూపాయి రూపాయి కూడబెట్టి ఆసుపత్రి నిర్మించేందుకు నడుం బిగించింది. ఆమె నిర్ణయాన్ని విని ఆ గ్రామస్తులంతా నవ్వారు. ఎవరెంత ఎగతాళి చేసినా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. గుడిసెలో ఉంటూనే ఐదుగురు ఆమె రెక్కల కష్టం మీద ఆధారపడి బతికినా.. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిల్లు చేసినా.. ఆ కల నెరవేరే వరకు ఆమె అలుపెరగని శ్రమ చేసింది. మగ పిల్లలను చదివించింది. ఎర్రటి ఎండలో కూరగాయలు ఇరవై ఏళ్లపాటు అమ్మి ఎలాగైతేనేమి తన గుడిసె పక్కనే ఓ క్లినిక్‌ను ప్రారంభించింది. ఆ క్లినిక్‌లో పేదలకు వైద్యం అందించే ఏర్పాట్లు చేసింది. వారానికి ఓ వైద్యుడు వచ్చి పేషెంట్లను చూసి మందులు ఇచ్చేవాడు. పేదలకు వైద్యం సదుపాయం దక్కటంతో సుభాషిణి పేరు ఆ గ్రామంలో మారుమ్రోగింది. ప్రతి ఒక్కరూ ఆమెకు గౌరవం ఇవ్వటం ప్రారంభించారు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసింది. పెద్ద కొడుకు వ్యవసాయం చేయటానికి మొగ్గుచూపాడు. రెండవ కొడుకు అజయ్ మిస్త్రీ అమ్మ కలను అర్థం చేసుకున్నాడు. సెకండరీ పాఠశాల విద్య పూర్తి చేసిన తరువాత ఆల్ ఇండియా మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలు రాశాడు. ర్యాంకు సాధించాడు. అంతేకాదు జర్మన్ స్కాలర్‌షిప్ సాధించాడు. కోల్‌కతా మెడికల్ కాలేజీలో చేరాడు. కష్టపడి చదువుకున్నాడు. స్నేహితులు, ఎన్జీఓల సాయంతో మరో యాభై వేల రూపాయలు కూడబెట్టి అమ్మకు అందించాడు.

1993లో అజయ్ మిస్త్రీ హ్యూమనిటీ ట్రస్ట్‌ను స్థాపించాడు. తల్లి సుభాషిణీ మిస్త్రీ కో-ఫౌండర్‌గా వ్యవహరించేది. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5, ఫిబ్రవరి, 1995న పక్కా ఆసుపత్రి భవన నిర్మాణానికి పునాది పడింది. ఏడాదికల్లా ఆసుపత్రి ప్రారంభమైంది.ట్రస్ట్‌కు విరాళాలు రావటం ఆరంభమయ్యాయి. రెండున్నర దశాబ్దాల క్రితం ఆమె కన్న కల నేడు సాకరమైంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ఈ ఆసుపత్రికి గుర్తింపు లభించింది. తన కష్టార్జితంతో పాటు దాతలు ఇచ్చిన విరాళాలతో ఆ గ్రామస్తులకు చక్కటి వైద్యసదుపాయం కల్పించిన సుభాషిణి అంటే ఆ గ్రామస్తులకు ఎనలేని గౌరవం. అందుకే ఈ వృద్ధురాలి సేవానిరతికి పద్మ పురస్కారం దక్కింది. ఇప్పటికీ సుభాషిణీ కూరగాయలు అమ్ముతూ అతి సాధారణ జీవితాన్నే గడపటం ఆమె నిరాడంబరతనానికి నిదర్శనం.

పని'మనిషే' కాదా..!



ఈ మధ్యకాలంలో వచ్చే సీరియల్స్‌ని చూస్తుంటే మనకు చాల హాస్యాస్పదంగా తోస్తుంది. సంభాషణా రచయితలకు కనీస పరిజ్ఞానం లేనట్లుగా తోస్తుంది. ఇంటి కోడళ్ళను లేదా వారి నాశ్రయించుకున్న మనుషులను పనిమనుషులుగా పదే పదే దెప్పిపొడవడం జరుగుతోంది. కొండొకచో తీవ్రంగా అవమానించటం, హింసించడం జరుగుతుంది. పూర్వం సినిమాలలో పనిమనిషికి ఒక ఉన్నత స్థానం ఉండేది. పనిమనుషులను మన మనుషులుగా, బాబాయ్, అమ్మా వంటి పేర్లతో వరుసలతో పిలుస్తూ గౌరవించేవారు. వారు కూడా కష్టసుఖాలలో చేదోడు వాదోడుగా నిలిచేవారు. కన్న తల్లిదండ్రుల ప్రేమను అందించినట్లుగా చూపించేవారు. అపుడు మానవ సంబంధాలు అంత బలీయంగా ఉండేవి. ఒకరిపై ఒకరికి మమతానురాగాలు, గౌరవం ఉండేవి.

పనిమనుషులు నిజానికి ఏ ఇంటిలోనూ అంత హీనంగా ఉంటారా? అంటే లేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. యజమానులు ఇచ్చే జీతం కంటే వారిచ్చే గౌరవానికి, ప్రేమకీ పనిమనుషులు ఉంటారు. చలనచిత్రాలు, నేటి సీరియల్స్‌లో లాగా కాఫీ మొహన పోస్తే తుడుచుకుని వెళ్ళేంత హీనంగా ఎవరూ లేరు. చాలా ఇళ్ళల్లో పనిమనిషికి నచ్చిన టిఫిన్స్ చేసి పెట్టడం, రోజూ ఒకే టిఫిన్ కకుండా చూడడం, చీరలు, మామూళ్ళు, కూరలు వంటివి ఇవ్వడం మనందరికీ తెలిసిందే. మరి ఇంత హృదయవిదారకంగా తక్కువ చేసి చూపించే మీడియాని ఏమనాలి? అగౌరవంగా చూస్తే పనిమనిషేంటి? కొడలేంటి? ఎవరూ ఎక్కువకాలం నిలువరు. ఒకరి క్రింద పనిచేసేవారెవరైనా ఉద్యోగులే గదా! చిన్నా పెద్దా తేడా ఉంటుందంతే. ఎవరైనా పనిచేయనిదే నాలుగు వ్రేళ్ళు నోటిలోకి పోవు.

నిజంగా పనిమనుషులను అంత నీచంగా చూసే క్రూర స్వభావం ఎవరికైనా ఉంటే తప్పనిసరిగా మార్చుకోవాలి. ఎప్పుడైనా ఎవరినీ వారి అసహాయత జూచి బాధించకూడదు. అహంకారంతో ప్రవర్తించకూడదు. సహనంగా వున్నవారిని పదే పదే అసహనం వచ్చే విధంగా రెచ్చగొట్టకూడదు. అవకాశం వస్తే గదిలో పిల్లి అయినా పులిలా మారి గాండ్రిస్తుంది. ఇప్పుడు అసహాయంలో పడినవారు, వారి అధీనంలోకి మనం వచ్చినపుడు ఆ అవకాశాన్ని వినియోగించుకుని దెబ్బకు దెబ్బతీస్తారు. అది పనిమనిషైనా, కోడలైనా. అందుకే అహంకారంతో వేధించే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులారా! తస్మాత్ జాగ్రత్త!

-బి.హెచ్.వి.రమాదేవి



బ్రతుకుతెరువుకోసం వచ్చినవారిని గౌరవించే సంస్కారం అలవరచుకోవాలి. ''నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించుము' అంటాడు జీసస్. మనకు పనికిరానివి, పాడయినవి, పనిమనుషులకు పెట్టి రోగాలపాలు చేయవద్దు. ఎంగిళ్ళు అసలు పెట్టవద్దు. నీవిచ్చే జీతంకోసం తప్పక నీతో మాటలు పడేవారు, అవకాశం వస్తే తప్పుకుంటారు. కొంతమంది ఇంట్లో అజాగ్రత్తగా ఉండి ఎక్కడెక్కడో తమ విలువైన వస్తువులు పారేసుకుని పనిమనుషులను పోలీసు స్టేషన్ దాకా తీసుకెళ్లిన దాఖలాలు ఉన్నా. తరువాత అది వాళ్లింట్లోనే దొరికిన సందర్భాలూ ఉన్నాయి. అక్కడక్కడా ఎవరో ఒకరు అలాంటి తప్పు చేస్తే అందరినీ ఒకే విధంగా అనుమానించడం కరెక్టు కాదు.



వేటిలో ఏ పోషకాలు..

పిల్లలకు సమతుల పోషకాహారం ఎంతో అవసరం. రోజువారీ శ్రమతో పాటు ఎముకులు, తగినంత కండరాల బలం కోసం నడక, పరుగు వంటి చేయించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులే పిల్లలకు మార్గదర్శకం. కనుక వారు చేయడం ద్వారా పిల్లలను ప్రోత్సహించవచ్చు. శరీరంలో కణాల నిర్మాణానికి ప్రొటీన్లు అవసరం ఉంది. ఆహారాన్ని శక్తిగా మార్చేందుకు, ఇన్ఫెక్షన్లపై పోరాడేందుకు, ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు ప్రొటీన్ల అవసరం ఎంతో ఉంది. మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, నట్స్ (బాదం, అక్రూట్ తదితర), బీన్స్, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. శరీరానికి శక్తినందించే కీలక వనరులు ఇవి. చక్కెర, గంజి, పీచు పదార్థాలలో కార్బొహైడ్రేట్స్ తగినంత ఉంటాయి. బ్రెడ్స్, ధాన్యాలు, బియ్యం, ఆలు గడ్డల్లో కార్బొహైడ్రేట్లు పుష్కలం. కొవ్వు పదార్థాలు పిల్లలకు అధికంగా ఇవ్వకూడదు. కొవ్వు తగినంత మోతాదు అవసరమే. కొవ్వులు అధికంగా ఉండే హోల్‌మిల్క్ పదార్థాలు, వంట నూనెలు, మాంసం, చేపలు, నట్స్.

సానుకూలత ఎలా సాధ్యం..?

గోరుముద్ద



''మీరు ఎలా ఆలోచిస్తారో అలాగే అవుతారు'' అని అంటారు స్వామి వివేకానంద. పాఠశాలలో విద్యార్థులు సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తే అక్కడ ఎదురయ్యే ఎన్నో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగలరు. అందుకు సన్నద్ధులంకాగలరు. ఈ సానుకూలభావాలే లేకపోతే పెద్దయితే జీవిత లక్ష్యాన్ని సాధించలేరు. జీవనయాత్రను సైతం అర్థవంతంగా మలుచుకోగలరు. పసివయసులో ఉండగా.. స్వామి వివేకానందను నరేంద్రుడు అని అనేవారు. ఓరోజు తరగతి గదిలో టీచర్ ఓ ప్రశ్న విద్యార్థులను అడిగారు. నరేంద్రుడు లేచి సరైన సమాధానం చెప్పాడు. కాని ఆ టీచర్ అది తప్పు అని అన్నారు. కాని వివేకానంద తాను చెప్పిన సమాధానం సరైందననే మళ్లీ చెప్పటం జరిగింది. దీంతో ఆ టీచర్‌కు విపరీతమైన కోపం

> **''పిల్లల్ని ఐదేళ్లు వచ్చేవరకూ రాజభోగాలతో పెంచాలి. పదేళ్ల తరువాత పనిపాటలు నేర్పంచాలి. పదహారేళ్ల వయసు వచ్చాక స్నేహితుల్లాగ భావించి సలహాలిస్తూ సన్మార్గంలో నడిపించాలి.'**
>
> **- చాణక్య నీతి**

వచ్చి నువ్వు చెప్పింది తప్పు అని నరేంద్రుడ్ని బెత్తంతో దండించాడు. నరేంద్రుడు ఏడుస్తూ తన తల్లి భువనేశ్వరికి చెప్పాడు. అపుడు ఆ తల్లి ఇచ్చిన సమాధానం ఇలా ఉంది. ''నాయనా నువ్వు చెప్పిన సమాధానం సరైందే కావచ్చు కాని టీచర్‌తో చెప్పే విధానం సరిగా లేదని'' నరేంద్రుడ్ని సరిదిద్దింది. మరుసటి రోజు ఆ టీచర్ నరేంద్రుడు చెప్పిన సమాధానం సరైందేనని గ్రహించి తరగతి గదిలో అందరి ముందు నరేంద్రుడ్ని క్షమించమని అడగటం జరిగింది. అదే నేటి తల్లులైతే వెనుకా ముందు ఆలోచించకుండా మా అబ్బాయిని దండిస్తావా? అని ఆ టీచర్‌పై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తారు. భువనేశ్వరి వలే పిల్లల్లో సానుకూల దృక్పథం అలవరిస్తే పిల్లలు ప్రశాంత వాతావరణంలో పాఠాలు నేర్చుకుంటారు.

సానుకూల భావాల గురించి చెప్పుకోవాలంటే మన భగవద్గీతకు మించిన బోధన మరొకటి లేదు. మహాభారత సంగ్రామంలో మొదటి రోజునే అర్జునుడికి కౌరవ సైన్యాన్ని చూసి ముచ్చెమటలు పట్టాయి. కౌరవులంటే మా పెద్ద తండ్రి పిల్లలే కదా! వారితో యుద్ధం ఎలా చేయగలననే పిరికితనం ఆవహించింది. యుద్ధభూమిలోకి రాకముందే ఇవన్నీ అర్జునుడికి తెలియవా? దుష్టులను నిర్మూలించటం క్షాత్రధర్మమని తెలిసినా పిరికితనం ఆవహించింది. చెడుచేసిన వారిని శిక్షించాలని, మనో దుర్భలతను విడనాడి యుద్ధం చేయమని కృష్ణపరమాత్ముడు బోధించగానే అర్జునుడు సానుకూలంగా ఆలోచింది విజయం సాధించగలిగాడు. ఇలాంటి సానుకూల ధైర్యాన్ని పిల్లల్లో చిన్నప్పటి నుంచి నూరిపోయమంటారు స్వామి వివేకానంద. ఇలా సానుకూలంగా ఆలోచించే పద్ధతి నేర్పితే పిల్లలు



ఎలాంటి తప్పులు చేయరు. దీనివల్ల మానసిక, బుద్ధిబలం పెరుగుతుంది.

పిల్లలు పరీక్ష రాయటానికి వెళతారు. సరిగ్గా పరీక్ష గదిలోకి వెళ్లే ముందు ఎవరైనా పేపర్ ఎలా ఉంటుందో అని అనుకుంటూ వెళ్లటం సహజం. స్నేహితుడు ఎదురై పేపర్ చాలా కఠినంగా ఉంది అని అనగానే వెంటనే పిల్లల్లో ప్రతికూల భావాలు చోటుచేసుకుంటాయి. పేపర్‌లో వచ్చిన ప్రశ్నలు అన్ని చదివినవైనప్పటికీ ప్రతికూల ఆలోచనల వల్ల పరీక్ష సరిగా రాయలేరు. ఎప్పుడైతే ప్రతికూలంగా ఆలోచించటం మొదలుపెట్టగానే పిరికితనం ఆవహిస్తోంది. బలహీనులయిపోతారు. పరీక్ష సరిగా రాయకపోతే ఇంట్లో తల్లిదండ్రులు ఊరుకోరు. ఎలాగోలా రాసెయ్యాలనే ఆరాటంలో బుద్ధి పెడత్రోవపట్టి పక్కవారి పేపర్ చూసి కాపీ కొట్టాలనుకుంటారు. ఇలా తప్పులు చేయటానికి వెనుకాడరు. అందుకే స్వామి వివేకానంద చెప్పినట్లు ''మీరు దృఢంగా ఉంటే ఎలాంటి తప్పులు చేయరు'' అనే సానుకూల ఆలోచనకు అర్థం ఇదే. శరీరం, మనస్సు-రెండూ బలంగా ఉండాలి. శరీరం బలంగా లేని పిల్లలు మానసికంగా ఎదగలేరు. రెండూ బలంగలవారే ఘన కార్యాలు సాధించడానికి అర్హులు. అందుకే ఒక మనిషి గొప్పవాడని ఎప్పుడు అంటాం? ఎప్పుడైతే తాననుకున్న ఆదర్శాన్ని వదలకుండా, రాజీ పడకుండా జీవిస్తాడో అప్పుడే అతడ్ని సంఘం గౌరవిస్తుంది.

-హరిచందన



నిలువెత్తు నిదర్శనం..

సానుకూల దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం మహనీయుడు అబ్దుల్ కలామ్. ఒక ఆదర్శాన్ని తీసుకుని దాని గురించి కలలు కనమన్నారు. మీ వ్యక్తిత్వం అంతా ఆ కలతో మమేకం కావాలి. ఇదే విజయానికి మార్గం అని ఆయన చెబుతుంటారు. అలాంటి ఆయన జీవితంలో కూడా నిరాశ నింపిన క్షణాలు ఎదురయ్యాయి. అబ్దుల్ కాలమ్ యువకుడిగా ఉన్నప్పుడు వైమానిక దళ ఉద్యోగం కోసం అప్లయ్ చేశారు. కాని అది రాలేదు. పరీక్షలో ఫెయిల్ అయ్యారు. అందరి యువకుల్లాగానే ఆయనలోనూ నిరాశ మేఘాలు కమ్ముకున్నాయి. అలా ఆయన నిరాశతో హృషీకేశ్‌లోని శివానంద ఆశ్రమానికి వెళ్లారు. స్వామి శివానందను కలిశారు. నీ విచారానికి కారణమేమిటని స్వామి శివానంద అడిగారు. అపుడు అబ్దుల్ కలామ్ తన చిరకాల స్వప్నమైన వైమానికిదళం ఉద్యోగం గురించి చెబుతూ.. అందులో ఫెయిల్ అయిన విషయం గురించి చెప్పారు. అపుడు స్వామి శివానంద ఇలా చెప్పారు. 'నీ విధినంగీకరిస్తూ నువ్వు ముందుకు సాగిపో, నువ్వు విమానం నడపటానికి పుట్టలేదు. నువ్వేమి అవ్వాలో ఇప్పటికే నిర్ణయమై ఉంది. ఈ వైఫల్యాన్ని మర్చిపో. నీ భవిష్యత్తు వైపు నిన్ను నడిపించటానికి ఈ వైఫల్యం కూడా అవసరమేనని భావించి, భగవత్సంకల్పానికి తల వంచు' అని అన్నారు. స్వామి శివానంద బోధనతో అబ్దుల్ కాలామ్‌లో నిరాశ నిస్పృహలు పటాపంచలయ్యాయి. ఆ తరువాత ఆ భగవంతుడే ఆయనను ఏ వైపు నడిపించాడో మనందరికీ తెలిసిందే. వైఫల్యాన్ని సానుకూలంగా విజయసోపానంగా మలుచుకున్న ఆయన ఆ తరువాత ఈ ప్రపంచం మెచ్చిన అంతరిక్ష పరిశోధకుడయ్యారు.

మాతృభూమికి రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కామదుఘంబగు మనుజుల కాంక్షలు తీర్చున్



ఆసరా కోరే కళలు

తెలుగు నేలలో అన్ని జానపద కళారూపాలతోపాటు హరికథా గానం ఒక వెలుగు వెలిగి, ప్రజాభిమానాన్ని పొందింది. ఆంధ్రుల హరికథా చరిత్రలోనే హరికథ గానం ఒక అపురూపమైన స్థానాన్ని, అపారమైన గౌరవాన్ని పోగేసుకుంది. ఈ కళా ఖండాన్ని ఒక విశిష్ట కళారూపంగా తీర్చిదిద్దిన వారు విజయనగరం జిల్లాలోని ఆది బట్ల నారాయణదాసు. ప్రజలు కాలంతో పరుగిడుతూ జానపద కళలను ఆదరించడం మరుస్తున్నారు. కాని నేటి తెలంగాణ ప్రభుత్వం జానపద కళలను జాగ్రత్త చేయాలన్న బాధ్యతతో సాంస్కృతిక శాఖ వారు జానపద కళరూపాలను సేకరించడం ప్రారంభించారు. అటు ప్రభుత్వం చేస్తున్నట్టుగానే ప్రజలు కూడా జానపద కళలను ఆదరించడం ఆరంభిస్తే అటు ఆ కళాకారులకు భుక్తి ఇటు కళామ తల్లి సేవ చేసిన వారు అవుతారు. అపుడు హరికథలు, ఒగ్గుకథలు లాంటి ఎన్నో జానపద కళారూపాలు వెలుగులీనుతూ మన సంస్కృతీ వైభవానికి తార్కాణాలుగా నిలుస్తాయి.



వ్యూహం

39

అలపర్తి రామకృష్ణ



“ఆ మెను ఫినిష్ చెయ్యమని మీరు ఒక్క మాట చెప్పండి! ఈసారి ఆమె బయటకు వెళితే శవంగా మారిపోతుంది”

“నో..నో.. డోన్ట్ బి హర్రీ! తొందరపడి ఆమెను చంపేసే ప్రయత్నాలు చెయ్యకండి! ఆ ఐపిఎస్ ఆఫీసర్ స్కందకు కోపం వచ్చి మనమీద విరుచుకుపడతాడు.. ఇక్కడ హాస్పిటల్లో జరిగే అవయవాల మార్పిడి వ్యవహారం పోలీసులకు తెలిసిపోయింది. వాళ్ళు డేగ కళ్ళు మనమీద పడ్డాయి. తొందరలోనే ఈ హాస్పిటల్ అమ్మేసి మరో చోటకు షిఫ్ట్ అవబోతున్నాం! మనం ఇక్కడనుంచి షిఫ్ట్ అయ్యే ముందు అవసరం అయితే డాక్టర్ లోహితను ఫినిష్ చెయ్యొచ్చు” అన్నాడు అరవింద్.

కాశి కోపంతో ఊగిపోయాడు.

చేతిలో పిస్టల్ వుంటే డాక్టర్ అరవింద్‌ను, నిఘా విభాగం వాళ్ళిద్దరిని కాల్చేసేవాడు. అంతకోపం వచ్చింది.. లోహితకు అపకారం తలపెట్టేవాళ్ళంటే అతనికి శత్రువుల కిందే లెక్క!

“మరో ముఖ్యమైన విషయం సార్! రెండు రోజుల క్రితం ఐపిఎస్ ఆఫీసర్ స్కంద, ఈ ఏరియా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మన హాస్పిటల్ దగ్గరలో వున్న ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర రోడ్డుమీద కాపు కాశారుట చాలాసేపు. ఓ వ్యక్తి వచ్చి ఓ కవరు ఇచ్చాడట. ఆ కవరులోని కాగితాలను అక్కడే వున్న జిరాక్స్ సెంటర్‌లో కాపీలు తీశారట. ఆ కవర్ పట్టుకువచ్చిన వ్యక్తి హాస్పిటల్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడట.. మనిషి ఒడ్డు పొడుగును చూస్తుంటే పోలీసు కానిస్టేబుల్‌లా కన్పించాడట. ఆ పేపర్లు ఏమిటో తెలియడంలేదు. మీరు ఒకసారి చెక్ చేసుకోండి” అన్నాడు నిఘా విభాగం వ్యక్తి.

డాక్టర్ అరవింద్ ఆలోచనలో పడిపోయాడు.

ఎలక్ట్రీషియన్ అనగానే కాశితోబాటు తన గదిలోకి వచ్చిన వ్యక్తి గుర్తుకు వచ్చాడు. ఎసి రిపేర్ చెయ్యడానికి అతన్ని కాశి తీసుకువచ్చాడు. అతను తన గదిలోని కాన్ఫిడెన్షియల్ పేపర్లు కాజెయ్యలేదుగదా!

“మొన్న నువ్వు నా ఛాంబర్‌కు తీసుకువచ్చిన ఎలక్ట్రీషియన్‌ను ఎక్కడున్నా వెతికి పట్టుకురా! అన్నాడు అరవింద్ కాశివైపు చూస్తూ.

కాశి బయటకు వెళ్ళాడు.

కారిడార్‌లో కన్పించిన లెనిన్‌ను పక్కకు తీసుకువెళ్లి వెంటనే నువ్వు ఇక్కడనుంచి వెళ్లిపో! నువ్వు పోలీస్ కానిస్టేబుల్‌వని డాక్టర్ అరవింద్ గారికి తెలిసిపోయింది.. ఈ పరిసరాల్లో మళ్లీ కన్పించదు” అన్నాడు కాశి.

అతను వెళ్లిపోయాడు.

మళ్లీ అరవింద్ ఛాంబర్‌లోకి విచ్చేశాడు కాశి.

“వైర్ బండిల్ కొనుక్కురావడానికి ఖమ్మం వెళ్ళాడట. అతను తిరిగి వచ్చేక మీ దగ్గరకు తీసుకొస్తాను” అన్నాడు కాశి.

కాశిమీద ఎగిరిపడ్డాడు డాక్టర్ అరవింద్.

“ఎవడిని పడితే వాడిని హాస్పిటల్ స్టాఫ్‌గా, ఎలక్ట్రీషియన్‌గా ఆయాలా చేర్చుకోకూడదు. అన్నీ బుద్ధిలేని పనులే చేస్తావ్! వాడెక్కడ దొరుకుతాడు, ఎప్పుడో ఉడాయించేసి ఉంటాడు, మన వాళ్ళు వాడిని పోలీస్ కానిస్టేబుల్ అని గుర్తించేసరికి”.

తనను అనుమానించనందుకు స్థిమితపడ్డాడు కాశి.

“డాక్టర్ లోహిత చెల్లెలు సావేరి వాళ్ళింట్లో కన్పించడం లేదు”.

“సావేరి ఎక్కడికి పోతేం నాకేం? ఆ విషయాలు నాకు సంబంధం లేదు. అయామ్ కన్సర్డ్ విత్ హాస్పిటల్ ఇష్యూస్! అదర్ ఇష్యూస్ అరిఫ్ విల్ టాకిల్.. యూ బోత్ కన్సల్ట్ విత్ అరిఫ్” అని చెప్పేశాడు అరవింద్ వాళ్ళకు.

వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు

లాకర్ తీసి దాన్లో తాను ఉంచిన కాన్ఫిడెన్షియల్ డాక్యుమెంట్లు వున్నాయో లేదోనని చెక్ చేసుకున్నాడు డా. అరవింద్.

అన్నీ సేఫ్‌గానే వున్నాయి.

“వీటిని ఇక్కడ ఉంచకూడదు.. త్వరలోనే ముంబై తీసుకువెళ్తాను.. వీటిని అరిఫ్‌కు ఇచ్చేస్తే నాకు బిపి తగ్గుతుంది” అన్నాడు కాశితో.

‘షెల్ఫ్‌లో వున్న పేపర్లు చెక్‌చేశాడు. అవన్నీ కిడ్నీదాతలు ఇచ్చిన ధృవపత్రాలు.

“అన్నీ సేఫ్‌గానే వున్నాయి.. సర్వైలెన్స్ వాళ్ళు అనవసరంగా కంగారు పెట్టారు. ఇంజనీరింగ్ కాలేజీదగ్గర పోలీసు వెహికల్ ఆపి ఏవో పేపర్లు జిరాక్సు తీశారంటే అవి ఆ ఇంజనీరింగ్ కాలేజీకి సంబంధించినవై వుంటాయి” అనుకున్నాడు అరవింద్.

సూర్యపేటకు బాయె మాయన్న



అమ్మగారిల్లు అత్తగారిల్లు అనేవి మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీకలు. ఆడపిల్లకు పుట్టింటి మమకారం ఎక్కువగా ఉన్నట్టు నేటికి కనిపిస్తుంటుంది. ఆడపిల్లను పుట్టిన నాటి నుంచి ....ఆడ ... పిల్ల అని అన్నా బత కనివ్వకుండా చేసినా, అసలు పుట్టకుండా చేసినా కూడా ఆడపిల్లకు తన తోబుట్టువుల పైనా, తల్లి తండ్రుల పైనా అపారమైన ప్రేమ వాత్సల్యాలు ఉంటూనే ఉన్నాయి. ఈ పుట్టింటి ప్రేమలను జానపద గేయాల్లో బాగా కనిపిస్తాయి. అమ్మాయికి పుట్టిన పిల్లవాడు ఏడుస్తుంటే వాడిని ఊయలల్లో పడుకోబెట్టి నీకోసం నీ మేనమామలు ఏదో తెచ్చారని దాన్ని నీవు తీసుకోవడానికి తయారు గా ఉండాలని చెబుతూ దానికోసం నీవు మంచి నిద్ర పోయి శక్తివంతంగా తయారు కావాలని చెబుతూ వారిని జోకొట్టి ఏడుపు పోగొట్టి నిద్రపుచ్చుతుంటారు. అట్లాంటి పాటల్లో మచ్చుకు మేనమామ గురించి పాటను చూద్దాం

అబ్బాయి మామలు యెటువంటి వారు
నిలువుబొట్టుల వారు నియ్యోగి వారు
అంచు పంచెల వారు అంగీల వారు
పట్టుపంచెల వారు పాగాల వారు
చెవిచెలికి చేరడేసి పోగుల్ల వారు
పెసర కాయల వంటి పెదిమల్ల వారు
కందికాయల వంటి కనుబొమల వారు
మిరప కాయల వంటి మీసాల వారు
వారు మా అబ్బాయి మేనమామల్లు...
మా పాప మామల్లు మత్స్యావతారం
కూర్చున్న తాకల్లు కూర్మావతారం
రక్షించు మామయ్య రామావతారం
వర్ధిల్లు పసిపాప వర్ధిల్లు తండ్రి
లాలి, లాలి, లాలమ్మ, లాలీ
అబ్బాయి మామల్లు ఎటువంటివారు
ఎక్కంగ తెచ్చేరు ఎర్రగుర్రాలు
పట్టంగ తెచ్చేరు పట్టుగొడుగల్లు
పులిగోరు పతకాలు పూసలా పేర్లు
అబ్బాయి మామల్లు తెచ్చి యిచ్చేరు ...

ఇలా మేనమామల గొప్పతనాన్ని ఈ పాటలు చెబుతాయి. అంతేకాదు మేనమామ బాధ్యతను చెప్పే సామెతలూ కూడా జానపదంలో కనిపిస్తాయి. బావమరిది బతుకగోరుతాడని, తల్లి వెనుక తల్లంతటి వాడు మేనమామ అని మేనమామ ప్రాశస్త్యాన్ని తెలుపుతారు.

సూర్యపేటకు బాయె మాయన్న
సూసిన రైకలు దెచ్చె మాయన్న
నల్లగొండకు బాయె మాయన్న -
నక్కి రైకలు దెచ్చె మాయన్న
పట్నంబాయె మాయన్న -
పట్టు చీరలు దెచ్చె మా యన్న
ముగ్గురన్నల తోటనే బుట్టినాను -
నానడుము మువ్వంచు చీర గోరింది
నలుగురన్నల తోడనే బుట్టినాను -
నా నడుము నల్లంచ చీర గోరింది
....

ఇలా అన్నదమ్ముల అక్కచెల్లెళ్ల అనుబంధం ఒక్కనాటిది కాదు. కులాలనుబట్టి కాదు, మతాలను పట్టికాదు అక్కచెల్లెళ్ల మీద ప్రేమ ఒక్కరకంగానే ఉంటుంది.

మా మల్లు చందమామల్లు
నాయన్న మామల్లు రామలక్ష్మణులు
పాలుతాగేవాడు పారాడేనాడు
పాడియావు పంపించు నీకు మీ మామ....

ఇంతటి ప్రాధాన్యం ఇచ్చిన మేనమామలు కొన్ని ప్రాంతాలల్లో వారి అక్కకూతుర్లనే పెళ్లిళ్లు కూడా చేసుకోవడం ఉంది.

ఎన్నివిధాలు తరచి చూసినా మేనమామ ప్రాధాన్యత తండ్రి కంటె ఎక్కువనే తెలుస్తుంది. మెట్టినిల్లు చేరిన తన అక్కను ఇంటికి తీసుకొనిరావడం ఒడిబియ్యం పోయడం, పండుగకు పిలవడం సారె పెట్టడం మేనల్లుళ్లను, మేనకోడళ్ల ముచ్చట్లు తీర్చడంలో మేనమామదే పైచేయిగా కనిపిస్తుంది.

- డా. దాసరి రంగ

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి వుంటుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్నివిధాలా సుఖాన్ని పొందుదురు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
ఋణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుండును. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది. చేసే పనులలో కొన్ని ఇబ్బందులు వస్తాయి. తలచిన కార్యాలన్నియు శ్రమపడి విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్న లోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
కుటుంబంలో సుఖ సంతోషాలుంటాయి. ధనధాన్యాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు విజయాన్ని సాధిస్తారు. ప్రయత్న కార్యములు ఫలిస్తాయి. గృహంలో జరిగే మార్పులు సంతృప్తినిస్తాయి. బంధు మిత్రులతో కలుస్తారు. ప్రయాణాలు లాభదాయకంగా వుంటాయి.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్థులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
తలచిన కార్యాలన్నియు విజయవంతంగా పూర్తిచేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్య బాధలుండవు. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి వుంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు. అనవసర వ్యయ ప్రయాసలవల్ల ఆందోళన చెందుతారు. తీర్థయాత్రలకు ప్రణాళిక వేస్తారు.

నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ. జందెమింపుగ వేసి సంధ్య వార్చిన నేమి
బ్రహ్మమందక కాడు బ్రాహ్మణుండు
తిరుమణి శ్రీ చూర్ణగురురేఖ లిడినను
విష్ణు నొందక కాడు వైష్ణవుండు
బూదిని నుదుటను బూసికొనిన నేమి
శంభు నొందక కాఁడు శైవ జనుఁడు
కాషాయ వస్త్రాలు గట్టి కప్పిన నేమి
యాస పోవక కాఁడు యతివరుండు
తే. ఇట్టి లౌకిక వేషాలు గట్టుకొనిన
గురునిఁ జెందక సన్ముక్తి, దొరకఁబోదు
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: ముచ్చటైన జందెం ధరించినా, బ్రహ్మతత్త్వం తెలీకపోతే బ్రాహ్మణుడు కాలేదు. నొసటి పైన తిరుమణి శ్రీచూర్ణాలతో ఎగువరేఖలు దిద్దుకున్నా విష్ణుతత్త్వం తెలియకపోతే విష్ణుభక్తుడు కాలేడు. విబూది పట్టెలు నొసటిపై తీర్చుకొన్నా, పరమ శివతత్త్వం తెలియకపోతే శైవుడనిపించుకోడు. ఒంటిపై కాషాయ వస్త్రాలు కట్టుకోగానే సన్యాసి కాదు ఆశల్ని జయించినవాడే యతి.

ఆశ ఖరీదు అణా

గోరాశాస్త్రి గారి రేడియో నాటిక

వినమరుగైన..



యు: ఏం మిగిలిందండి?

తా:చెప్పానుగా! శరీరంలో రకరకాల జబ్బులూ, తొమ్మండుగురు పిల్లలూ, వాళ్ళకి నామీదుండే వల్లమాలిన అభిమానం. ఇదీ నా ఆర్జన!

యు:జరిగిందానికంతకీ యిపుడు విచారిస్తే ఏం లాభం చెప్పండి!

తా:ఛాఛా! ఎంతమాటన్నావు! విచారమా! అది నా జన్మలో లేదు. జరిగింది చెప్పానంతే. లాటరీ వేశాం, ఓడిపోయాం! ఇంకోరకం లాటరీ ఉందేమో ప్రయత్నించి చూడమంటున్నాను.

యు:కనీసం ఇదంతా లాటరీ అని మీ నమ్మకం?

తా:అది నా అనుభవం. సిద్ధాంతం కాదు. చూడ బ్బాయ్! నా తత్వానికి సరిపడని విషయాలు నా చేత పేలిస్తున్నావు. మామూలు విషయాలేమైనా చెప్పు.. భోజనం అయిందా?

యు:ఎప్పుడో అయిదండి. మళ్లీ ఎప్పుడో తెలీదు.

తా:చాలా విషయాలు అలా తెలియకుండా వుంటేనే మంచిది. ప్రతిదీ తెలిసిపోతే ఆరోగ్యం బాగుండదు.. ఎవరదీ ఆ చీకట్లో(గట్టిగా) ఎవరక్కడా?

కృష్ణమూర్తి: (సమీపిస్తూ) నేనండీ కృష్ణమూర్తిని. ఎరగరూ- బాంకులో పని.

యు:ఓహో ఇందాకా సైకిల్ తీసుకెళ్ళారుమీరేనా?

కృ: మరేనండి! కొత్త సైకిలు కొని ఇంకా నెల కాలేదు.. అది సరేకానండి, ఇప్పుడెక్కడేనా దుకాణాలుంటాయా, దుకాణాలు?

తా:ఎందుకు నాయనా ఆ కంగారూ? ఏవొచ్చింది? ఏం దుకాణం కావాలి?

కృ:మా ఆవిడండి, ఇందాక భోంచేసేవరకూ హాయిగానే ఉంది. ఉన్నట్టుండి వచ్చేశాయండి బాబూ! చంపేస్తోంది!

యు:ఏంవొచ్చేశాయి?

కృ:మెల్లిగా అంటారేవిటండీ బాబూ! చస్తూంటే నరా! తుమ్ములండీ తుమ్ములు! ఏకతుమ్ములు! దానిమీద జలుబూ! ఊపిరాట్టం లేదనుకోండి! ఏం చెయ్యమంటారు తాతగారూ!

తా:ఓ అరగంట ఊపిరి పీల్చడం మానెయ్యమనండి! అదే తగ్గుతుంది!

కృ:అదెలా కుదురుతుందండీ! చెప్పండీ! దుకాణాలు ఉంటాయా?

యు:ఉంటే ఏం చేస్తారు?

కృ:ఏదైనా మందు కొనుక్కొస్తాను. వెంటనే మందు పడితే మంచిది చూడండి!

యు:ముందు తక్షణం ఏం చేశారు?

కృ:ఏం చెయ్యను? స్వెట్టరు తొడుక్కోమన్నాను. తలకి మఫ్లరు చుట్టుకోమన్నాను.

తా:అబ్బే అలా అశ్రద్ధ చేయకండి.

కృ:అయితే ఇంకేం చెయ్యమంటారు?

తా:కిటికీ తలుపులన్నీ వేసెయ్యండి. ఒక్క పిసరు గాలి తగిలినా ప్రమాదం-

కృ:అవునండి-అసలే అర్భకురాలు.

తా:నాకు తెలియదుటయ్యా! రోజూ చూస్తున్నానుగా. అవునా- గది నిండా సాంబ్రాణి పొగ వేసి దీపాన్నీ వెలిగించెయ్! ఆ తరువాత మందుల షాపునుండి మందు కొనుక్కెళ్ళు!

కృ:అలాగేనండి! వెళ్లొస్తాను మరి!

యు:చూడండి! ఇంకో చిన్న జాగ్రత్త తీసుకుంటే ఇంకా మంచిది. మీ ఇంట్లో గరుడ పురాణం వుందా?

తా:ఇప్పుడప్పుడే కాదులే అది- నే చెప్తాగా- ముందు నువ్వు వెళ్లిరా నాయనా!

కృ: వస్తానండి మరి!

యు:అభిమానం అంటే అలాగుండాలి తాతగారూ! నాకే గనక ఇలాంటి నాన్నుంటేనా?

తా:ఉంటే?

యు:బతుకు ఇంతకంటే ఇంకొంచెం రుచిగా ఉండేదేమో! మా నాన్న ఏం చేసేవాడో తెలుసా తాతగారూ! ఇంట్లో ఎవరికైనా కాస్త జబ్బుగా వుంటే వెళ్లి వీధరుగుమీద కూర్చునేవాడు. అమ్మకి జ్వరం వస్తే కోరి తెచ్చుకున్నానని పట్టుకు తన్నేవాడు.

తా:సబబుగానే వుంది. జబ్బు తెచ్చుకోవడం నేరం- నేరానికి శిక్షవేసేవాడు- తప్పేం?

యు:బాగా చెప్పారు. ఈ ధర్మసూక్ష్మం నాకిన్నాళ్లూ తెలియలేదు.

తా:సరే- ఒక్కసారి లోపలికి వెళ్లి పరిస్థితి ఎలా ఉందో చూసొస్తాను. ఇంక వెళ్లి పండుకుంటావా?

యు:నిద్రరావడంలేదు. మీరు వెళ్లిరండి. బహుశా మీరు తిరిగి వచ్చేవరకూ ఇక్కడే ఉంటాననుకుంటాను.. చెప్పలేను.

తా:సరేలే- నిద్రపో! దాన్ని మించిన సుఖం లేదు.

∷∷

యు:అంటాడు తాతగారూ. కాని నిద్ర రావద్దూ! ఆ అమ్మాయి కృష్ణవేణి చెప్పినట్లు ఇలాంటప్పుడు రెండో ఆటో, లేకుంటే మూడో ఆట సినిమా చూసి, నడిచి ఇంటికి వస్తే ఎంత హాయిగా ఉంటుంది! సినిమాకి డబ్బులే ఉంటేనా! అంతపనీ చేసుండేవాణ్ణి. ఇన్ని కబుర్లూ చెప్పి యీపాటికి గుర్రుపెట్టి నిద్రపోతూ ఉండుంటుంది. ఆ ఇందిర ఎవరో గాని ఆవిడకి ఇవాళ నిద్రాభంగం ఉండకూడదు మరి!

∷∷

కృష్ణవేణి:ఇందిరా?

ఇంది:ఏం కృష్ణవేణీ! రా, లోపలికి రా! ఇంత రాత్రివేళ వచ్చావేం? ఏదైనా కావాలా?

కృ: అబ్బే ఏం తోచక వచ్చాను. నిద్రపోతున్నారా? అమ్మ వంట్లో ఎలా వుందీ?

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ 1559

1		2		■	■	3
	■		■	4		
5		■	6		■	
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:

1. అయ్యంకి వెంకట రమణయ్య పేరు చెబితే గుర్తొచ్చేది
4. వూపిరి
5. కరవాలము
6. మత్స్యము
9. అటుగా అవకాశము
10. పార్వతి
12. జెండా
14. కీడు, హాని

నిలువు:

1. వెదురుమొలక, కట్ల తీగ
2. లలిత మధ్యలోపోయింది
3. బ్రహ్మ, చంద్రుడు
4. స్వయంగా మొట్టమొదటకలిగే జ్ఞానం
7. రసన
8. చెద పురుగు , బదినక
11. మరిచిపోము, ఓ సుగంధపు ఆకు
13. వెదురుతట్ట

మాటాట -1558 సమాధానం

1 యా	త	2 న	■	3 రాం	షా	■
■	■	4 గ	5 యా	రాం	■	6 బ
7 గో	■	■	త	■	■	ళ్ళా
8 దా	మ	ము	■	9 కు	మ్మ	రి
వ	■	■	10 నా	వ	■	■
రి	■	11 మ	ర	ల	■	■
■	12 ప	గ్గం	■	13 యం	త్ర	ము


రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి శుక్రవారం, 9 ఫిబ్రవరి 2018

అందరినీ ప్రేమించు- అందరినీ సేవించు



"పుట్టపర్తి యన్న పుడమి వైకుంఠంబు

వెలసి ఉన్నాడు విష్ణుమూర్తి ... అంటూ ప్రపంచం నలుమూలలనుండి పుటపర్తికి నేటికీ జనం వస్తూనే ఉన్నారు. మాతృమూర్తి ఈశ్వరాంబ భగవాన్ బాబా ఆదిలోనే "నీకార్యక్రమములన్నీ ఈ భూమి మీదే అంటే దుటపర్తి నుంచే అన్ని కార్యాలన్నీ చేయము. దీన్ని విడిచి నీవు ఎచ్చటకు పోరాదు" అన్ని తల్లి వ్యాక్యాన్ని విస్మరించి బాబా ఎన్నడూ కాలు కదపలేదు. సత్యసాయి విశ్వవిద్యాలయం, సత్యసాయి వాటర్ ప్రాజెక్టు, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, విశ్వసందర క్రీడామందిరం నక్షత్రశాల మొదలైన అపూర్వ నిర్మాణాలు పుటపర్తివాసులకోసం బాబా చేపట్టారు. బాబా సర్వాంతర్యామి తన భక్తులెక్కడెక్కడ ఉన్నా అక్కడక్కడే వారి పక్కనే ఉన్నట్లుగా భావన కలిగించేవారని బాబా భక్తులంటారు.

స్వచ్ఛ కీర్తి

ఒక మంచి పని చేయడంవల్ల పదిమంది మెచ్చుకొంటారు, ఇదే ప్రశంస, దీనినే కీర్తి అంటారు. కీర్తించడం అనే మాటకు పొగడడం అనే అర్థం కూడా వుంది. ఈ కీర్తి ఒక్కచోట ఉండదు. ఆనోటా ఈనోటా పడి దశ దిశల్లో వ్యాపిస్తుంది.

కీర్తిగానీ, అపకీర్తిగానీ మహావేగంగా పయనిస్తుంది. క్షణాల్లో ప్రపంచమంతా తెలిసిపోతుంది. అపకీర్తి వస్తే తట్టుకోలేరు. బాధపడుతారు. కాని కీర్తి వస్తే మహాసంతోషం వేసింది అంటారు. మరి సంతోషం కలిగే పనులు చేస్తున్నారా అంటే ఆలోచిస్తారు. అందుకే ఏపనినైనా ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. నలుగురి మంచి కోరి చేయాలి. స్వార్థం విడనాడాలి. తను ఒక్కడే బాగుండడం కాక నలుగురూ బాగుండాలని కోరుకోవాలి. అట్లాంటి మంచి ఆలోచనలు కలిగి ఉంటే కీర్తి దానంతట అది వస్తుంది.

పరీక్షలో విద్యార్థి ప్రథమ శ్రేణిలో ప్రప్రథమంగా నిలిచాడు. ఇది అతని కీర్తికి కారణ మవుతుంది. అదే తాను చదువుకుంటూ తనతో చదువుకునేవారిలో ఎవరైన వెనుకబడి ఉంటే వారికి కూడా చదువు చెప్పి సులువు మార్గాలు చెప్పి వారిని కూడా పరీక్షల్లో కృతార్థలను చేయడంలో సాయం చేస్తే ఇపుడు వచ్చిన కీర్తి కన్నా ఎక్కువ కీర్తి వస్తుంది. సాయం పొందినవారు మరింత మందితోనీ సాయగుణాన్ని చెప్తారు. పైగా వారు కూడా నీలాగా మారడానికి ప్రయత్నిస్తారు. ఇపుడు ఎక్కువ మంచి జరిగింది కనుక ఎక్కువ కీర్తి వస్తుంది. అట్లా అని కీర్తి కోసమే పని చేయకూడదు. అది కృతిమంగా మారుతుంది. అది మంచి కీర్తిని సంతృప్తి నివ్వదు. పరిశోధనలో శాస్త్రవేత్త స్వైన్‌ఫ్లూ ఔషధాన్ని కనుగొన్నాడు. వ్యవసాయంలో బాగా దిగుబడి వచ్చే వంగడం కర్షకుడే పదిమందికి అందించాడు. తన పరిశ్రమలో యజమాని నాణ్యమైన ఉత్పత్తులు తీస్తున్నాడు. యుద్ధంలో అగ్రభాగాన నిలిచి సైన్యాధికారి శత్రుసేనలను తరిమేశాడు. చెట్లనుంచి వాహనాలకు పయోగించే ఇంధనాన్ని తయారుచేసే విధానాన్ని ఓ యువ మేధావి కనుగొన్నాడు. మనస్సులోకి దురాలోచనలు రాకుండా నిరోధించే పరికరాన్ని ఓ మనస్తత్వశాస్త్రవేత్త లోకం ముందుంచాడు. ఇంకేం! వీళ్లందరినీ లోకం కీర్తిస్తుంది. వీరి కృషిని తరతరాల వారికి అందిస్తుంది. కనుక ఇట్లాంటి ఆదర్శవంతమైన పనులు చేస్తే అది మన దేశ గౌరవాన్ని ఇనుమడింపచేస్తాయి. ప్రపంచదేశాల్లో మన జాతి ఉన్నతిని పెంచుతాయి. ఇలా చేసిన వారి అనుభవాలు తరువాతి తరాలకు పాథేయాలు కావాలని అందరూ కోరుకుంటారు. నాకు అధికారముంది, జ్ఞానముంది, ధనముంది, శక్తివుంది, నేను వీటిద్వారా ఈ లోకానికి ఉపయోగపడాలి అనే ఉద్దేశంతో, ప్రేమతో సేవ చేయాలి. మనస్సు, కీర్తివల్ల వచ్చే ప్రశంస రెండూ స్వచ్ఛంగా ఉండాలి. అలాంటి స్వచ్ఛమైన కీర్తే నిజమైన కీర్తి.

- జి. కల్యాణి

ఆవేశం విడువు ఆలోచనతో నడువు

"ఆవేశం విడువు ఆలోచన తో నడువు"అని పెద్దలు చెబుతుంటారు. ఆవేశం వస్తే కోపం వస్తుంది. కోపం వివేకాన్ని నశింపచేస్తుంది. తన కోపమే తన శత్రువు అని శతకకారుడు చెప్పాడు. ఏ పురాణాన్ని చూసినా ఆవేశంతో చేసిన పనులు అనర్థదాయకాలుగానే కనిపిస్తాయి. అదే ఆలోచనతో చేసినవి అర్థాన్నే కాదు పరమార్థాన్ని కూడా కలుగచేస్తాయి.

కౌరవులు పాండవులు అన్నదమ్ములైనా వారి మధ్య ఈర్ష్యాసూయలతో పాటు ద్వేషం కూడా రాజుకుంటుంది. కౌరవుల్లో దుర్యోధనుడు పేరుకి పెద్దవాడైనా బుద్ధిలో అందిరి కన్నా తక్కువైనవాడే. దానికి తోడు




శకుని మామ, కర్ణుడనే మిత్రుడు, తమ్ముడనే దుశ్శాసనుడు చేరి దుర్యోధనుని బుద్ధిని చెడగొడుతుంటారు. వారు చెప్పింది విని ఆలోచనే లేకుండా ఆవేశంతో ఎన్నో కుయుక్తులు పన్నుతాడు. కాని అవి అన్నీ కూడా విఫలమవుతాయి. అంతే కాదు దుర్యోధనునిడి మరింత అవమానం పాలైట్లు కూడా చేస్తాయి.

అట్లానే రావణుడు కూడా ఆయన చెల్లెలు శూర్పణఖ చెప్పిన విషయాన్ని వింటాడు. మరో ఆలోచనే లేకుండా సీతాపహరణానికి కుట్రలు పన్నుతాడు. దీనికి సాయంగా ఆయనకు ఎదురు చెప్పనివారి సలహాలు తీసుకొంటాడు. మంచి పనికాదు అనిచెప్పిన వారి మాటలను పెడచెవిన పెడుతాడు. దాంతో సీతాపహరణ చేయగలిగాడు. కాని ఆమెను కనీసం తనతో మాట్లాడించుకోలేకపోయాడు. అంతేకాదు రాముని చేతిలో సర్వనాశం చెందాడు. తానే కాదు తన వంశం అంతా నాశనం అయ్యేలా చేసుకొన్నాడు. దీనికి కారణం ఆవేశమే కాని ఆలోచన కాదు.

ఒక్కక్షణం తాను చేస్తున్న పనేమిటో ఒకసారి ఆలోచించి మంచి పనో కాదో వివేకంతో పరిశీలించుకుంటే ఇంత అనర్థం జరిగేది కాదుకదా.

అందుకే నేటి యువత కూడ చేసే పనిని పూర్తిగా అర్థం చేసుకొని దానివల్ల మంచిజరుగుతుందా లేదా అని ఒకటికి పదిసార్లు ఆలోచించి చేస్తే మంచి జరుగుతుంది. అందుకే పెద్దలు ఆవేశంతో కాక ఆలోచనతో నడువు అంటారు.

- చరణ శ్రీ



శ్లో: అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనంధ్రువమ్।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం॥

అష్టాదశ పురాణాల్లోని వ్యాసుని మాటలన్నీ సత్యాలే. పరులకుపకారం చేయడం పుణ్యం, పరులను పీడించడం పాపం.

ఇది వారి సమగ్ర సాహిత్య తాళానికి తాళంచెవి. దేనినైనా చేయండి. కాని చేసే ముందు ఒకసారి ఆగి ఆలోచించండి. మన చేస్తున్నది ఏది పాపమో! ఏది పుణ్యమో తెలుసుకోండి! చాలు! ఆ తర్వాత పాపంలో మునుగుతారో, పుణ్యంలో తేలుతారో మీ ఇష్టం. అన్నారు అంతా మనిష్టమే అన్నమాట.

యాజ్ఞసేని 32



త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

కుమ్మరి ఇంట్లో ప్రవేశించిన పాండవులు, ద్రౌపది శయనించి ఉండటాన్ని చూస్తాడు దృష్టద్యుమ్నుడు. అలా పరుండిన పాండవులు సేనాధికారుల గురించీ, దివ్యాస్త్రాల గురించి, రథాలు, ఏనుగులు, ఖడ్గాలు మొదలగువాటి గురించి మాట్లాడుకొనటం వింటాడు. వారలా మాట్లాడుకొనటం పాంచాలి కూడా విన్నది. పాండవులు మాట్లాడుకొన్న విషయాలను వినిన దృష్టద్యుమ్నుడు అక్కడనుండి బయలుదేరి తండ్రి వద్దకు వెళ్ళాడు. ద్రుపదుడు విచారంతో ఉన్నాడు. దృష్టద్యుమ్నుని చూచి "ద్రౌపది ఎక్కడికి వెళ్లింది? ఎవరు తీసికొని వెళ్ళారు? నా పుత్రికను గెలిచినవాడెవడు? పాండు పుత్రులు బ్రతికే ఉన్నారా? నేడు మత్స్యయంత్రాన్ని ఛేదించినవాడు పాండవ మధ్యముడైన అర్జునుడేనా? అని ఆత్రుతతో అడిగాడు.

తండ్రి ఆత్రుతని చూచి దృష్టద్యుమ్నుడు "వింటిని ఎక్కుబెట్టి లక్ష్యాన్ని పడగొట్టిన ఆ యువకుడు బ్రాహ్మణ శ్రేష్ఠుడు. ఎవ్వరిని కలయక వేగంగా నిష్క్రమించాడు" అని అన్నాడు దృష్టద్యుమ్నుడు.

"అయితే ద్రౌపది ఏమయింది?" అడిగాడు ద్రుపదుడు.

"ద్రౌపది మిక్కిలి ప్రసన్నతతో అతడిని అనుసరించింది. అప్పుడు దానిని సహించలేని రాజులందరూ అతడిని, అతడితోయున్న మరొకడిని ముట్టడించారు. ఆ యిద్దరూ కలిసి ఆ రాజ సమూహాన్ని ఎదుర్కొని వారు వెనుకకు తిరిగి పారిపోయేటట్లుగా చేశారు. అందరూ చూస్తుండగానే వారు ద్రౌపదితో కలిసి నగరానికి వెలుపలనున్న ఒక కుమ్మరివాని ఇంటిలోనికి ప్రవేశించారు" అని చెప్పాడు దృష్టద్యుమ్నుడు.

"ఆ ఇంటియందు మరెవరున్నారు?" అడిగాడు ద్రుపదుడు.

"ఆ ఇంటిలో అగ్నిశిఖతో సమానంగా వెలుగుచున్న ఒక స్త్రీ ఆసీనురాలై యున్నది. ఆమె ఆ వీరుల మాతృమూర్తి కావచ్చును. ఆమె ప్రక్కనే మరి ముగ్గురు వీర పురుషులు కూర్చొని ఉన్నారు. ఇంటిలో ప్రవేశించగానే ఆ ఇద్దరు వీరులు తల్లి పాదాలకు నమస్కరించి ద్రౌపదిని కూడా నమస్కరించమన్నారు.



ఆమెను తల్లికి అప్పగించి ఆ ఐదుగురు కలిసి భిక్షాటనకు వెళ్లిపోయారు" అని అన్నాడు దృష్టద్యుమ్నుడు.

"ఆ తరువాత ఎప్పుడు తిరిగి వచ్చారు?" అడిగాడు ద్రుపదుడు.

"వారు భిక్షాటన ముగించుకొని తిరిగి వచ్చారు. తల్లికి నమస్కరించారు". ఆమె ద్రౌపదిని చూసి-

"రాకుమారి! తెచ్చిన భిక్షాన్నాన్ని దేవతలకు బలిగా కొంత భాగాన్ని, బ్రాహ్మణులకు కొంత భాగాన్ని యిమ్ము. మిగిలిన దాన్ని రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని ఆ మహాకాయుడికి వడ్డించి తక్కిన భాగాన్ని మా అయిదుగురికి వడ్డించి, చివరిగా నీవు భుజింపుము" అని అన్నది. ఆమె ఆజ్ఞ ప్రకారం ద్రౌపది నడుచుకొన్నది" అని వివరించాడు దృష్టద్యుమ్నుడు.

"వారి గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు ద్రుపదుడు.

"భోజనానంతరం ఆ అయిదుగురు ఒక ప్రక్కగా శయనించారు. వారి పాదాలచెంత ద్రౌపది శయనించింది. అలా పడుకొని ఆ వీరులు యుద్ధ నైపుణ్యాల గురించి, మధ్య మధ్య విచిత్రాలైన కథలు చెప్పుకొన్నారు. వారి మాటలను బట్టి వారు క్షత్రియులు అనక తప్పదు. వారు బ్రాహ్మణులుగానీ, శూద్రులు గానీ కారు" అని అన్నాడు దృష్టద్యుమ్నుడు.

"క్షత్రియులైతే వారెవరై ఉంటారు?" అడిగాడు ద్రుపదుడు.

"వారి మాటలను బట్టి ఆ అయిదుగురు తప్పక పాండవులై ఉంటారు. ఆమె వారి తల్లి కుంతీదేవి అయి వుంటుంది. లాక్షగృహం నుండి తప్పించుకొని బ్రాహ్మణ వేషధారులై కాంపిల్యంలో దాగియున్నారన్నది నిశ్చయమని చెప్పవచ్చును" అని అన్నాడు దృష్టద్యుమ్నుడు.

అంత ద్రుపదుడు తన పురోహితుని పిలిపించి అతడిని వెంటనే కుమ్మరి యింటికి పోయి అక్కడ వున్నవారు పాండుపుత్రులైన పాండవులేనా తెలిసికొని రమ్మన్నాడు.

ద్రుపద పురోహితుడు బ్రాహ్మణ సమూహంతో పాండవులున్నచోటికి వచ్చి ధర్మరాజును చూస్తాడు. భీమసేనుడు ఆ ద్రుపద పురోహితునికి అర్ఘ్యాదిపూజలు సమర్పించాడు. అంత ఆ ద్రుపద పురోహితుడు ధర్మరాజుతో-

"గొప్ప తేజస్సుతో ప్రకాశిస్తున్న మహానుభావా! ద్రుపద మహారాజు మీ కులగోత్రాలను, మిమ్ముల గురించి తెలిసికొనాలని ఆసక్తుడై వున్నాడు. ఆ రాజుకు సంతోషం కలిగే విధంగా నాకు తెలయజేయండి. ఆశ్చర్యకరమైన మత్స్యయంత్రాన్ని తన పరాక్రమంతో పడగొట్టిన ఆ మహావీరుడిని చూడ మా రాజు ఆరాట పడుచున్నాడు" అని అన్నాడు.

"మీ రాజు ఆలోచించి ఎంతో సులువైన నియమాన్ని చేసి, మత్స్యయంత్రాన్ని పడగొట్టిన వీరుడే తన కూతురుకు భర్త అవుతాడన్నాడు. అతడు చెప్పినట్లుగానే మత్స్యయంత్రాన్ని పడగొట్టి, ఇదిగో ఇతడు ఈ కన్ను రాజులందరి సమక్షంలో గ్రహించాడు. ఇపుడు మీ రాజు తెలిసికొనటం ఎందుకు? తెలిసికొని ఏమి చేస్తాడు?

- ఇంకావుంది

షోడశావతారుడు

దత్తాత్రేయుడు అత్రి చేసిన తపఃఫలం, అనసూయ చేసిన కర్తవ్యనిష్ఠా ఫలం రెండూ కలసి దత్తాత్రేయులుగా రూపుదిద్దుకొంది. అనుసూయ పాతివ్రత్యాన్ని పరీక్షించాలి లక్ష్మీపార్వతీసరస్వతులు ముచ్చటపడ్డారు.వారికి నారదుడు తోడయ్యాడు. అమ్మా ఆ అనసూయమ్మ ఇనుపగుగ్గిళ్లను ఉడికించిన తల్లి. ఆమెను పరీక్షించాలనుకొంటే ఏదైనా ఉపద్రవం వస్తుందేమో అని కూడా తన తప్పులేకుండా చెప్పాడు. కాని ఆ ముగ్గురమ్మలు తమ తమ పతిదేవులను అనసూయ దగ్గరకు పంపించారు.



త్రిమూర్తులు వివస్త్రవై తమ ఆకలిని తీర్చమని కోరారు. అనసూయ సరే నంది. తన పతిదేవుని స్మరించుకుంది.త్రిమూర్తులను పసిబాలురుగా మార్చింది. వారికి స్తన్యమిచ్చింది. వారి ఆకలి తీరింది. వారిని ఊయల్లో పడుకోబెట్టింది. తాను తన పని చేసుకొంటూ ఉంది. కాని ముగ్గురమ్మలమే తమకు పతిభిక్ష పెట్టమని వచ్చారు. అక్కడ ఆ ఊయల్లో ఉండేవారే మీ వారు తీసుకొని వెళ్లండి అంది అనసూయమ్మ. వారు విచిత్రంతో చూసి ఆపని మాకు రాదు నీవే దయతలచి మా పతిదేవులను అనుగ్రహించుము. మా అజ్ఞానంతో ఇలా ప్రవర్తించాము అని చెప్పుకున్నారు. చిరునవ్వుతో వారిని చూసింది. తన పతిదేవుని స్మరించుకొని బాలకులపై నీళ్లు చల్లింది. వారు త్రిమూర్తులగా యథారూపం ధరించారు. సతీసమేతులైన త్రిమూర్తులు అత్రి అనసూయల కోరిక తీరుస్తామన్నారు. మీ ముగ్గురు మాకు తనయుడై పుట్టమని అడిగారు. ఆ త్రిమూర్తుల వరఫలమే దత్తాత్రేయులు. ఆ దత్తాత్రేయులే షోడశావతారులు.ఆ షోడశ అవతారాలు

యోగరాజు: కార్తిక పున్నమి బుధవారం మొదటి ఝాములో మొదటి యామంలో యోగిరాజుగా అవతరించారు.

అత్రివరదుడు: అత్రివతాశనుడై ఇంద్రియాలను, మనస్సునూ నిగ్రహించి ఒంటికాలుపై యోగిరాజునే ధ్యానించాడు. నీవంటి పుత్రుడు కావాలని కోరుకున్నాడు. ఆయన తపస్సుకు మెచ్చి త్రిమూర్తులు దర్శనం ఇచ్చారు. వారు అత్రికోరికానుసారం అత్రివరదులుగా దర్శనం ఇచ్చాడు.

శ్రీ దత్తాత్రేయుడు ; అత్రిఅనసూయలు చేసే లోకోపకారానికి ముగ్ధుడైన దత్తాత్రేయులే కార్తిక బహుళ విదియ మృగశిర నక్షత్రం నాడు దత్తాత్రేయులుగా ఉద్భవించారు.

- ఇంకా ఉంది

తవ్వినకొలదీ తరగని గనులెన్నో



పురాణాల్లో శాస్త్రవిజ్ఞానం

డా॥ గుడిపాటి వి.ఆర్.ఆర్.ప్రసాద్

భారద్వాజ మహర్షి: బృహస్పతి పుత్రుడు ద్రోణాచార్యుని తండ్రి అయిన ఈయన అనేక శాస్త్రగ్రంథాలను రచించారు. అందు 'అంశుబోధిని' అను గ్రంథమొకటి. ఈ గ్రంథమందు గ్రహములకు చెందిన సమాచారము - కాంతి (లైట్) ఉష్ణము (ఉష్ణశక్తి -నేడు హీట్ అంటున్నాం), ధ్వని శాస్త్రము (సౌండ్), విమాన నిర్మాణ విధి విధానములు, విద్యుచ్ఛక్తి దాని ప్రయోగ విషయముల వంటి అనేక శాస్త్ర విషయాలు చెప్పబడ్డాయి. భరద్వాజ స్మృతి పేరిట ధర్మశాస్త్రాన్నందించారు. భారద్వాజ మహర్షి 'ఆకాశతంత్ర' మను మహాగ్రంథాన్ని రచించారు. దీనియందు నేటి శాస్త్ర విజ్ఞానానికి తెలియని అనేక విశేషాలను వివరించారు. ఏడు విధములైన ఆకాశములను, ఆకాశ నేత్రా విభాగాలను, ఆకాశంలో జరిగే అనేక శక్తి సంయోగ వివరాలు, ఆకాశమునందలి భూములు (సూపర్ ఎర్త్- ఇటీవల శాస్త్రజ్ఞులు చెప్పే మహాభూమి) ఆకాశంలోని కాంతి, శక్తి, అగ్ని, గ్రహములు, గ్రహ కక్ష్యలు తంత్రివార్త శాస్త్రము (టెలిఫోన్) వివరించబడ్డాయి. మనవారికి ఆకాశ తత్వము, దాని ఆద్యంతములే పూర్తిగా అవగతమగుటలేదు.

పురాణకాలంలో 32 రకాల విమానాల గురించి వివరించారు. భారద్వాజ మహర్షి యుద్ధ విమానాల గురించి కూడా తన బృహత్ విమాన యంత్ర శాస్త్రంలో వివరించారు. ఏ లోహాలతో విమానాన్ని తయారుచేయాలి, ఎటువంటి ఇంధనాన్ని వాడాలి, పైలట్లు ఆహార వస్త్రధారణ నియమాల వంటివి తెలియజేశారు మయుడు, భారద్వాజ మహర్షి 16 రకాల విమానలను చెప్పి వాటిని మరలా ఒక్కొక్కదానిని 8 తెగలుగా విభజించి 128 రకాలు చెప్పారు.

ఆధునిక కాలంలో తొలి విమాన నిర్మాతలు రైటు సోదరులు కాదు. వారు 1903 డిసెంబర్ 14న వారి విమానానికి రూపకల్పన చేశారు. కానీ అంతకు పూర్వమే 8 సంవత్సరాల పూర్వం అంటే 1895లో ముంబయి చౌపాతి సముద్ర తీరంలో శివరాంబాపూజి తల్పాడి అనే భారతీయ వేదపండితుడు తయారుచేసిన విమానం గాలిలో 1500 అడుగుల ఎత్తువరకు లేచింది. ఈ విమానానికిఆయన మరుత్యభ అని పేరు పెట్టారు. వేదాలు చెప్పిన తంత్ర విజ్ఞానం ఆధారంగా పాదరసం, సూర్యరశ్మిల సహాయంతో దీనిని నిర్మించారు. బొంబాయి ఆర్ట్సు సొసైటీ ఆధ్వర్యంలో ఆకాశయానం చేయించారు. ఈ విమానాన్ని అప్పటి బరోడా మహారాజు మహాదేవ్ గోవింద రాణా మొదలగు ప్రముఖులు వీక్షించారు. శివరాం బాపూజీ తల్పాడే మరాఠీ భాషలో ప్రాచీన విమాన విద్యేఛాశోధి అనే గ్రంథాన్ని రచించారు. తన భార్య మరణానంతరం నైరాశ్యంలో తన పరిశోధన విరమించుకొన్నారు. ఈయన వారసులు మరుత్సభి విమాన ప్లాన్‌ను ఒక ఆంగ్లేయ కంపెనీకి అమ్మివేశారు.

సనాతన భారతీయ మహర్షుల విజ్ఞానమొక మహా సింధువని చెప్పక తప్పదు. మన ఊహకందని విశ్వ విజ్ఞానాన్ని అందించారు. యుగయుగాల చరిత్రను తవ్వినకొద్దీ తెలిసేదేమంటే, నేటి విజ్ఞాన శాస్త్రానికి విభిన్నమైన పద్ధతిలో ఎన్నెన్నో చిత్ర విచిత్రమైన ఆవిష్కరణలు దర్శనమిస్తాయి. ఈజిప్టులో గ్రీస్‌లో, చైనాలో బయటపడ్డ ఆవిష్కరణల గురించి ఆరాటపడేవారు. భారత ఉపఖండంలో వెలుగు చూసిన అద్భుత వైజ్ఞానిక ఆవిష్కరణలపై దృష్టి సారించి, నేటి పరిశోధనలకు అనుసంధానం చేసుకుని పురోగమిస్తే వైజ్ఞానికంగానే కాక సర్వతోముఖాభివృద్ధి సాధించుకోవచ్చు. ఏదో సింధులోయలో హరప్పా, మొహంజదారో నాగరికతను గురించి ఇంకేవో తవ్వకాలలో దొరికిన వాటి గురించి నాలుగు మాటలు విని మురిసిపోవటం కాదు. భరతభూమిలోని ప్రతి నదీ తీరంలోను, ప్రతి పర్వత శ్రేణిలోను, విజ్ఞాన విభావరులు కాంతులీనిన దాఖలాలనేకం కనిపిస్తాయి. కాలగర్భంలో కలిసిపోయినవిగా మన మహర్షులందించిన విజ్ఞానమపారం. మహర్షులందించిన విజ్ఞాన గ్రంథాలను కొన్నింటిని చూద్దాం.


- ఇంకా ఉంది

సదాలోచనే సన్మార్గానికి దారి

మనసులో మంచి సంకల్పం అనే బీజం పడితే అది మొలకై, మొక్కై ఎదగడానికి గట్టి కృషి, పట్టుదల, కార్యదీక్ష కలిసి సమిష్టిగా పనిచేస్తాయి.

"మనుషులు ఎదుటివారు చేసిన పనులే చూస్తారు - భగవంతుడు మన మనసులోని సంకల్పాన్ని చూస్తాడు". ఒక్కొక్కసారి మంచి సంకల్పంతో మొదలుపెట్టిన పనులు కూడా వెంటనే మంచి ఫలితాన్ని ఇవ్వవు. ఫలితం సరిగా లేదు కనుక నీవు చేసే పనులన్నీ చెడు పనులే అని అనేయకూడదు. అతని సంకల్పమేమిటో చూడాలి. అందులో ఉన్న నిజాయితీచూడాలి. చేతనైతేఅవతలి వారి సంకల్పాన్ని నెరవేర్చడానికి చేయూతనివ్వాలి.

పాండవుల సంకల్పం, వారి ధర్మనిరతి చూశాడు కనుక శ్రీకృష్ణుడు వారితో



పాటు నిలిచాడు. పాండవ పక్షపాతి అని అన్నా చిరునవ్వు నవ్వాడు. ఎక్కడైనా భగవంతుడు మంచికి తోడుగా ఉంటాడు.

మంచి వ్యక్తిత్వం ఉంటే మంచి మనుషులుగా ఎదగగలుగుతారు.

రాముడు ధర్మపథంలో నడిచాడు. తండ్రి మాటను నిలబెట్టడానికి పదు నాల్గేండ్లు వనవాసం చేశాడు. అన్యాయంగా రావణుడు రాముని భార్యను అపహరించాడు. ఆమెను ఎన్నో బాధలు పెట్టాడు. కాని రాముడు సీత ఎక్కడుందో కనుగొన్నాడు. అపుడు అంగదుని సంధిచేసుకోమని పంపించాడు.

సీతను నాకు అప్పగించకపోతే యుద్ధానికి రమ్మని పిలిచాడు. అపుడు కూడా రావణుడు దుష్ట ఆలోచనలతో కూడి ఉన్నాడు కనుక రామరావణ పోరు జరిగింది. లోకకల్యాణ కారకుడైన అగస్త్యుడు వచ్చాడు. రామునికి సూర్యోపాసన చేయమని ఆదిత్యహృదయం బోధించాడు. రామరావణ పోరులో అధర్మపరుడైన రావణుడు నశించాడు. రాముడు విజేతగా నిల్చాడు. త్రేతాయుగం వాడైన రాముణ్ణి నేడుకూడా ప్రశంసిస్తారు. రామునిలాగా జీవించాలని అనుకొంటారు.

పోత పోసిన ధర్మస్వరూపమని కొనియాడుతారు. దీనికంతటి కారణం మాత్రం మంచి సంకల్పం రామునికి ఉండే కనుకనే. అతను నేటికి రాణింపబడుతూనే ఉన్నాడు. దుష్ట సంకల్పాలు ఎవరికైతే ఉంటాయో వారంతా మట్టిలో కలిసిపోవాల్సినవారే. వారి ఆనవాలు కూడా ఎవరూ పట్టించుకోరు. రాముని చరిత్ర చూసి మనం ధర్మాచరణ ఏవిధంగా చేయాలో నేర్చుకోవాలి.

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!


పూజా హెగ్డే



చివరివారం నుండి..

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఇప్పటికే ఓ షెడ్యూల్‌ను పూర్తిచేసుకున్న విషయం తెలిసిందే. ఓ వైపు సుకుమార్‌తో 'రంగస్థలం' చిత్రాన్ని చేస్తున్న చరణ్, ఆ షూటింగ్‌ను పూర్తిచేశాడు. దానితో బోయపాటి శ్రీను చిత్రానికి లైన్ క్లియర్ అవ్వడంతో రెండో షెడ్యూల్‌ను ఈనెల చివరిలో ప్రారంభిస్తారట. బోయపాటి మార్క్ కథతో రూపొందే ఈ చిత్రంలో చరణ్ కొత్తగా కన్పిస్తాడని తెలిసింది. డి.వి.వి క్రియేషన్స్ పతాకంపై డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా కైరా అద్వానీ నటిస్తోంది. త్వరలోనే పూర్తిచేసి మెగాస్టార్ బర్త్‌డేకు విడుదల చేయాలనే ఆలోచనలతో ఉన్నారట.

గౌతమ్ మీనన్‌తో..



తమిళ స్టార్ హీరో అజిత్, క్రేజీ దర్శకుడు గౌతమ్ మీనన్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎన్నై అరిందాల్' చిత్రం తెలుగులో 'ఎంతవాడు గానీ' పేరుతో విడుదలైంది. ఘనవిజయం సాధించిన ఈ సినిమా తరువాత మళ్లీ వీరిద్దరూ కలిసి ఆ చిత్రానికి సీక్వెల్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం అజిత్, శివ దర్శకత్వంలో 'విశ్వాసం' చిత్రంలో నటిస్తున్నాడు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఈనెల 22నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. ఈ సినిమా తరువాత అజిత్ గౌతమ్‌తో సినిమా చేస్తాడని వార్తలు వస్తున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక వివరాలు వెలువడే అవకాశం వుంది.

ప్రభాస్‌తో జోడీ!

దువ్వాడ జగన్నాథమ్ సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన అందాల భామ పూజా హెగ్డే జోరు ఎక్కడా తగ్గడంలేదు. ప్రస్తుతం తెలుగులో పలు క్రేజీ అవకాశాలతో బిజీగా వున్న ఈమెకు మరో బంఫర్ ఆఫర్ దక్కింది. ప్రస్తుతం 'సాహో' చిత్రంలో నటిస్తున్న ప్రభాస్, జిల్ దర్శకుడితో మరో సినిమాకు కమిట్ అయిన విషయం తెలిసిందే. 'సాహో' సినిమా విడుదలకు ఇంకా సమయం పట్టేలా వుండడంతో ఆయన ఫ్యాన్స్ అసహనంతో వున్నారట. వాళ్లను కూల్ చేయడానికి రాధాకృష్ణ సినిమాను సెట్స్‌పైకి తెచ్చేందుకు రెడీ అయ్యాడు. ఈ సినిమా కోసం నెల రోజులపాటు కాల్షీట్లను కేటాయించిన ప్రభాస్, త్వరలోనే సినిమా పూర్తిచేసి జూన్ వరకు విడుదల చేయాలని చెప్పాడట. ప్రస్తుతం ఆ కార్యక్రమాల్లో బిజీగా వున్న దర్శకుడు హీరోయిన్‌ను వెతికే పనిలో పడ్డాడు. ఇప్పటికే పలువురు హీరోయిన్లను పరిశీలించి పూజా హెగ్డేను తీసుకోవాలని భావించారట. ప్రస్తుతం ఆమెతో చర్చలు జరుపుతున్నారని తెలిసింది. ఇప్పటికే పూజ, మహేష్ సరసన వంశీ పైడిపల్లి చిత్రంలో ఎంపికైంది. దాంతోపాటు ఎన్టీఆర్-త్రివిక్రమ్‌ల సినిమాలో కూడా నటిస్తోంది. మొత్తానికి ముగ్గురు స్టార్ హీరోలతో జోడీకడుతున్న పూజ, మరోవైపు రంగస్థలంలో ఐటెం సాంగ్ కూడా చేస్తోంది.

సినిమాలందు 'అ!' సినిమా వేరయా



యువ హీరో నాని వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే డబుల్ హ్యాట్రిక్‌తో సంచలనం క్రియేట్ చేసిన నాని అటు నిర్మాతగా కూడా ప్రయత్నాలు చేస్తున్నాడు. కొత్త దర్శకుడు ప్రశాంత్ వర్మతో నాని నిర్మించిన 'అ!' చిత్రం ఈనెల 15న విడుదలకు సిద్ధమైంది. ప్రముఖ నటీనటులు కాజల్, రెజీనా, అవసరాల శ్రీనివాస్, నిత్యామీనన్, మురళీశర్మ, ప్రియదర్శి ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొత్తదనానికే కొత్తదనంగా రూపొందిన ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందని అంటున్నాడు నాని. ప్రమోషన్ విషయంలో కూడా భిన్నంగా చేస్తున్న ఈ సినిమా అమెరికాలో కూడా విడుదలవుతోంది. సినిమాలందు ఆ సినిమా వేరయా విశ్వదాభిరామ ఫిబ్రవరి 15న రిలీజ్‌రా మామా అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

యుద్ధం మొదలు..



ఘాటు అందాలతో బాలీవుడ్ ప్రేక్షకులని ఆకట్టుకున్న సన్నీలియోన్ అంటే ఎంతటి క్రేజ్ వుందో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. గ్లామర్ గాళ్‌గా ఆమెతో సినిమా చేయడానికి ఇప్పటికీ పలువురు దర్శక నిర్మాతలు ఆసక్తిగా ఎదురుచూస్తూనే వున్నారు. ఐటెం గాళ్‌గా, హాట్ గాళ్‌గా పలు పాత్రల్లో నటించిన సన్నీ, మొదటిసారి యుద్ధం చేయడానికి సిద్ధమైంది. సన్నీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'వీర మహాదేవి' చిత్రం చెన్నైలో ప్రారంభమైంది. వడి ఉడయాన్ దర్శకత్వంలో తెరకెక్కే ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో రూపొందే ఈ సినిమా కోసం సన్నీ కత్తియుద్ధాలు, గుర్రపు స్వారీ వంటివి నేర్చుకుంది. నేటినుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుందని, సన్నీ కెరియర్‌లో నిలిచిపోయే చిత్రంగా ఇది వుంటుందని సమాచారం. ఇన్నాళ్లు ఘాటు అందాలతో అదరగొట్టిన సన్నీ, ఇపుడు యుద్ధాలు చేస్తూ వీరనారిగా ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి!

భిన్నమైన సినిమాలు చేయాలని నాకూ ఉంది!

హీరో సాయిధరమ్ తేజ్



మెగా వారసత్వంతో పరిశ్రమలోకి ప్రవేశించి తొలి చిత్రంతోనే హీరోగా తనదైన ముద్రను వేసుకున్నాడు సాయిధరమ్ తేజ్. అటుపై కమర్షియల్ దారిలో వెళుతూ పలు విభిన్నమైన సినిమాలు చేశాడు. తాజాగా ఆయన ఇంటిలిజెంట్‌గా వస్తున్నాడు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రం నేడు విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా హీరో సాయిధరమ్‌తో ఇంటర్వ్యూ..

★ ఇంటిలిజెంట్ ఎవరు?

- ఖచ్చితంగా కథలోని హీరోనే. విలన్‌ని తన మైండ్ గేమ్‌తో ఎలా ఆడుకున్నాడు అనేదే సినిమా.

★ మీ పాత్ర గురించి?

- ఇందులో నేను సాఫ్ట్‌వేర్ యువకుడిగా కన్పిస్తాను. చిన్నప్పటినుంచి తన కంఫర్ట్ జోన్‌లోనే వుండే యువకుడు. కొన్ని పరిస్థితుల్లో ఆ కంఫర్ట్ జోన్ నుండి బయటకు రావాల్సి వస్తుంది. అలా వచ్చిన ఆ యువకుడు ఎలా ఇంటిలిజెంట్‌గా ప్రవర్తించాడు? తనకు సహకారమందించిన వ్యక్తులకు సపోర్టుగా నిలబడే పాత్ర.

★ ఇంతకీ కథేమిటి?

- ప్రస్తుతం సమాజంలో జరిగిన ఓ సంఘటన నేపథ్యంలో ఉంటుంది. కథ గురించి చెప్పలేను. సినిమా చూస్తే మీకే తెలుస్తుంది.

★ పాత్రకోసం కొత్తగా ఏదైనా ట్రై చేశారా?

- అలాంటిదేం లేదు. ఇది పక్కా కమర్షియల్ సినిమా. నేను ఏ సినిమా చేసినా ప్రతి పాత్రా కొత్తగానే వుంటుంది. ఈ పాత్రను కూడా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు.

★ ఈమధ్య వరుస పరాజయాలతో వున్నారు? ఎనలైజ్ చేసుకుంటారా?

- తప్పకుండా. ప్రతి సినిమా హిట్ అవ్వాలనే చేస్తాం. కొన్నిసార్లు మనం చేసిన ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. అంతెందుకు, జవాన్ చిత్రం నాకు బాగా నచ్చింది. కానీ ప్రేక్షకులకు చేరలేకపోయింది.

★ వినాయక్ గురించి?

- వినాయక్ లాంటి పెద్ద దర్శకుడితో పనిచేయడం నిజంగా అదృష్టమని చెప్పాలి. చిరంజీవి కమ్‌బ్యాక్ చిత్రం చేసిన ఆయన వెంటనే నాతో సినిమా చేయడం ఆనందం కలిగించే విషయం. ఆయనతో చాలా సరదాగా ఉంటుంది. దర్శకుడిగా ఆయన మార్క్ ఏమిటో అందరికీ తెలుసు. అదే స్టైల్‌లో తెరకెక్కించారు.

★ కథ నచ్చి ఒప్పుకున్నారా? లేక దర్శకుడి కోసమా?

- వినాయక్ దర్శకత్వంలో సినిమా అనగానే ఓకె చెప్పాను. అలాగని కథ వినకుండా ఉండలేదు. ఆయన కథ చెప్పే నన్ను ఒప్పించారు. ఆకుల శివ అద్భుతమైన కథను ఇచ్చారు.

★ రెగ్యులర్ కమర్షియల్ సినిమాలే చేస్తున్నారు? భిన్నమైన సినిమాలు చేయరా?

- నేను కూడా కొత్త తరహా సినిమాలు చేయాలని ఎదురుచూస్తున్నా. నా దగ్గరికి వస్తున్న కథలన్నీ ఇలాగే వుంటున్నాయి. ఖచ్చితంగా భిన్నమైన సినిమాలు తప్పకుండా చేస్తా. ముందు అయితే వచ్చిన అవకాశాన్ని వందశాతం ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నా.

★ కథ విషయంలో మీ నిర్ణయం ఎలా వుంటుంది?

- ఒక్కసారి కథ నా పాత్ర గురించి విన్న తరువాత మధ్యలో వేలుపెట్టను. అలాగే ఇతర పాత్రలు హీరోయిన్ల గురించి కూడా పట్టించుకోను. అవన్నీ దర్శకుడే చూసుకోవాలి. ఒక్కసారి సెట్స్‌పైకి వస్తే ఎక్కడా ఆగకూడదు.

★ హీరోయిన్ లావణ్య గురించి?

- లావణ్య చాలా స్వీట్ పర్సన్. మంచి నటి కూడా. ఈ పాత్రలో చాలా చక్కగా చేసింది. మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంటుంది.

★ చిరంజీవి, పవన్‌కళ్యాణ్‌లను ఇమిటేట్ చేస్తున్నారని అంటున్నారు?

- ఎక్కడో ఒకటి రెండు సీన్లలో అలా వుంటుంది తప్ప, సినిమా మొత్తంగా ఉండదు. ఎందుకంటే నేను ఆ ఫ్యామిలీ నుంచి వచ్చాను కాబట్టి, ఏది చేసినా అలాగే అనుకుంటారు. ఇక రీమిక్స్ పాటల గురించి అయితే అది దర్శకుల నిర్ణయమే. ఈ సినిమాలో కూడా వినాయక్ సలహాతోనే ఇందులో ఆ సాంగ్ చేయడం జరిగింది.

★ ఇతర హైలెట్ అంశాలు?

- తమన్ ఇచ్చిన పాటలు మంచి హిట్‌గా నిలిచాయి. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా బాగుంటుంది. ఫొటోగ్రఫి, ఎడిటింగ్ లాంటి విషయాలు కూడా ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా మా నిర్మాత కల్యాణ్‌గారూ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు.

★ మీ ఫ్రెండ్ రెజీనా ఓ హీరోతో లవ్‌లో పడడం వల్ల కెరీర్ డిస్టర్బ్ అయిందని చెప్పింది, దీని గురించి మీరేమంటారు?

- రెజీనా పర్సనల్ విషయం గురించి నేనేం చెప్పలేను. ఆమె నాకు బెస్ట్ ఫ్రెండే కానీ, ఆ విషయాలు గురించి తనెప్పుడూ నాతో మాట్లాడలేదు.

★ తదుపరి చిత్రాలు?

- ప్రస్తుతం కరుణాకరన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను.

- శ్రీ